www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


జైలుకు వెళ్లేముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న కేజ్రీవాల్

మళ్లీ తిహాడ్‌కు కేజ్రీవాల్
జైలుకు వెళ్లే ముందు తల్లిదండ్రులకు పాదాభివందనం.. మహాత్మునికి శ్రద్ధాంజలి
హనుమాన్ మందిరంలో పూజలు
ఎప్పుడు వస్తానో తెలియదని వ్యాఖ్య
2

సోమవారం | 3-6-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 48
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 12.19 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అశ్విని రా. 12.05 తదుపరి భరణి; వర్జ్యం: రా. 8.20-9.50; దుర్ముహూర్తం: మ. 12.39-1.31, మ. 3.15-4.07; అమృతఘడియలు: సా. 5.21-6.51; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.43
విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ఆదివారం కర్నూలులోని జగన్నాథగుట్ట వద్ద కమ్ముకున్న కారుమేఘాలు

తొలకరి పలకరింపు
రాయలసీమ నుంచి నెల్లూరు వరకు విస్తరణ
2-3 రోజుల్లో కోస్తాకు కూడా రుతుపవనాలు
మొదలైన తొలకరి... పలు జిల్లాల్లో వర్షాలు
మరో 3 రోజులపాటు కొనసాగే అవకాశం

రాష్ట్రంలోకి మూడు రోజుల ముందే నైరుతి
విశాఖపట్నం, అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగాన్ని తొలకరి పలకరించింది. మూడు నెలలుగా ఎండ తీవ్రత, వర్షాభావంతో అల్లాడిన ప్రజలు, రైతులకు ఊరటనిచ్చేలా నైరుతి రుతుపవనాలు మూడు రోజులు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మే 30న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు ఆదివారం రాయలసీమలోని అనేక భాగాలు, దక్షిణ కోస్తాలోని నెల్లూరు వరకు విస్తరించినట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. సాధారణంగా జూన్ ఐదో తేదీకల్లా రాయలసీమ, దక్షిణ కోస్తాలో కొన్ని భాగాల్లోకి రుతుపవనాలు ప్రవేశిస్తుంటాయి. అయితే దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతం, కేరళకు ఆనుకుని అరేబియా సముద్రంలో వేర్వేరుగా
మిగతా 12వ పేజీలో...


వర్షాలు పడడంతో అనంతపురం జిల్లా పాల్తూరు సమీపాన ఉధృతంగా ప్రవహిస్తున్న వంక


కూటమిదే పీఠం
98-120 సీట్లు వచ్చే అవకాశం!
అసెంబ్లీ ఫలితాలపై 'ఇండియా టుడే' ఎగ్జిట్ పోల్
వైసీపీకి 55 నుంచి 77 స్థానాలు
అతి పెద్ద పార్టీగా టీడీపీ
78-96 సీట్లు వచ్చే చాన్సు
జనసేనకు 16-18, బీజేపీకి 4-6
మొత్తంగా ఎన్డీయేకి 51% ఓట్లు
వైసీపీ 44 శాతానికే పరిమితం?

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీ కూటమికే అధికారం దక్కబోతోందని 'ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా' ఎగ్జిట్ పోల్ పేర్కొంది. లోక్‌సభ స్థానాలపై శనివారం ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విడుదల చేసిన ఈ సంస్థ.. అసెంబ్లీ సీట్లపై అంచనాలను ఆదివారం విడిగా వెల్లడించింది. దీని ప్రకారం.. 175 స్థానాల రాష్ట్ర అసెంబ్లీలో టీడీపీ కూటమికి 98 నుంచి 120 వరకు
మిగతా 11వ పేజీలో...

'ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా' అంచనా

పార్టీ	అసెంబ్లీ సీట్లు
టీడీపీ	78-96
జనసేన	16-18
బీజేపీ	4-6
వైసీపీ	55-77
కాంగ్రెస్	0-2

గెలుస్తున్నాం.. రేపంతా జాగ్రత్త!
కౌంటింగ్ రోజు అల్లర్లు జరిగే అవకాశం
ఏజెంట్లు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి
పూర్తి ఫలితాలు వచ్చేదాకా అశ్రద్ధ వద్దు
డిక్లరేషన్ తీసుకున్నాకే బయటకు రావాలి
కూటమి అభ్యర్థులతో బాబు జూమ్ కాన్ఫరెన్స్
అరుణ్‌సింగ్, పురందేశ్వరి, నాదెండ్ల హాజరు

కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం


అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోతోందన్నారు. రాష్ట్రంలో విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు బాగా సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. జనసేన అధినేత
మిగతా 11వ పేజీలో...

రేపే కౌంటింగ్



అవాంతరాలు కల్పిస్తే బయటికే
అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు
కౌంటింగ్ కేంద్రంలోకి పెన్ను, పేపర్‌కే అనుమతి
ఓట్ల లెక్కింపు జరిగే రోజుతో పాటు దానికి ముందు, తర్వాతి రోజుల్లో భావోద్వేగాలు అదుపు తప్పే చాన్స్
ఆ ఉద్రిక్తతల ప్రభావం కౌంటింగ్‌పై పడకూడదు
శాంతి భద్రతల పరిరక్షణలో ఏ మాత్రం రాజీపడొద్దు
కౌంటింగ్ పూర్తయిన వెంటనే ప్రతి ఈవీఎంకు సీల్
ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక ఏజెంట్‌కు అనుమతి
సీఈవో ముఖేశ్ కుమార్ మీనా ఆదేశాలు
కౌంటింగ్ ఏర్పాట్లపై ఎన్నికల అధికారులతో సమీక్ష

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఈ నెల 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో
మిగతా 11వ పేజీలో...


అరుణాచల్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి అశోక్ సింఘాల్, ఇతర నేతలతో మిఠాయిలు పంచుకుంటున్న ముఖ్యమంత్రి పెమా ఖండూ

అరుణాచల్‌లో బీజేపీ హ్యాట్రిక్
గతంతో పోలిస్తే.. మరో 5 సీట్లు అధికం
10 ఏకగ్రీవం.. 36 చోట్ల ఘన విజయం
విపక్ష హోదా దక్కని ఇతర పార్టీలు
సిక్కింలో ఎస్‌కేఎం ఏకపక్ష విజయం
రెండు స్థానాల్లో గెలిచిన సీఎం తమాంగ్
2 చోట్లా ఓడిన మాజీ సీఎం చామ్లింగ్
ఇరు రాష్ట్రాల నేతలకు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 2: అరుణాచల్ ప్రదేశ్‌లో కాషాయ జెండా రెపరెపలాడింది. బీజేపీ ఇక్కడ హ్యాట్రిక్ సాధించి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. సిక్కింలో.. సిక్కిం క్రాంతి మోర్చా (ఎస్‌కేఎం) రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏప్రిల్ 19న ఎన్నికలు జరగ్గా.. లోక్‌సభతోపాటు ఫలితాలను ఈ నెల 4న ప్రకటించాల్సి ఉంది. అయితే.. ఆదివారంతో ఈ రెండు రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి ముగియనుండడంతో..
మిగతా 2వ పేజీలో...

సుప్రీంకు 'పోస్టల్ బ్యాలెట్' పంచాయితీ!
హైకోర్టు తీర్పును సవాల్ చేసిన వైసీపీ
తన వాదనా వినాలని టీడీపీ నేత వెలగపూడి కేవియట్

11

'ఫ్రీహోల్డ్' ముసుగులో స్కాం
అసైన్డ్ భూములకు హక్కుల సర్టిఫికెట్ల జారీలో భారీ అక్రమాలు
3
10 లక్షల ఎకరాలకు పత్రాలు జారీ
వేల కోట్లు దోచిన జవహర్ బినామీలు
సీఎస్ అత్యంత అవినీతిపరుడు
సహకరించిన విశాఖ కలెక్టర్
జనసేన నేత మూర్తి యాదవ్ ఆరోపణ

భర్త తరపున లంచం తీసుకుంటే భార్యకూ శిక్ష
అక్రమ సంపాదన ఫలితాన్ని అనుభవించాల్సిందే
కింది కోర్టు తీర్పును ఆమోదించిన మద్రాసు హైకోర్టు
2


ఆదివారం ఢిల్లీలో అధికారులతో సమీక్షలో ప్రధాని మోదీ

'100 రోజుల అజెండా'పై చర్చ!?
మూడోసారి ప్రభుత్వం ఏర్పడ్డాక కీలక నిర్ణయాలుంటాయని గతంలోనే చెప్పిన ప్రధాని!
తుఫాను, వడగాడ్పులు సహా పలు అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించిన మోదీ
2


కన్యాకుమారిలో నా ఆధ్యాత్మిక సాధన
అది సాగరాల సంగమమే కాదు.. దేశ సైద్ధాంతిక సంగమ క్షేత్రం కూడా
మన సంస్కరణలు వికసిత్ భారత్ లక్ష్యసాధనకనుగుణంగా ఉండాలి
ప్రపంచం మనవైపు ఆశగా చూస్తోంది.. యువతే మనకు బలం
కన్యాకుమారి నుంచి తిరిగి వెళ్తూ విమానంలో ప్రధాని మోదీ వ్యాసం


ఆదివారం ఢిల్లీలో రాహుల్, ఖర్గే, కేసీ వేణుగోపాల్

ఎగ్జిట్ పోల్స్ అన్నీ బోగస్
బీజేపీ ఆడుతున్న మైండ్‌గేమ్.. మేం మంచి ఫలితాలు సాధిస్తాం
ఇండియా కూటమిదే అధికారం: కాంగ్రెస్
అవి మోదీ మీడియా పోల్స్.. రాహుల్ గాంధీ విమర్శ
పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో ఖర్గే, రాహుల్ జూమ్ మీటింగ్

న్యూఢిల్లీ, జూన్ 2: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శనివారం వివిధ సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌ను కాంగ్రెస్ పార్టీ కొట్టిపారేసింది. తాము మంచి ఫలితాలు సాధించబోతున్నామని, ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని ప్రకటించింది. ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ.. వివిధ రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కౌంటింగ్ రోజు అక్రమాలకు పాల్పడి.. ఫలితాలను తారుమారు
మిగతా 2వ పేజీలో...

మరో కరెంటు షాక్!
ఎక్కువ విద్యుత్ వాడారంటూ నోటీసులు
దరఖాస్తులో పేర్కొన్న 'సామర్థ్యం' మేరకే వినియోగించాలంటున్న డిస్కమ్‌లు
పరిమితి దాటితే అదనపు డిపాజిట్
సగటు వినియోగం ఆధారంగా వసూలు
ఎగువ మధ్యతరగతిపై అదనపు భారం
ఇప్పటికే సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలు
జగన్ పాలనలో తొమ్మిదిసార్లు మోత



(అమరావతి-ఆంధ్రజ్యోతి)
గడచిన ఐదేళ్లుగా ఇంధన సర్దుబాటు, ఆదాయ వ్యయాల వ్యత్యాసం నివారణలో భాగంగా ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం మోపారు. ఇప్పుడు ఎక్కువగా కరెంటు వాడుతున్న వినియోగదారులపై మరో బాదుడు మొదలు పెట్టారు. కనెక్షన్ తీసుకునే సమయంలో ఏ మేరకు విద్యుత్ వాడకం అవసరం ఉంటుందో పేర్కొన్న వినియోగదారులు... అంతకంటే ఎక్కువగా వాడితే డిస్కమ్‌లు షోకాజ్ నోటీసులు పంపుతున్నాయి. దరఖాస్తులో పేర్కొన్న కెపాసిటీని మించి విద్యుత్ వాడుతున్నందున అదనపు డిపాజిట్ చెల్లించాలని నోటీసులు ఇస్తున్నాయి. ఈ డిపాజిట్ మొత్తాలు వేల రూపాయల్లో ఉండటంతో వినియోగదారులు లబోదిబో మంటున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో కరెంటు చార్జీలు తొమ్మిదిసార్లు పెంచారు. ఇప్పుడు డిపాజిట్‌ల పేరిట మోయలేనంత భారం వేయడం ఏమిటంటూ సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ అదనపు లోడ్ భారం సగటున ఐదు వేల నుంచి పది వేల రూపాయల దాకా ఉంటోంది. దీంతో కనెక్షన్ ఉంచాలో, తీసివేయాలో తెలియని అయోమయ
మిగతా 12వ పేజీలో...

తుపాకీ గురిపెట్టి ఒప్పుకోమన్నారు
2 లక్షలు డబ్బులిస్తామన్నారు.. నిద్రపోతుంటే తీసుకెళ్లారు
సీఎం జగన్‌పై దాడి జరిగిన ప్రాంతానికే వెళ్లలేదు
గులకరాయి కేసులో నిందితుడు సతీష్ వెల్లడి
నెల్లూరు జైలు నుంచి బెయిల్‌పై విడుదల
కోడికత్తి-2 చేయాలనుకున్నారు: న్యాయవాది సలీం


మీడియాతో మాట్లాడుతున్న సతీష్‌కుమార్, లాయర్ సలీం

నెల్లూరు(క్రైం), జూన్ 2: సీఎం జగన్‌పై గులకరాయి దాడి కేసులో పోలీసులు అరెస్టు చేసిన వేముల సతీష్‌కుమార్ ఆదివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులో డిఫెన్స్ లాయర్‌గా ఉన్న అబ్దుల్ సలీం ఆదివారం జైలు వద్దకు చేరుకుని బెయిల్ పత్రాలను అధికారులకు అందించారు. ఆ తర్వాత సతీష్‌ను జైలు నుంచి విడుదల చేశారు. జైలు నుంచి బయటకు
మిగతా 12వ పేజీలో...

అమూల్ పాల ధర పెంపు

లీటర్‌పై రూ. 2... నేటి నుంచే అమలు

అహ్మదాబాద్, జూన్ 2: అమూల్ పాల ధర పెరిగింది. లీటర్‌పై రూ. 2 పెరగనున్నట్లు, అన్ని వేరియంట్ల(అమూల్, గోల్డ్, శక్తి)కు ఇది వర్తించనున్నట్లు గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ తెలిపింది. సోమవారం(జూన్ 3) నుంచే దేశవ్యాప్తంగా ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. పాల సేకరణ, ఉత్పత్తిలో పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకొనే ధరల్ని పెంచుతున్నట్లు సంస్థ ఎండీ జయెన్ మెహతా పేర్కొన్నారు.

ఎగ్జిట్ పోల్స్ అన్నీ బోగస్



(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు బీజేపీ ప్రయత్నించే అవకాశం ఉందని, పార్టీ నేతలు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, ఎగ్జిట్ పోల్స్ అన్నీ బోగస్ అని, పదవుల నుంచి దిగిపోనున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సృష్టించినవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. కాంగ్రెస్ శ్రేణుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేందుకు ఆడుతున్న మైండ్‌గేమ్ అని అన్నారు. మోదీ ఆదివారం అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించడం..తాను మళ్లీ ప్రధాని కాబోతున్నానని వారికి సంకేతం ఇవ్వడం, వారిపై ఒత్తిడి తెచ్చేందుకేనని జైరాం రమేశ్ విమర్శించారు. అలాంటి ఒత్తిళ్లకు అధికారులు భయపడకుండా ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా చూస్తారని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇండియా కూటమి పార్టీల సమావేశంలో రాష్ట్రాల వారీగా విశ్లేషణ చేశామని, తమ కూటమికి 295పైనే సీట్లు వస్తాయని, అంతకు తగ్గే అవకాశమే లేదన్నారు.

అవి మోదీ మీడియా పోల్స్: రాహుల్ గాంధీ

ఎగ్జిట్ పోల్స్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కొట్టిపారేశారు. 'అవి ఎగ్జిట్ పోల్స్ కాదని, 'మోదీ మీడియా పోల్స్' అని వ్యాఖ్యానించారు. అవి మోదీ ఊహాగానాలని పేర్కొన్నారు. ఇండియా కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్న విలేకరుల ప్రశ్నకు రాహుల్ బదులిస్తూ 'మీరు సిద్ధూ మూసేవాలా పాట '295' విన్నారా? కాబట్టి 295' అని చెప్పారు. బీజేపీ అనుకూల మీడియా సంస్థలు ఆ పార్టీకి 300 సీట్లకు పైగా కట్టబెడతాయని తాము ముందే చెప్పామని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ ఈ ఎగ్జిట్ పోల్స్‌ను ఉపయోగించుకుని సోమవారం షేర్ మార్కెట్‌లో లాభపడాలని చూస్తోందన్నారు. ఎగ్జిట్ పోల్స్ 'కార్పొరేట్ గేమ్', దగా అని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు. వాటిని నిర్వహించిన మీడియా సంస్థలపై ఒత్తిడి ఉందన్నారు.

కలెక్టర్లకు ఫోన్‌లో షా బెదిరింపులు: జైరాం

న్యూఢిల్లీ, జూన్ 2: దాదాపు 150 మంది జిల్లా కలెక్టర్లకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్‌లు చేసి బెదిరించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దీనిపై ఈసీ స్పందించింది. ఈ మేరకు ఏ ఒక్క కలెక్టరు నుంచి తమకు ఫిర్యాదులు అందలేదని తెలిపింది. ఆ ఫోన్ కాల్స్‌కు సంబంధించి సమాచారం అందించమని జైరాం రమేశ్‌ను కోరింది. జిల్లా కలెక్టర్లకు అమిత్‌షా ఫోన్‌లు చేసి బెదిరించారని, ఇది బీజేపీ ఎంత నిరాశతో ఉందో తెలియజేస్తున్నదని, అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని రమేశ్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జిల్లా కలెక్టర్లు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. అలాంటి వారికి బెదిరింపులు వచ్చాయని ఓ బాధ్యత కలిగిన సీనియర్ నేత వ్యాఖ్యానించడం ప్రజల్లో ఎన్నో అనుమానాలు రేకెత్తిస్తోందని, కాబట్టి ఇందుకు సంబంధించిన వివరాలు అందించాలని, చర్యలు తీసుకుంటామని అని రమేశ్‌కు ఈసీ తెలిపింది.

మళ్లీ జైలుకు కేజ్రీవాల్



తిహాడ్ జైలుకు వెళ్లే ముందు కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆదివారం మళ్లీ తిహాడ్ జైలుకు వెళ్లారు. జైలుకు వెళ్లడానికి ముందు తన నివాసంలో తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆ తర్వాత భార్య సునీతా కేజ్రీవాల్, ఆప్ నేతలు అతీశీ, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గహ్లోత్ సహా ఇతర ముఖ్య నేతలతో కలిసి రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మా గాంధీ సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. ఉదయం ఢిల్లీ ఆప్ కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం తనకు 21 రోజుల మధ్యంతర బెయిల్ ఇచ్చినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. 21 రోజుల్లో ఒక్క సెకను కూడా వృథా చేయలేదన్నారు. ఆమ్ ఆద్మీ కోసమే కాకుండా అనేక పార్టీల కోసం ప్రచారం చేశానని గుర్తు చేశారు. జైలు నుంచి మళ్లీ ఎప్పుడు బయటకు వస్తానో తెలియదన్నారు. కాగా, కేజ్రీవాల్‌ను జూన్ 5 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిస్తూ గతంలో ప్రత్యేక కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించండి

» ఈసీఐకి విపక్ష ఇండియా కూటమి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీలు భారత ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) కలిశాయి. మంగళవారం కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరిగాకే.. ఈవీఎంలను తెరవాలని ఇండియా కూటమి కోరింది. ఈసీఐని కలిసిన 13 మంది ఇండియా కూటమి నేతల్లో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్సీపీ(ఎస్పీ) నేత శరద్‌పవార్, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తదితరులున్నారు. "ఈసారి వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో పోస్టల్ ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందుకే.. తొలుత వాటిని లెక్కించాలి" అని కోరుతూ వారు ఈసీఐకి రెండు వినతిపత్రాలు సమర్పించారు. కాగా.. ఇండియా కూటమి నేతలు ఈసీఐని కలిసి వెళ్లిన కొద్దిసేపటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ నేతృత్వంలోని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ తదితరుల బృందం ఎన్నికల కమిషన్‌ను కలిసింది. "కొన్ని శక్తులు ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ కుట్రలను గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రోటోకాల్‌ను పకడ్బందీగా పాటించాలి. ఫలితాల వెల్లడి సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలి" అని మంత్రుల బృందం కోరింది.

ఒడిశాలో బీజేడీ, బీజేపీ అమీతుమీ

న్యూఢిల్లీ, జూన్2: ఒడిశా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్‌ను యాక్సిస్ ఇండియా ఆదివారం వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం 147 అసెంబ్లీ సీట్లకు గాను బీజేపీకి 62-80 సీట్లు రావొచ్చని, మరోవైపు సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని అధికార బీజేడీ(బిజూ జనతాదళ్)కి సైతం అన్నే సీట్లు(62-80) రావొచ్చని అంచనా వేసింది. 2019ఎన్నికల్లో బీజేపీ కేవలం 23 సీట్లు గెలుచుకోగా బీజేడీ 112స్థానాలు కైవసం చేసుకొంది. కాంగ్రెస్ తొమ్మిది సీట్లకే పరిమితమైంది. కాగా, బీజేడీ గెలిచి నవీన్ పట్నాయక్ వరుసగా ఆరోసారి సీఎం అవుతారో, లేక ఆయన విజయపరంపరకు బీజేపీ అడ్డుకట్ట వేస్తుందో మంగళవారం తేలిపోతుంది.

అరుణాచల్‌లో బీజేపీ హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) కౌంటింగ్‌ను రెండ్రోజులు ముందుకు జరిపింది.

10 ఏకగ్రీవాలతో కమల వికాసం

అరుణాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలకు ముందే బీజేపీ విజయం దాదాపు ఖరారైంది. అక్కడ 60 అసెంబ్లీ స్థానాలకు గాను 10 చోట్ల కమలనాథులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 50 నియోజకవర్గాలకు పోలింగ్ జరగ్గా.. బీజేపీ 36 స్థానాలను దక్కించుకుంది. విపక్ష హోదా(6 సీట్లు)ను ఇతర పార్టీలేవీ దక్కించుకోకపోవడం గమనార్హం. నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీఈపీ) ఐదు స్థానాల్లో గెలుపొందగా.. పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్(పీపీఏ) రెండు, ఎన్సీపీ మూడు, కాంగ్రెస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. స్వతంత్రులు మూడు చోట్ల గెలుపొందడం గమనార్హం. 2019లో బీజేపీ అరుణాచల్‌లో 41 సీట్లు సాధించగా.. ఈ సారి మరో 5 స్థానాల్లో ఆ పార్టీ బలం పెరిగింది.



తిరిగి ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న పెమాఖండూ



విజయోత్సాహంలో సిక్కిం సీఎం ప్రేమ్‌చంద్

ఎస్‌కేఎందే సిక్కిం

సిక్కింలో అధికార పార్టీ ఎస్‌కేఎం మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. 32 స్థానాలున్న సిక్కిం అసెంబ్లీలో అధికారాన్ని చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 17. అయితే.. సిక్కిం ప్రజలు ఎస్‌కేఎంకు ఏకపక్ష విజయాన్ని కట్టబెడుతూ 31 స్థానాల్లో ఆ పార్టీని గెలిపించారు. సీఎం ప్రేమ్ సింగ్ తమంగ్ రెండుచోట్లా విజయం సాధించారు. ఆయన భార్య కృష్ణకుమారి కూడా ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే.. 39 ఏళ్లుగా అప్రతిహతంగా విజయం సాధిస్తూ.. 25 ఏళ్లలో వరుసగా ఐదు సార్లు సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్)కు అధికారాన్ని కట్టబెట్టిన మాజీ సీఎం పవన్‌చామ్లింగ్ ఈసారి పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఓటమిని చవిచూశారు. ఆ పార్టీ ఈసారి ఒక్క స్థానానికే పరిమితమైంది. అరుణాచల్, సిక్కిం ప్రజలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. అరుణాచల్ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని కొనియాడారు.


నేడు ఈసీ మీడియా సమావేశం

కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. సార్వత్రిక ఎన్నికల ముగింపుపై ఈసీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారని తెలుస్తోంది. 18వ లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1వరకు మొత్తం ఏడు దశల్లో జరిగాయి. 2019 సార్వత్రిక ఎన్నికల వరకు ప్రతి దశ పోలింగ్ ముగిసిన తర్వాత డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు మీడియా సమావేశాన్ని నిర్వహించి వివరాలను తెలియజేసేవారు. కానీ ఈ సారి ఆ సంప్రదాయానికి ఈసీ స్వస్తి పలికింది.

అరుణాచల్(60)	
బీజేపీ	46
ఎన్‌పీపీ	5
ఎన్‌సీపీ	3
పీపీఏ	2
కాంగ్రెస్	1
స్వతంత్రులు	3

సిక్కిం(32)	
ఎస్‌కేఎం	31
ఎస్‌డీఎఫ్	1

'100 రోజుల అజెండా'పై ప్రధాని మోదీ చర్చ!?



న్యూఢిల్లీ, జూన్ 2: ప్రధాని మోదీ ఆదివారం ఉన్నతాధికారులతో పెద్ద ఎత్తున సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారీ అధికారం బీజేపీదేనంటూ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడడంతో కమలనాథుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఇక లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే కన్యాకుమారిలోని వివేకానంద రాక్‌మెమోరియల్‌లో దాదాపు 45 గంటల పాటు ధ్యానం చేసిన ప్రధాని.. అది ముగిసిన తర్వాత ఢిల్లీ చేరుకున్నారు. వివిధ అంశాలపై సమీక్షలతో ఆయన క్షణం తీరిక లేకుండా గడిపారు. ఫలితాలు రాకముందే.. కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేశాక అమలు చేయాల్సిన 'తొలి 100 రోజుల' ప్రణాళికపైనా ప్రధాని మోదీ సమీక్షించినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికంటే ముందే మోదీ.. మళ్లీ తామే అధికారంలోకి వస్తామని, తొలి 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేయాలని తన మంత్రివర్గ సహచరులను కోరిన సంగతి తెలిసిందే. కొన్ని కీలక, ప్రధాన నిర్ణయాలన్నీ తొలి 100 రోజుల్లోనే ఉంటాయని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెల్లడై, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి 100 రోజుల అజెండాపై సమీక్ష జరిపినట్లు సమాచారం. ఈశాన్య రాష్ట్రాలను అతలాకుతలం చేసిన రీమల్ తుపాను, వరదలపై మోదీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. తుపాను, వరదల కారణంగా మిజోరం, అసోం, మణిపూర్, మేఘాలయ, త్రిపురల్లో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టంపై అధికారులు మోదీకి వివరించారు. బాధిత రాష్ట్రాలకు కేంద్రం తరఫు నుంచి అన్ని విధాలుగా సాయం చేయాలని, అండగా నిలవాలని ప్రధాని అధికారులను ఆదేశించారు. తర్వాత ఆయన ఎండలు, వడగాడ్పుల వల్ల చోటుచేసుకుంటున్న మరణాలు, బాధిత కుటుంబాలకు సాయంపై సమీక్షించారు. దేశవ్యాప్తంగా ఇటీవల పలు అగ్నిప్రమాదాలు సంభవించి పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. ఆస్పత్రులు, ఇతర ప్రజా ప్రాంగణాల్లో అగ్నిమాపక, విద్యుత్తు భద్రతలపై క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ప్రధాని మోదీ అధికారులకు స్పష్టం చేశారు. ఈ అంశంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటితోపాటు ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాలపైనా ఆయన ఉన్నతాధికారులతో చర్చించారు. ఇలా ప్రధాని ఏడు సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

లోకం తీరు



భర్త తరఫున లంచం తీసుకుంటే భార్యకూ శిక్ష

కింది కోర్టు తీర్పుకు మద్రాసు హైకోర్టు ఆమోదం

మదురై, జూన్ 2: ప్రభుత్వ ఉద్యోగి తీసుకునే లంచంలో భార్యకు భాగస్వామ్యం ఉంటే ఆమె కూడా శిక్షకు అర్హురాలేనని మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ అభిప్రాయపడింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులో భర్తతో పాటు భార్యకు కూడా శిక్ష వేస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయడానికి తిరస్కరించింది. భర్త తరఫున భార్య లంచం పుచ్చుకోవడం తప్పేనని, ఇందుకు ఆమెకు శిక్ష వేయాల్సి ఉంటుందని పేర్కొంది. 1992 జనవరి 1 నుంచి 1996 డిసెంబరు 31 వరకు ఆదాయానికి మించి రూ. 6.77 లక్షలు అధికంగా కలిగి ఉన్నారంటూ పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ శక్తివేల్‌పై కేసు నమోదయింది. తిరుచ్చిలోని డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ (డీవీఏసీ) పోలీసులు ఆయనతో పాటు, లంచం సొమ్ము తీసుకున్నందుకు ఆయన భార్య దైవ నాయకిపైనా కేసు పెట్టారు. కేసు విచారణలో ఉండగానే శక్తివేల్ మరణించారు. విచారణ జరిపిన అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు దైవ నాయకికి ఏడాది జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ 2017లో తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె మద్రాసు హైకోర్టులోని మదురై బెంచ్‌లో అప్పీలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ కె.కె.రామకృష్ణన్ కింది కోర్టు ఇచ్చిన కొట్టివేయడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత భార్యపై ఉంది. ఆ సొమ్ముతో వారు సంతోషపడ్డారంటే ఆ బాధను కూడా అనుభవించాల్సిందే. భర్త తరఫున లంచం తీసుకుంటే ఇంటి నుంచే అవినీతి ఆరంభమవుతుంది. అవినీతిలో ఇల్లాలికి కూడా భాగస్వామ్యం ఉంటే ఇక అక్రమాలకు అంతం ఉండదు. అక్రమ సంపాదన కారణంగా దైవనాయకి జీవితం పూలపాన్పులా ఉంది. అందువల్ల ఆమె ప్రతిఫలాన్ని..అంటే శిక్షను అనుభవించాల్సిందే" అని స్పష్టం చేశారు.

కన్యాకుమారిలో నా ఆధ్యాత్మిక సాధన



ఆ గడ్డ సాగరాల సంగమ క్షేత్రమే కాదు.. దేశ సైద్ధాంతిక సంగమ క్షేత్రం కూడా

- మన సంస్కరణలు.. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు అనుగుణంగా ఉండాలి
- కాలం చెల్లిన ఆలోచనలు, విశ్వాసాలను పునర్నిర్వచించుకోవాల్సిన సమయమిది
- ప్రపంచం మనవైపు ఆశగా చూస్తోంది.. యువతే మన దేశానికి గొప్ప బలం
- కన్యాకుమారి నుంచి తిరుగుప్రయాణంలో విమానంలో ప్రధాని మోదీ వ్యాసం

కన్యాకుమారి సాగరాల సంగమ క్షేత్రమే కాక.. సైద్ధాంతిక సంగమ క్షేత్రం కూడా అని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రపంచమంతా భారతదేశంవైపు ఆశగా చూస్తోందని.. యువతే మన దేశానికి గొప్పబలమని ఆయన పేర్కొన్నారు. ఏడో దశ ఎన్నికల ప్రచారం ముగిసినరోజు సాయంత్రమే కన్యాకుమారిలో 45 గంటల ధ్యానానికి కూర్చున్న ప్రధాని.. జూన్ 1న కన్యాకుమారి నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణంలో ఉన్నప్పుడు.. విమానంలోనే తన ఆలోచనలను ఒక వ్యాసంగా మలిచారు. అందులో ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

కన్యాకుమారిలో మూడు రోజుల ఆధ్యాత్మిక యాత్ర ముగించుకుని ఇప్పుడే ఢిల్లీ వెళ్లే విమానం ఎక్కాను. నా మనసంతా ఎన్నో అనుభవాలు, అనుభూతులతో నిండిపోయింది. నాలోనే లోలోన అవధుల్లేని శక్తి ప్రవాహాన్ని అనుభవిస్తున్నాను. కన్యాకుమారిలో భరతమాత పాదాల చెంత కూర్చున్న తొలి క్షణాల్లో.. ఎన్నికల హడావుడి నా మదిలో ప్రతిధ్వనించింది. ర్యాలీలు, రోడ్ షోలలో నేను చూసిన లెక్కలేనన్ని ముఖాలు నా కళ్ల ముందుకొచ్చాయి. తల్లులు, సోదరీమణులు మరియు కుమార్తెల అపరిమితమైన ప్రేమ, వారి ఆశీస్సులు.. నా పట్ల వారి కళ్లలో ఉన్న నమ్మకం, ఆ ఆప్యాయత.. నేను ప్రతిదీ గ్రహించాను. నా కళ్లు తడిగా మారాయి. ఆ తర్వాత నేను ధ్యానంలోకి వెళ్లాను. కొద్ది క్షణాల్లోనే రాజకీయ వాదోపవాదాలు, దాడులు, ఎదురుదాడులు.. ఆరోపణల స్వరాలు, మాటలు అన్నీ వాటంతటవే శూన్యంలోకి వెళ్లిపోయాయి. నా మనసు బాహ్య ప్రపంచం నుంచి పూర్తిగా దూరమైంది. ఇంతటి బృహత్తర బాధ్యతల నడుమ ఇలాంటి సాధన కష్టమే అయినా.. కన్యాకుమారి భూమి, స్వామి వివేకానంద స్ఫూర్తితో అది సులువైంది. కన్యాకుమారిలో ఉదయించే సూర్యుడు నా ఆలోచనలకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చాడు. సముద్రం వైశాల్యం నా ఆలోచనలను విస్తరింపజేసింది. కన్యాకుమారి ఎల్లప్పుడూ నా హృదయానికి దగ్గరగా ఉంటుంది. "కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.." అనే మాట దేశంలోని ప్రతి ఒక్కరి హృదయంలో నిక్షిప్తమైన ఒక ఉమ్మడి గుర్తింపు. శక్తి మాత కన్యాకుమారిగా అవతరించిన శక్తి పీఠం ఇది. ఈ దక్షిణ చివరలో శక్తి మాత తపస్సు చేసి, భారతదేశం యొక్క ఉత్తర చివరలో హిమాలయాలలో కూర్చున్న శివుని కోసం వేచి ఉంది. కన్యాకుమారి సంగమాల గడ్డ. మన దేశంలోని పవిత్ర నదులు వివిధ సముద్రాలలో కలిస్తే.. ఆ సముద్రాలు ఇక్కడ కలుస్తాయి. ఇక్కడ మరొక గొప్ప సంగమం కనిపిస్తుంది. అది భారతదేశ సైద్ధాంతిక సంగమం! వివేకానంద రాక్ మెమోరియల్‌తో పాటు తిరువళ్లువర్ భారీ విగ్రహం, గాంధీ మండపం, కామరాజర్ మణి మండపం ఉన్నాయి. ఆ మహానుభావుల ఆలోచనా ప్రవాహాలు ఇక్కడ జాతీయ ఆలోచనల సంగమాన్ని ఏర్పరిచాయి. అది జాతి నిర్మాణానికి, గొప్ప ప్రేరణల ఆవిర్భావానికి దారి తీసింది. దేశ ఐక్యతను శంకించే వారికి కన్యాకుమారి గడ్డ చెరగని ఐక్యతా సందేశాన్ని ఇస్తుంది.

సందేశం.. లక్ష్యం.. గమ్యం..

"ప్రతి దేశానికీ అందించడానికి ఒక సందేశం ఉంటుంది. నెరవేర్చడానికి ఒక లక్ష్యం ఉంటుంది. చేరుకోవాల్సిన గమ్యం ఉంటుంది" అన్నారు స్వామి వివేకానంద. వేలాది సంవత్సరాలుగా భారతదేశం ఈ అర్థవంతమైన లక్ష్యంతో ముందుకు సాగుతోంది. భారతదేశం వేలాది సంవత్సరాలుగా ఆలోచనల పరిశోధన కేంద్రంగా ఉంది. మనం సంపాదించినదాన్ని ఎన్నడూ మన వ్యక్తిగత సంపదగా పరిగణించలేదు. మన సంపాదనను పూర్తిగా ఆర్థిక, భౌతిక పరామితుల్లో తూకం వేయలేదు. అందుకే.. 'ఇదం నమమ (ఇది నాది కాదు)' అనే భావన భారతదేశ సహజ స్వభావంగా మారింది. భారతదేశ సంక్షేమం.. యావత్ ప్రపంచ శ్రేయోభివృద్ధి ప్రస్థానానికీ ఉపయోగపడుతుంది. ఉదాహరణకు.. మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి ప్రపంచంలో చాలా దేశాలు వలస పాలనలోనే ఉన్నాయి. మన స్వాతంత్ర్య ప్రస్థానం చాలా దేశాలకు స్ఫూర్తిగా నిలిచి, స్వాతంత్ర్యాన్ని సాధించుకునే బలాన్నిచ్చింది. దశాబ్దాల తర్వాత అదే స్ఫూర్తి.. శతాబ్దానికొకసారి సంభవించే కొవిడ్-19 మహమ్మారిని ప్రపంచం ఎదుర్కొంటున్నప్పుడు.. మరోసారి కనిపించింది. ఆ సమయంలో పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్నప్పుడు.. భారతదేశ విజయవంతమైన ప్రయత్నాలు అనేక దేశాలకు ధైర్యాన్ని, సహకారాన్ని అందించాయి.

భారతదేశ పాలన నమూనా నేడు ప్రపంచంలోని అనేక దేశాలకు ఉదాహరణగా మారింది. కేవలం పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడడం అపూర్వం. పేదల సాధికారతకు, వారి హక్కులను కాపాడడానికి, పారదర్శకతను తేవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించవచ్చో చూపడం ద్వారా.. మన 'డిజిటల్ ఇండియా' ప్రచారం నేడు యావత్ ప్రపంచానికీ ఒక ఉదాహరణగా నిలిచింది. భారతదేశంలో చౌక ధరలకు లభిస్తున్న డేటా.. పేదలకు సమాచారం, సేవలు అందుబాటులో ఉండేలా చూడటం ద్వారా సామాజిక సమానత్వ మాధ్యమంగా మారుతోంది. పెద్ద పెద్ద అంతర్జాతీయ సంస్థలు మన నమూనా నుండి నేర్చుకోవాలని అనేక దేశాలకు సలహా ఇస్తున్నాయి. జీ-20 విజయం తర్వాత.. భారతదేశం మరింత బృహత్తర పాత్రను పోషించాలన్న భావన ప్రపంచ దేశాల్లో పెరుగుతోంది. గ్లోబల్ సౌత్‌కు బలమైన, ముఖ్యమైన గొంతుగా భారత్‌కు ఆమోదం లభిస్తోంది.

పెద్ద లక్ష్యాల దిశగా..

నవ భారత అభివృద్ధి గతి.. మనలో గర్వాన్ని, సంతోషాన్ని నింపుతుంది. కానీ అదే సమయంలో అది 140 కోట్ల మంది దేశ ప్రజల బాధ్యతలను కూడా గుర్తుచేస్తుంది. ఇప్పుడు మనం ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా పెద్ద పెద్ద బాధ్యతలు, పెద్ద లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి. కొత్త కలలు కనాలి. ఆ కలలను నిజాలుగా మార్చుకొని అందులో జీవించాలి. మన దేశ బలాలను గుర్తించి, వాటిని మరింతగా పెంచుకుని, ప్రపంచ ప్రయోజనాల కోసం వాటిని ఉపయోగించాలి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ఒక యువదేశంగా భారత్ బలం.. మనం వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేని ఒక గొప్ప అవకాశం. 21వ శతాబ్దపు ప్రపంచం భారత్ వైపు ఎన్నో ఆశలతో చూస్తోంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ముందుకు సాగాలంటే మనం కూడా అనేక మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. సంస్కరణల గురించి మన సంప్రదాయ ఆలోచనలను కూడా మార్చుకోవాలి. ఆర్థిక సంస్కరణలకే పరిమితం కాక.. జీవితంలోని ప్రతి దశలో సంస్కరణల దిశగా ముందుకు సాగాలి. మన సంస్కరణలు కూడా.. 2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత భారత్)' అనే తీర్మానానికి అనుగుణంగా ఉండాలి. సంస్కరణ అనేది ఏ దేశానికీ ఒకే దిశలో సాగే ప్రక్రియ కాదని మనం అర్థం చేసుకోవాలి. అందుకే దేశం కోసం నేను.. 'సంస్కరణ, పనితీరు, పరివర్తన (రిఫామ్, పెర్ఫామ్ (ట్రాన్స్‌ఫామ్)' అనే విజన్‌ను ప్రతిపాదించాను. సంస్కరణల (రిఫామ్) బాధ్యత నాయకత్వంపై ఉంటుంది. దాని ఆధారంగానే అధికార యంత్రాంగం పని చేస్తుంది (పెర్‌ఫామ్). ప్రజలు కూడా అందులో భాగస్వాములైతే జరిగే పరివర్తనకు (ట్రాన్స్‌ఫామ్) మనమే సాక్షులుగా ఉంటాం. అలాగే, భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి.. మనం సమర్థతను మన ప్రధాన విలువగా మార్చుకోవాలి. తయారీతో పాటు నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి. 'జీరో డిఫెక్ట్-జీరో ఎఫెక్ట్' అనే మంత్రానికి కట్టుబడి ఉండాలి. భారతదేశంలో పుట్టేలా చేయడం ద్వారా భగవంతుడు మనను ఆశీర్వదించాడని ప్రతిక్షణం గర్వపడాలి. ప్రాచీన విలువలను ఆధునిక రూపంలో అవలంబించడం ద్వారా మన వారసత్వాన్ని ఆధునిక పద్ధతిలో పునర్నిర్వచించాలి. కాలం చెల్లిన ఆలోచనలు, విశ్వాసాలను.. మనం పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతికూలత నుంచి విముక్తే.. విజయసాధన దిశగా పడే మొదటి అడుగనే విషయాన్ని తప్పక గుర్తుంచుకోవాలి. సానుకూలత ఒడిలో మాత్రమే విజయం వర్ధిల్లుతుంది. 20 శతాబ్దపు నాలుగవ, ఐదవ దశకాన్ని మన స్వాతంత్ర్యం కోసం ఎలా ఉపయోగించుకున్నామో.. అదే విధంగా 21వ శతాబ్దపు ఈ 25 సంవత్సరాలలో అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది వేయాలి. వచ్చే 50 ఏళ్లనూ దేశం కోసం మాత్రమే అంకితం చేయాలని స్వామి వివేకానంద 1897లో చెప్పారు. ఆయన పిలుపునిచ్చిన తర్వాత సరిగ్గా 50 ఏళ్లకు 1947లో భారత్ కు స్వాతంత్ర్యం వచ్చింది. అలాంటి సువర్ణావకాశం ఈ రోజు మనకు లభించింది. రాబోయే 25 ఏళ్లనూ పూర్తిగా జాతికి అంకితం చేద్దాం. రాబోయే తరాలకు, రాబోయే శతాబ్దాలకు నవభారతానికి బలమైన పునాదిగా మన ఈ ప్రయత్నాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఈ రోజు దేశానికి ఉన్న శక్తిని, ఉత్సుకతను చూస్తుంటే.. లక్ష్యం మరెంతో దూరంలో లేదని చెప్పగలను. ఇకపై వేగంగా అడుగులు వేద్దాం... అందరం కలిసి ముందుకు సాగి భారత్‌ను అభివృద్ధి చేద్దాం.

- నరేంద్ర మోదీ

గౌరవ వేతనానికీ దిక్కు లేదు!

- ప్రకృతి సేద్య విభాగం కార్యకర్తల గగ్గోలు
- 16నెలలుగా రూ.100 కోట్ల వేతన బకాయిలు
- కేటాయించిన నిధులు దారిమళ్లించిన సర్కారు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో పని చేస్తున్న కార్యకర్తలకు దాదాపు 16 నెలలుగా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందడం లేదు. 9,352 మంది కార్యకర్తలకు మొత్తం రూ.100కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని సమాచారం. ఈ విభాగానికి కేటాయించిన నిధుల్ని జగన్ సర్కార్ దారి మళ్లించడంతో సమస్య జఠిలమైంది. పైగా కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛంద సంస్థలు అందించే నిధులు కూడా నిలిచిపోవడంతో ప్రకృతి సేద్య విభాగం మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. వేతన బకాయిలపై రైతు సాధికార సంస్థ ఉన్నతాధికారులు భరోసా ఇస్తున్నా.. నెలల తరబడి వేతనాలు రాకపోతే.. కుటుంబ పోషణ ఎలా సాధ్యమని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీంతో జూన్ 15లోగా కనీసం ఆరు నెలల వేతనం ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తున్నారు. ఇందుకోసం బ్యాంకు రుణం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ, తోటి రైతులకు రసాయన రహిత, సేంద్రియ సాగుపై అవగాహన కల్పించి, ప్రోత్సహించే ఈ కార్యకర్తల సేవల్ని వినియోగించుకుంటూ, కనీసం గౌరవ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా, డివిజన్ స్థాయిలో పని చేసే కార్యకర్తలకు పనితీరు, అనుభవం ఆధారంగా వేతనాలు నిర్ణయించారు. నెలకు ఒక్కో కార్యకర్తకు రూ.6వేల నుంచి రూ.36వేల వరకు వేతనాలున్నాయి. 16నెలలుగా వేతనాలు రాకపోవడంతో.. కార్యకర్తలు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. దీనిపై ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రకృతి సేద్య కార్యకర్తలకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

అబద్ధాల మైండ్‌గేమ్!

- ఫలితాలపై జనంలోకి వైసీపీ సొంత సర్వేలు
- గెలుపు జగన్‌దేనంటూ స్వాములు, సెఫాలజిస్టులతో జోస్యాలు
- ఇప్పటికే ప్రజాభిప్రాయం ఈవీఎంలలో నిక్షిప్తం
- 4న గానీ జాతకాలు తేలవు
- ఈలోపు పెద్దఎత్తున అసత్యాల ప్రచారం
- మరోవైపు వైసీపీ అభ్యర్థుల్లో అలజడి
- కనిపించిన రాయికల్లా మొక్కులు
- కుటుంబాలతో గుళ్లకు వెళ్లి వేడుకోలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రజలు ఎవరికి ఓటేశారో ఇంకో 24 గంటల్లో తేలిపోనుంది. కానీ ఓటమి భయంతో వైసీపీ రకరకాల విన్యాసాలు చేస్తోంది. తామే గెలవబోతున్నామని ప్రజలను నమ్మించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. సొంత సర్వేలంటూ సామాజిక మాధ్యమాల్లో రోజుకొకటి ప్రచారంలో పెడుతున్నారు. ఇదే సమయంలో.. సొంత స్వాములు, జ్యోతిష్యులను.. సెఫాలజిస్టులపై టీవీ తెరపైకి తెస్తున్నారు. జగన్ జాతకానికి ఎదురేలేదని చెప్పిస్తున్నారు. తమ జాతకాలేమిటో ప్రజలు తేల్చేసి ఈవీఎం బటన్ నొక్కేశాక కూడా వారినే నవిష్యించేందుకు వైసీపీ పెద్దలు చేస్తున్న ఫీట్లు చూసి జనం నవ్వుకుంటున్నారు. మే 13వ తేదీన రాష్ట్రంలో ఎన్నికలు ముగిశాయి. యువత, మహిళలు, వృద్ధులూ ఓటింగ్‌కు పోటెత్తారు. ఎవరు ఏ పార్టీకి మొగ్గు చూపారో ఎవరికీ అంతు చిక్కడంలేదు. మహిళా ఓటును నమ్ముకుందామంటే.. గతంలో 'పసుపు-కుంకుమ'కు వారు లొంగలేదు. టీడీపీని ఓడించారు. యువత మనవారేనంటూ విశ్వసిద్దామంటే.. 108 అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రభావితం చేసేలా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించారు. మూడింటికి మూడు స్థానాలూ టీడీపీ కైవసం చేసుకుంది. ఏటా ప్రకటిస్తామన్న జాబ్ కేలెండర్ వేయకపోవడం, ఎన్నికల ముంగిట మినీ డీఎస్సీ ప్రకటనతో యువత రగలిపోతోంది. ఓటింగ్‌కు పోటెత్తిన యువత తమపై యుద్ధాన్ని ప్రకటించారేమోనన్న ఆందోళన వైసీపీ పెద్దల్లో నెలకొంది. మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వస్తాయి. ఫలితాల గడువు సమీపించేకొద్దీ అధికారపక్ష అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. ఓటమి భయం వెంటాడుతోంది. ఒకవేళ ఓడిపోతే.. గతంలో ప్రత్యర్థులపైకి పోలీసులను ఉసిగొల్పి పెట్టించిన కేసులు గుర్తుకొస్తున్నాయి. తమకూ అలాంటి గతే పడుతుందేమోనని వణికిపోతున్నారు. అందుకే దేవుడిపై భారం వేస్తున్నారు. కనిపించిన రాయికల్లా మొక్కుతున్నారు. సుదూరంగా ఉన్న ఆలయాలకు కుటుంబాలతో కలిసి వెళ్తున్నారు. గెలిపించాలని దేవుడిని వేడుకుంటున్నారు. పనిలోపనిగా శాంతులు, దోష నివారణ పూజలూ చేయిస్తున్నారు.

ఐ-ప్యాక్ నివ్వెరపోయేలా..

సీఎం జగన్మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే ముందు విజయవాడలో ఐ-ప్యాక్ ఆఫీసుకు వెళ్లారు. వారు పడిన కష్టాన్ని గుర్తు చేసుకుని అభినందించారు. మళ్లీ వైసీపీదే అధికారమని.. 151 అసెంబ్లీ, 22 లోక్‌సభ స్థానాలను మించి గెలవబోతున్నామని ఆ బృందానికి చెప్పారు. ఆ బృందానికి మైండ్ బ్లాక్ అయింది. తామేదో చెబుదామనుకుంటే.. జగన్ ఏదో చెప్పారేంటని నివ్వెరపోయింది. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగానే ఓటింగ్‌కు జనం పోటెత్తారని నిరాశానిస్పృహల్లో ఉన్న వైసీపీ అభ్యర్థులు, నేతల్లో ధైర్యం నింపేందుకే ఆయనా ప్రకటన చేశారు. ఆ ప్రకటనతో రాష్ట్రం పూనకం వచ్చినట్లు ఊగిపోతుందని.. వైసీపీ శ్రేణుల్లో ఉత్తేజం వచ్చేస్తుందని.. ఈ జోష్ తాను విదేశాల నుంచి తిరిగి వచ్చేవరకు ఉంటుందని జగన్ ఆశించారు. కానీ ఈ ప్రయోగం ఫలించలేదు. వివిధ జాతీయ మీడియా సంస్థలు, విశ్లేషకులు, సెఫాలజిస్టులు నిర్వహించిన సర్వేల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తెలుస్తుందని వెల్లడించడంతో ప్రభుత్వ పెద్దలు కంగు తిన్నారు. వెంటనే సొంత సర్వేలను జనంపైకి వదిలింది. 117 నుంచి 150 స్థానాలు వైసీపీకేనని సోషల్ మీడియాలో ఊదరగొట్టినా జనం నమ్మడం లేదు. దీంతో స్వాములు రంగప్రవేశం చేశారు. కుప్పంలో చంద్రబాబుకు చాలా కష్టం.. పిఠాపురంలో జనసేనాని పవన్ కల్యాణ్ ఓటమి ఖాయం.. మంగళగిరిలో మాత్రం లోకేశ్ గెలుస్తాడంటూ ఓ నయాస్వామి ముక్తాయిస్తున్నారు. నిరుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఈయన కేసీఆర్ గెలిచి తీరతారని ఢంకా బజాయించి మరీ చెప్పారు. ఏమైందో అందరికీ తెలిసిందేనని.. కొన్నిగంటల్లో అసలు ఫలితాలే వస్తుంటే జగన్ అండ్ కో ఇలా గిమ్మిక్కులు చేయడాన్ని రాజకీయ వర్గాలు ఎద్దేవాచేస్తున్నాయి.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ ఎన్వీ రమణ

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్ ఎన్వీ రమణకు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన అఖిలాండం వద్దకు చేరుకుని బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

వారసుడు కావాలని వేధింపులు

- ఐదు నెలల గర్భిణి ఆత్మహత్య
- ఇటీవల స్కానింగ్ చేయించిన భర్త
- ఆడపిల్ల అని తేలడంతో అబార్షన్‌కు ఒత్తిడి
- ఇప్పటికే పాప ఉండటంతో అత్తమామలదీ అదే మాట
- దిక్కుతోచని స్థితిలో ఉరేసుకుని అఘాయిత్యం



కావ్యశ్రీ

పెనమలూరు (కృష్ణాజిల్లా), జూన్ 2: రెండో కాన్పులోనూ ఆడపిల్ల అని తేలడం, తమకు వారసుడే కావాలని, అబార్షన్ చేయించుకోవాలని భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేయడంతో మనస్తాపం చెందిన ఐదు నెలల గర్భిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయవాడలోని యనమలకుదురులో జరిగింది. ఈ ఘటనపై పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు పుట్టరోడ్డుకు చెందిన యర్రపోతు కావ్యశ్రీకి, కంకిపాడులోని బోను రోడ్డుకు చెందిన నందు శ్రీకాంత్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. కావ్యశ్రీ ఇంటర్ పూర్తి చేసి దూరవిద్య ద్వారా డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. శ్రీకాంత్ పాతపాడులోని ఓ సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తున్నాడు. వారికి పది నెలల పాప ఉంది. ఐదు నెలల క్రితం కావ్యశ్రీ మళ్లీ గర్భం దాల్చింది. మూడు రోజుల క్రితం శ్రీకాంత్ విజయవాడలోని ఓ ఆసుపత్రిలో కావ్యశ్రీకి స్కానింగ్ తీయించగా ఆడపిల్ల అని తేలింది. అప్పటి నుంచి ఆమె పుట్టింటి వద్దే ఉంటోంది. రెండోసారి కూడా పాపేనా.. తమకు వారసుడు కావాలంటూ, అబార్షన్ చేయించుకోవాలని శ్రీకాంత్, అతని తల్లిదండ్రులు శాంతి, లక్ష్మణరావు వేధించడం మొదలుపెట్టారు. మరో రెండుసార్లు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. శుక్రవారం రాత్రి యనమలకుదురులోని కావ్యశ్రీ పుట్టింటి వద్ద భార్యాభర్తలిద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. శనివారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లిన కావ్యశ్రీ ఎంతకీ బయటకు రాలేదు. స్నానం చేస్తున్నా అని చెప్పిన కావ్యశ్రీ ఎంతకీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె భర్త, తల్లిదండ్రులు డోర్ పగలగొట్టారు. బాత్‌రూంలో ఇనప రాడ్డుకు ఉరేసుకున్న ఆమెను వెంటనే పటమటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం కావ్యశ్రీ మృతి చెందింది. కాగా, వారసుడిని తాను ఇవ్వలేనని కావ్యశ్రీ తన భర్తకు ఫోన్‌లో చివరి మెసేజ్ పెట్టింది. అబార్షన్ చేయించుకోమని భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడం వల్లే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని కావ్యశ్రీ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- గన్‌తో కాల్చుకుని బలవన్మరణం



వేదవతి

రాయచోటి టౌన్, జూన్ 2: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న కబ్బాలి వేదవతి (28) ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బింగానిపల్లె చెందిన వేదవతి 2016లో పుంగనూరులోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం శిక్షణ తీసుకునే క్రమంలో అక్కడ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మదనపల్లెకు చెందిన దస్తగిరితో ప్రేమలో పడి 2016లో పెళ్లి చేసుకున్నారు. అనంతరం 2017లో వేదవతికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. దీంతో వేదవతి చిత్తూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సంవత్సరం క్రితం బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహ పక్కన గల ఇందిరమ్మ కాలనీలో భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా.. దస్తగిరికి గతంలోనే పెళ్లై ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. మొదటి భార్య దస్తగిరిని వదిలి వెళ్లిపోవడంతో అతని కుమారులు ప్రస్తుతం మదనపల్లెలో నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుతం వేదవతికి 5 సంవత్సరాల కుమార్తె ఉంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది. రక్తపుమడుగులో కుర్చీలో పడి ఉండడం చూసిన మరో కానిస్టేబుల్ పోలీసు అధికారులకు సమాచారం అందించారు. డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేదవతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు.

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల నిరసన

- ఆలస్యంగా వెలుగులోకి

రేణిగుంట, జూన్ 2: తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు నిరసన తెలియజేసిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానానికి 60 మంది ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. వీరంతా రాత్రి 7.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే హైదరాబాదులోనే స్పైస్ జెట్ విమానానికి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రద్దు చేశారు. విషయం తెలుసుకున్న ప్రయాణికులు తిరుపతి విమానాశ్రయంలోని స్పైస్ జెట్ క్యాబిన్ వద్ద నిరసన తెలిపారు. కొంతమంది టికెట్ డబ్బులు వాపస్ తీసుకుని వెళ్లిపోగా.. మరికొందరు మరో విమానంలో హైదరాబాదు వెళ్లారు.

నటుడు కరుణాస్ వద్ద 40 బుల్లెట్లు స్వాధీనం



చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్ వద్ద చెన్నై విమానాశ్రయ అధికారులు ఆదివారం 40 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన కరుణాస్ స్కానర్ నుంచి వెళ్తుండగా అలారం మోగింది. దీంతో భద్రతా సిబ్బంది ఆయన లగేజీ తనిఖీ చేయగా, బ్యాగులో 40 బుల్లెట్లు ఉన్నాయి. దీంతో వారు కరుణాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే తన వద్ద లైసెన్స్ తుపాకి ఉందని, బుల్లెట్లు దానికి సంబంధించినవని పేర్కొంటూ కరుణాస్ లైసెన్స్‌కు సంబంధించిన పత్రాలను చూపించారు. అయినా బుల్లెట్లను విమానంలో తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని పేర్కొన్న అధికారులు.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విచారణ కారణంగా కరుణాస్ వెళ్లాల్సిన విమానం రెండున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది.



ఘటనా స్థలంలో ప్రమాద దృశ్యం

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

- 29 మందికి గాయాలు

ముమ్మిడివరం, జూన్ 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం 216 జాతీయ రహదారిపై అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొనడంతో 29 మంది గాయపడ్డారు. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపో ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్‌ను తప్పించబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు, ప్రైవేటు బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. బాధితులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం 12 మందిని అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

భారత్‌లో 1.7 కోట్ల పోస్టులు తొలగింపు

- అభ్యంతరకర కంటెంట్‌పై మెటా చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 2: భారతదేశంలో ఏప్రిల్ నెలలో 1.7 కోట్లకుపైగా అభ్యంతరకరమైన పోస్టులను తొలగించినట్టు సోషల్ మీడియా దిగ్గజం మెటా వెల్లడించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ అయిన మెటాకు వచ్చిన అనేక ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్‌లో ఫేస్‌బుక్‌కు సంబంధించి తమ పాలసీలకు వ్యతిరేకంగా ఉన్న 1.16 కోట్లు, అలాగే ఇన్‌స్టాగ్రామ్‌కు సంబంధించి 54 లక్షలకుపైగా అభ్యంతరకర పోస్టులను తొలగించినట్టు మెటా పేర్కొంది. భారత్‌లోని గ్రీవెన్స్ మెకానిజం ద్వారా ఏప్రిల్‌లో ఫేస్‌బుక్‌కు 17,124 ఫిర్యాదులు రాగా, వాటిలో 9,977 సమస్యలకు పరిష్కార సాధనాలను వినియోగదారులకు అందించినట్టు మెటా తన నెలవారీ నివేదికలో తెలిపింది. ప్రత్యేక సమీక్ష అవసరమైన 7,147 నివేదికల్లో పరిష్కరించదగిన కంటెంట్‌ను విశ్లేషించి.. 4,303 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని, మిగిలిన 2,844 నివేదికలను సమీక్షించాం కానీ, వాటిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవచ్చని చెప్పింది. అలాగే ఇన్‌స్టాగ్రామ్‌లోనూ భారత గ్రీవెన్స్ మెకానిజం ద్వారా 12,934 ఫిర్యాదులను మెటా అందుకుంది. వాటిలో 5,491 కేసుల్లో సమస్యల పరిష్కారానికి సాధనాలను వినియోగదారులకు అందించింది. ప్రత్యేక సమీక్ష అవసరమయ్యే ఇతర 6,983 నివేదికల్లో కంటెంట్‌ను విశ్లేషించి 3,206 ఫిర్యాదులపై చర్యలు తీసుకుంది. మిగిలిన 3,777 నివేదికలను సమీక్షించినా వాటిపై చర్యలు తీసుకోకపోవచ్చని పేర్కొంది. 2021లో కొత్తగా రూపొందించిన ఐటీ నిబంధనల ప్రకారం 50 లక్షలకుపైగా వినియోగదారులున్న పెద్ద డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు నెలవారీ నివేదికలను వెల్లడించాలి.

'ఫ్రీహోల్డ్' ముసుగులో కుంభకోణం



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నేత మూర్తి యాదవ్, టీడీపీ నేత పోతనరెడ్డి

- అసైన్డ్ భూములకు హక్కుల సర్టిఫికెట్ల జారీలో భారీ అక్రమాలు
- 10 లక్షల ఎకరాలకు పత్రాలు జారీ
- రూ.వేల కోట్లు దోచిన జవహర్ బినామీలు
- సీఎస్ అత్యంత అవినీతిపరుడు
- ఆయనకు సహకరించిన విశాఖ కలెక్టర్
- సర్టిఫికెట్ల జారీపై విచారణ చేయిస్తాం
- జనసేన నేత మూర్తి యాదవ్

విశాఖపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ భూములకు హక్కులు కల్పించే ముసుగులో భారీ కుంభకోణం జరిగిందని జనసేన కార్పొరేటరు పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. రాష్ట్రంలో 50 ఏళ్ల కిందటి నుంచి ఇచ్చిన అసైన్డ్ భూముల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేశారని తెలిపారు. దీనివెనుక పెద్ద పన్నాగం దాగి ఉందని తెలిపారు. టీడీపీ ఉత్తరాంధ్ర నేత బైరెడ్డి పోతనరెడ్డితో కలిసి ఆదివారం మూర్తి యాదవ్ మీడియాతో మాట్లాడారు. అసైన్డ్ భూములపై సంబంధిత రైతులకు పూర్తి హక్కులు దక్కేందుకు గత ఏడాది ప్రభుత్వం జీవో 596 జారీచేసిందని తెలిపారు. దీనిని అడ్డు పెట్టుకుని భూముల కొనుగోలుకు బడాబాబులు ప్రధానంగా వైసీపీ నేత లు, వారి అనుకూల రియల్టర్లు, పలువురు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారని చెప్పారు. ఈ వ్యవహారంలో రూ.వేలకోట్ల ఒప్పందాలు జరగడంతో పాటు పలుకుబడి ఉపయోగించి రైతులపై ఒత్తిళ్లు తెచ్చారన్నారు. అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీలో వివాదాలపై రిటైర్డు ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ గవర్నర్‌కు లేఖ రాశారని తెలిపారు. పేదలు, దళితులకు చెందిన భూములను అడ్డగోలుగా దోచుకుంటున్నారని మరో రిటైర్డు అధికారి పీవీ రమేశ్ సైతం ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఇంత జరుగుతున్నా విశాఖ, విజయనగరం జిల్లాల్లో అసైన్డ్ భూముల కొనుగోలు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వెనక్కి తగ్గడంలేదన్నారు. దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ఉన్నతాధికారిగా జవహర్‌రెడ్డి నిలిచారని విమర్శించారు. రైతులకు కస్టోడియన్లుగా వ్యవహరించాల్సిన విశాఖ కలెక్టర్ మల్లికార్జున.. జవహర్‌రెడ్డి ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు అధికారులూ కడప జిల్లాకు చెందిన వారు కావడంతో విశాఖలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు.

విచారణ కోరతాం

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీపై సిటింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణ కోరుతామని మూర్తియాదవ్ తెలిపారు. భీమిలి మండలం అన్నవరంలో భూములపై ఏడు కేసులు కోర్టులో ఉండగా రెండు కేసులు మాత్రమే ఉన్నాయని కలెక్టర్ చెప్పడాన్ని తప్పుబట్టారు. వైసీపీ నేతలు, సీఎస్ బినామీలకు అనుకూలంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. కలెక్టర్ చెప్పినట్టుగా జిల్లాలో ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేసిన 700 ఎకరాలను సీఎస్, ఆయన బినామీలు, వైసీపీ నేతలే దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు.

వందల ఎకరాల కొనుగోలు

'ఫ్రీహోల్డ్' ముసుగులో విశాఖ పరిసరాల్లో జవహర్‌రెడ్డి, ఆయన బినామీ త్రిలోక్, సుభాశ్‌లు వందల ఎకరాలు కొనుగోలు చేశారని మూర్తి యాదవ్ తెలిపారు. ఈ వ్యవహారంలో కలెక్టర్, ఇతర అధికారులు సహకరించారని చెప్పారు. భూములు ఇవ్వని రైతులను బెదిరించి, బలవంతంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. ఆనందపురం మండలం గండిగుండంలో సర్వేనంబరు 288/1లో కనకాల చిన్న, కనకాల అప్పారావులకు చెందిన 1.20 ఎకరాల భూములు రాయించుకున్నారని తెలిపారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటే రైతుకు చెందిన భూమిలో సగం జవహర్‌రెడ్డి బినామీలైన త్రిలోక్, సుభాశ్‌ల పేరిట రిజిస్ట్రేషన్ చేసేలా బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్‌గా మల్లికార్జున వచ్చిన తర్వాత దసపల్లా భూములు, ఇతర భూములు ప్రైవేటు వ్యక్తుల పరమయ్యాయని ఆరోపించారు. ఎంతో మంది కలెక్టర్లు తిరస్కరించిన దసపల్లా భూములను మల్లికార్జున ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేశారని యాదవ్ తెలిపారు.



ఆరణిలో లభించిన శిలాశాసనం

18వ శతాబ్దం నాటి తెలుగు శిలాశాసనం లభ్యం

- తిరువణ్ణామలై జిల్లాలో గుర్తింపు

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లా ఆరణిలో 18వ శతాబ్దం నాటి తెలుగు శిలాశాసనం లభ్యమైంది. కోదండరామాలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా కొలనులో పూడికతీత పనులు చేపడుతుండగా ఈ శిలా శాసనం వెలుగు చూసింది. దీనికి గురించి పురావస్తు పరిశోధకులు విజయన్ మీడియాతో మాట్లాడుతూ.. 200 సంవత్సరాల క్రితం దక్షిణభారత యాత్ర కోసం కాశీ నుంచి వచ్చిన దుర్గప్రసాద్ స్వామీజీ ఆరణి సమీపంలో వున్న సూర్యకొలను సమీపంలో బస చేశారని, ఇక్కడి వాతావరణం నచ్చడంతో కొంతకాలం ఇక్కడే నివసించినట్టు చరిత్ర చెబుతోందన్నారు. ఆ సమయంలోనే ఆయన హనుమాన్, కోదండ రామాలయం నిర్మించారని వివరించారు. ఇప్పుడు ఆ ఆలయ పునరుద్ధరణ పనులు చేపడుతుండగా ఈ తెలుగు శాసనం బయల్పడిందన్నారు. ఇది 1879 నాటిదని, జగదేవి, కస్తూరి రంగయ్యానాయుడు దంపతుల కుమారుడు లక్ష్మీనారాయణప్ప అనే వ్యక్తి 'తులసి వనం' అనే పేరుతో బృందావనం ఏర్పాటు చేసినట్టు శాసనంపై పేర్కొన్నారని తెలిపారు.

పాయల్ కపాడియాపై కేసులు ఎత్తేయాలి

- ప్రజానాట్యమండలి రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.అనిల్‌కుమార్, వోరా ప్రసాద్ తదితరులు


విజయవాడ కల్చరల్, జూన్ 2: కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రానికి గ్రాండ్ ప్రిక్స్ అవార్డును అందుకున్న దర్శకురాలు పాయల్ కపాడియాపై కేసులను ఎత్తేయాలని, ఆమెకు పద్మశ్రీ పురస్కారం ఇవ్వాలని ప్రజానాట్యమండలి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ అధ్యక్షతన ఆదివారం పూలే-అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంల నిర్వహించారు. ఈ సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర బాధ్యుడు వోరా ప్రసాద్ మాట్లాడారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, నిర్బంధాలకు గురిచేయడం బీజేపీ ప్రభుత్వ పాలనలో నిత్యకృత్యమయ్యాయి. ఈ పదేళ్లలో కవులు, కళాకారులు, రచయితలపై దాడులు పెరిగాయన్నారు. కపాడియాకి స్కాలర్‌షిప్ ఆపేసినా, ఎఫ్టీఐఐ నుంచి సస్పెండ్ చేసినా ధైర్యం కోల్పోలేదన్నారు. దేశం గర్వించేలా కేన్స్ ఉత్సవాల్లో మొదటి భారతీయ మహిళా దర్శకురాలిగా బహుమతి పొందారన్నారు. కామ్రేడ్ జీఆర్కే-పోలవరపు సాంస్కృతిక వేదిక బాధ్యుడు గోళ్ల నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, తెలుగు షార్ట్ ఫిల్మ్ కార్యదర్శి డీవీ రాజు, ఎంబీవీకే బాధ్యుడు యు.వి.రామరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నర్సింహారావు తదితరులు ప్రసంగించారు.

కేరళ సీఎం పినరయి విజయన్‌ను కలిసిన

ఐలూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ 'సుంకర'

విజయవాడ లీగల్, జూన్ 2: బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీసమేతంగా కేరళ సీఎం పినరయివిజయన్‌ను ఆదివారం కొచ్చిన్‌లో ఓ వివాహంలో కలిశారు. కేరళ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు, కేరళ హైకోర్టు బార్ మాజీ అధ్యక్షుడు థామస్ అబ్రహం కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనేందుకు వారి ఇంటికి విచ్చేసిన పినరయి విజయన్‌ను రాజేంద్రప్రసాద్ సతీసమేతంగా కలిశారు. ఆయనతో పాటు బెజవాడ బార్ సీనియర్ న్యాయవాది, ఐలూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సప్పా రమేష్‌కుమార్ ఉన్నారు.

ధర్మపథం వేదికపై నృత్యప్రదర్శన



వన్‌టౌన్, జూన్ 2: దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మపథం వేదికపై విజయవాడ విద్యాధరపురానికి చెందిన నట రాజ నృత్యాలయం ఆధ్వర్యంలో కుప్పా కృష్ణవేణి బృందం ఆది వారం కూచిపూడి నృత్య ప్రద ర్శన ఇచ్చింది. నృత్యకారిణులు చైత్ర, పూర్వజ, శ్రీహాస, రోషిక, తన్వి, కావ్య, హేమశ్రీ, యశ్విత, సం హిత, తపస్వి, నాగతేజస్వి ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకున్నారు.

ఏపీ చాంబర్స్ సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఏర్పాటు

విజయవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్త విభాగం ఆదివారం ఏర్పాటైంది. గుంటూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో మహిళా విభాగాన్ని ఎన్నుకున్నారు. ఏపీ చాంబర్స్ తరఫున మొదటిసారిగా 2021లో విశాఖపట్నంలో మహిళా విభాగాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ విభాగంలో 100 మంది మహిళా పారిశ్రామికవేత్తలు సభ్యులుగా ఉన్నారు. రెండున్నరేళ్లుగా విశాఖ ప్రాంతంలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా ఈ విభాగం పనిచేస్తోంది. ఇదే క్రమంలో గుంటూరుతోపాటు పొరుగు జిల్లాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలతో సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడారు. రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన కోసం ఆర్థిక రంగంలో కూడా మహిళలను భాగస్వాములను చేయాలని ఆయన పేర్కొన్నారు. దేశంలో మహిళల ఆర్థిక సహకారం చూస్తే జీడీపీలో 17 శాతం మాత్రమే ఉందన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే చాలా తక్కువ అన్నారు. వర్క్‌ఫోర్స్‌లో 50 శాతం మంది మహిళలను చేర్చుకోవటం వల్ల జీడీపీ వృద్ధిని 1.5 శాతం పెంచుకోవటం జరుగుతుందని ప్రపంచ బ్యాంక్ నివేదించిందని గుర్తుచేశారు. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ (ఎంజీఐ) అంచనా ప్రకారం 2025 నాటికి 68 మిలియన్ల మంది మహిళలను శ్రామికశక్తిలోకి తీసుకురావటం ద్వారా భారత దేశం తన జీడీపీని 700 బిలియన్ల డాలర్లకు పెంచుకుంటుందని అంచనా వేసిందన్నారు. అనంతరం సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభా గం చైర్‌పర్సన్‌గా సక్కు మాధవి, వైస్ చైర్‌పర్సన్‌గా రాయపాటి మమత బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ యూనివర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఏపీ చాంబర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్. రఘురామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మహిళా పారిశ్రా మికవేత్తల విభాగం చైర్‌పర్సన్ వై.గీత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ

బొమ్మలు: అక్బర్



ఏడుగుర్రాల రాజు

కాలాలన్నీ గువ్వపిట్టల తీరుగ వొస్తె
వచ్చిన తొవ్వల అంతే వేగంగా పోతై
అర్కుడిదే పెద్దిర్కం.
వస్త్రదిగని
మబ్బుల గుంపులు మూగి
మొహమాటం లేకుండా
చాట కొట్టిందాకా పోనేపోదు

ఎంత వొడుపు చేసి రాజేసినా
ఆకాశం పొయ్యి
మేలోనే మంటంటుకుంటుంది
ఒత్తుల సముద్రాలు
అప్పుడే సలసలమంటై
కదిలే నదులు
కట్టెజర్సుకొని పోతై
తొణికే చెరువులు
పక్కటెముకలు తీస్తై
గాలి సైన్యం
ఒళ్లంతా నిప్పులు మోసుకు తిరుగుతుంది
ఎండకు సలాం కొట్టిన నీడలు
ఒడుపుగా చెట్ల కింద దాక్కుంటై
కర్ఫ్యూ చౌరస్తాలో కలవరపడ్డట్లు
చెట్ల గుంపులు
బిక్కచచ్చిపోతై
ఊరు లేని పేరు మీద
ఒక్క మబ్బూ ఉర్కులాడదు
ఏడు గుర్రాల రాజు
కళ్లెం గట్టిగా లాగి మరీ
రథాన్ని ఆకుమీద కదిలే
రింగన పురుగును చేస్తాడు

ఇండ్లన్నీ మధ్యాహ్నాలను తిట్టిపోస్తూ
సాయంకాలాలకు
స్వాగత తోరణాలు కట్టిపెడ్తై
సైకప్పులకు వేలాడుతూ
పంఖాలు నటిస్తుంటాయి
కూలర్లు
శబ్దానికీ తుంపర్లకు పోటీ పెట్టి
చప్పుడును గెలిపిస్తుంటై
ఏసీలు మాత్రమే
దొరబాబులను
కిరణాల కటార్ల బారినుండి
తప్పిస్తుంటే
రెక్కల కష్టంమీద మాత్రమే
బతికే దేవుళ్ళు
చెమట నీళ్లన్నీ
భూదేవికి ధారపోస్తుంటారు

అంతా అసంకల్పితంగా
దివాకరుడి జపమే చేస్తారు కానీ
వాన తెరలు కట్టి
ఆయన ఏనాడూ సుర్రుమనకుండా
ఉపరితలంమీద ఊరేగుతూ
ఊయలూగుతూ ఉండేలా
చల్లబరచడానికి
వరుణుడి కన్నుకొట్టే పసిమి కావ్యం
ఏదైనా లోకమంతా కలిసి
అల్లితే బాగుండు!

ఏనుగు నరసింహారెడ్డి
89788 69183

'ధిక్కార' మహాత్మాపూలే స్ఫూర్తి కవిత్వం

నెలపొడుపు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'ధిక్కార' మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ సభ జూన్ 8 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆహ్వానం పి. వహీద్ ఖాన్; సభాధ్యక్షులు సంగిశెట్టి శ్రీనివాస్; ముఖ్య అతిథి, పుస్తక ఆవిష్కర్త బుర్ర వెంకటేశం; విశిష్ట అతిథులు గోరటి వెంకన్న, జూలూరు గౌరీ శంకర్, జి. లక్ష్మీనరసయ్య, మామిడి హరికృష్ణ, బి. ప్రసాదమూర్తి, ఏ. జయంతి, పసునూరి రవీందర్ తదితరులు పాల్గొంటారు.

కందికొండ మోహన్

పాతూరి మాణిక్యమ్మ అవార్డు

పాతూరి మాణిక్యమ్మ సార్మక సాహిత్య పురస్కారం కోసం 2023లో ప్రచురితమైన కవితా సంపుటాలను కవయిత్రుల నుంచి మాత్రమే ఆహ్వానిస్తున్నాం. పోటీలో గెలుపొందిన కవయిత్రికి రూ.5వేల నగదు బహుమతితోపాటు ఘనంగా సన్మానం ఉంటుంది. మీ స్వీయ కవితా సంపుటాలు రెండు కాపీలను జూలై 30లోగా చిరునామా: పాతూరి అన్నపూర్ణ, 1156/ 28-1, ప్రశాంతి నగర్, నవలాకుల గార్డెన్స్, నెల్లూరు - 524002, ఏపీ, ఫోన్: 94902 30939కు పంపాలి.

పాతూరి అన్నపూర్ణ

కథలు కవితల పోటీ

'పురిమళ్ల ఫౌండేషన్-అక్షరాల తోవ' నిర్వహిస్తున్న పోటీలో కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, 4వేలు, 3వేలు; కవితలకు రూ.4వేలు, 3వేలు, 2వేలు. రెండు విభాగాల్లో రూ.1000 చొప్పున రెండేసి కన్సొలేషన్ బహుమతులు. వీటితోపాటు ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో కృషి చేస్తున్న వారికి భోగోజు పురుషోత్తం - సముద్రమ్మ సాహితీ పురస్కారం అందజేస్తారు. రచనలను జూన్ 30లోగా చిరునామా: రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జ్ ఎదురుగా, స్టేషన్ రోడ్, ఖమ్మం - 507 001, ఫోన్: 9849 277968.

పురిమళ్ల సునంద

ఒక బైరాగి చింతన

'కంఠం, ఒక కంఠం కావాలి నాకు
పుంఖానుపుంఖ శంఖాల మంటల మంటలా
పలుకగల ఒక కంఠం
కంఠం, నాకొక కంఠం
మానవగీత ఆలపించే ఒక కంఠం'

- ఈ అత్యంత మౌలిక కంఠస్వరం ఆలూరి బైరాగిది. అతని గొంతు అతనిదే. మరి దేనికీ అనుకరణ గానీ ప్రతిధ్వని గానీ కానిది. అతని వెతుకులాట బాట అతనిదే. ఇంకెవ్వరూ నడవనిది. సర్వతంత్ర స్వతంత్రత. స్వభావ సహజత్వం, నిసర్గ కవితాశక్తి, జీవితంపట్ల అపార ప్రేమ. నిలకడ లేమి. నిష్ఫలత్వం. నిట్టూర్పు. అన్నీ కలిస్తే అది బైరాగి సాహిత్యం.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్న బైరాగి, అది అగిపోయినాక ఎమ్.ఎన్. రాయ్ 'రాడికల్ హ్యూమనిజం' ప్రభావానికి లోనయ్యాడు. ('కామ్రేడ్ రాయ్ స్మృత్యర్థం' కవిత కూడా రాశాడు.) స్వేచ్ఛామానవుల సామూహిక ప్రయత్నాలతో రాడికల్ ప్రజాస్వామ్యం ఏర్పడి సామాజిక పునరుజ్జీవనం కలుగుతుందనే అతని ఆశ అడియాసే అయ్యింది. స్వరాజ్యం ముందు అభాగ్యం. తర్వాత అనైతికం. ఫలితం కవిలో ఒక విషాద వాతావరణం.

బైరాగి అత్మచింతన మీద ఆనాటి ప్రాపంచిక వాతావరణం కూడా ప్రభావం చూపించి ఉంటుంది. రెండవ ప్రపంచ యుద్ధ బీభత్సం కనుమరుగు కాకుండానే ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. మానవజీవితం దుర్భరం ఎందుకయ్యిందో అర్థం కాలేదు. అనేకానేక శోకాలు, 'నిస్సహాయ మానవేయుడి నుదుటి వ్రాలు' అతడిని భయకంపితం చేసి ఉండాలి. శోకం నిండిన లోకం నిస్సారంగా తోచి ఉండాలి. అదే సమయంలో ఝా పాల్ సార్త్ర్ అస్తిత్వవాదం (existentialism) ప్రభావం కూడా అతనిపై పడి ఉంటుంది. ఆధునిక మానవుడి స్వేచ్ఛారాహిత్యం, to be or not to be అనే సందిగ్ధత, గమ్యం తెలియని ప్రయాణం, ద్వంద్వాల మధ్య అనిశ్చితి, భయం, నిరాశ- ఈ బాహ్యాంతర అస్తిత్వ సమస్యలన్నీ చుట్టుముట్టాయి. 'ఎటు బోతే పూల తోట? ఎటు బోతే వల్లకాడు?', 'చీకటి నాడి దొరికితేనే తెలుస్తుంది త్రోవ'. కానీ అది దొరకదు. 'నేతి, నేతి' అంటూ ఎంత వెతికినా అతనికి సందేహ సాగరం ఆవలి ఒడ్డు కన్పించలేదు. బుద్ధుడు, జీసస్, శంకరుడు, భగవద్గీత, మార్క్స్, రాయ్- వీళ్లెవ్వరూ అతనికి తోడ్పడలేదు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యమూ దారి చూపించలేదు. 'విశ్వ మహాకావ్యాలన్నీ/ వేదనతో విలపించే/ పసివాని అశ్రుబిందువు పాటి చేయవు'.

నిలకడ లేని బైరాగి అవివాహితుడుగా ఉంటూ క్రమంగా ఏకాంతజీవి అయ్యాడు. ప్రపంచంతో ఒకానొక పరాయితనం ఏర్పడింది. మానసిక వైరాగ్యం ఆవరించింది. అంతటా అర్థరాహిత్యమే.

తెనాలిలో పుట్టిన ఈ కవి (1925-78) భావ, అభ్యుదయ, విప్లవ కవితావికాసాల్ని గమనిస్తున్నా అన్నిటికీ ఎడంగానే ఉండిపోయాడు. లోపలనుంచి తన్నుకొచ్చే ఉద్వేగాలతో తప్ప ఎక్కడా ఉపరితల ఉద్రేకాలతో విజృంభించలేదు. తొలి కవితాసంపుటి 'చీకటి నీడలు' ఊహకీ వాస్తవానికీ, ఆలోచనకీ ఆచరణకీ మధ్య కదిలే సందేహపు నీడల్ని చూపుతుంది. సమస్యల సాలెగూళ్ళలో చిక్కుకున్నాడు ఆధునిక మానవుడు. యుద్ధాగ్నిలో ఐరోపా మరుభూమిగా మారినప్పుడు టిఎస్ ఎలియట్‌కి 'ఊషర క్షేత్రం' (Waste Land) కన్పించింది. (ఎలియట్ ప్రభావంతో వేస్ట్‌లాండ్ చివరి భాగం, అతనివే మరికొన్ని కవితలు అనువాదం చేశాడు.) సమకాలిక సామాజిక దుస్థితి చూసినప్పుడు బైరాగికి 'నూతిలో గొంతుకలు' వినపడ్డాయి. 1950లో 'తెలుగు స్వతంత్ర'లో ఆ కవితలు ధారావాహికంగా ప్రచురించబడ్డాయి. అదే అతని 'మానవగీత'. 'నూతిలో గొంతుకలు' అనే రూపకమే నిత్యనూతనం, విశేషార్థస్ఫోరకం.

'భూకంపాలు, తుపానులు, కరువులు, వరదలు, యుద్ధాలు/ పండిన పంటలపై మహాసైన్యపు మిడతల దండు/ దౌర్జన్యం, దురాగతం, పిరికితనం, వెకిలిదనం/ మానభంగం, పురికంబం, ఇన్‌క్విజిషన్, గెస్టాపో, జీ.పీ.యూ' - ఇవన్నీ మంటలుగా తోచి, 'మంటల్లో మంటల్లో పయనిస్తోంది మానవాత్మ' (నూతిలో గొంతుకలు) అన్నాడు బైరాగి. ఈ ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక వ్యధలన్నీ అతడిని గాయపరిచాయి. ఆ మంటల నుంచి బయటపడే మార్గం కన్పించలేదు. 'త్రోవ ఎక్కడ సోనియా!' అనే వెతుకులాట 'క్రైమ్ అండ్ పనిష్మెంట్'లో రాస్కల్నికోవ్‌దే కాదు, ఆలూరి బైరాగిది కూడా. 'జీవితమిట నిరావరణ నిరాభరణ నగ్నచ్ఛవి'.

'ప్రతి మనిషీ ఒక గదిలో
చెదపురుగులు ప్రతి మదిలో
ప్రతి మనిషీ ఒక నదిలో
సుడిగుండం ప్రతి ఎదలో'

టిఎస్ ఇలియట్ 'వేస్ట్‌లాండ్'లోని exhausted wells అనే మాట 'నూతిలో గొంతుకలు' పేరుకు ప్రేరణ అయ్యిందేమో. 'నూతిలో గొంతుకలు' సంశయ కావ్యం. దీనిలో మానవుడు ఏది త్రోవ అనే అడుగుతున్నాడు. 'నాన్యః పంథా విద్యతేయనాయ' అని చెప్పగలిగే స్థితిలో లేదు. చీకటిలో ప్రారంభమైన ఈ కావ్యం 'ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలకు చర్చిస్తున్నది. దీనిలోని నాయకులు హేమ్లెట్, అర్జునుడు, రాస్కల్నికోవ్ సందిగ్ధావస్థలో ఒక క్రమబద్ధమైన పరిణామాన్ని సూచిస్తున్నారు. 'హేమ్లెట్ వేదన కర్మ పూర్వం, అర్జునుడి వేదన కర్మక్షేత్రంలో తక్షణికం. రాస్కల్నికోవ్ బాధ కర్మ తరువాత. కాని ముగ్గురి బాధ ఒకే స్థాయిని అందుకొంటుంది. అది మానవుని సహజవేదన' అన్నాడు కవి ముందుమాటలో.

'శుద్ధ కర్మ జ్ఞానాగ్నిని ప్రజ్వరిల్లజేయగలదు/ జ్ఞాన వహ్ని కర్మలనూ తేజరిల్లజేయగలదు/ కర్మకు జ్ఞానానికి శ్రుతి కుదిరినపుడు/ ఎగిరే విహంగాల కుండదా వేదన/ సంశయాన్ని చూసి స్వేచ్ఛ బెదర దపుడు/ మానవున కుండదు తనతో వాదన' (హామ్లెట్ స్వగతం). అజ్ఞానజనితమైన సామాజిక, వైయక్తిక కర్మ, శుద్ధకర్మ కాకపోవటమే బైరాగిని బాధించింది. జ్ఞానియైనవాడి కర్మే శుద్ధకర్మ కాగలదు. కానప్పుడు కర్మకు, జ్ఞానానికి శ్రుతి కుదరదు. లోతుగా చూసినప్పుడు, వ్యక్తులనుంచి నాయకులదాకా చేస్తున్న పనులు కుత్సితం కావటం, మేధావులు జ్ఞానవంతులు కాకపోవటం ఇవాళ మన కళ్లముందు దృశ్యమే.

నీతిబాహ్యమైన సమాజంలో మనసు విరిగి, బ్రతుకుపై రోసి, తనను తాను నిరుపయోగిగా, నిష్ఫలుడుగా భావించాడు బైరాగి. జీవిత విశ్వాసం కోల్పోయాడు. 'నాక్కొంచెం నమ్మకమివ్వు/ కొండల్ని పిండి కొట్టేస్తాను' అని బదులు అడిగాడు. 'తమస్సుకు స్వాగతమిస్తున్నాను/ వేల వన్నెల చాయలు చెరిపివేస్తున్నాను/ కలతనిదుర కాకుండా కలలు పగులగొడుతున్నాను'. ఈ అంతర్లోకపు కల్లోలంలోనే 'ఆగమగీతి' సంపుటి కవితలు వెలువడ్డాయి. 'చందమామ'లో పని చేసేటప్పుడు బాలగేయాలెన్నో రచించాడు. 'పలాయన్' హిందీ కవితాసంపుటి. 'దివ్యభవనం' కథాసంపుటి. నా ప్రధాన సంపాదకత్వంలో 'చినుకు' బులెటిన్‌లో ప్రచురించిన 'దరబాను' మూలాలకు దూరమైన ఒక నేపాలీ కుర్రవాడి పరాయితనాన్ని చిత్రిస్తుంది. 'విస్మృత కథ' సంకలనంలో మేం చేర్చిన 'ఒక గంట జీవితం' అధివాస్తవిక ధోరణిలో సాగుతుంది. ఇలాంటి కథల్ని మర్చిపోవటం కష్టం. ఇంకా 'పాప పోయింది' (నవల), 'కాంచనమృగం' (రూపకం) మొదలైన రచనలు కూడా.



AKBAR

> బైరాగి వేదన అంతర్లోకానికి సంబంధించింది. ఇది బాహ్యం వల్ల గాయపడిన అంతఃకరణ వేదన. ఇది వ్యక్తికి సంబంధించింది. ఈ ధోరణి కవిత్వాన్ని అవగతం చేసుకోవటానికి అస్తిత్వవాదం ఉపయోగపడుతుంది. ద్వంద్వాల మధ్య ఊగిసలాట, సంశయం, బాధ, భయం, నిరాశ మొదలైన వైయక్తిక మానసికాంశాలను పరిశీలించటానికి సార్త్ర్ సాయపడినంతగా మార్క్స్ సాయపడలేదు.

ప్రాధాన్యాన్ని బట్టి భావకవిత్వానిది భావలోక విహారం. అభ్యుదయ, విప్లవ కవిత్వాలది బాహ్యలోక విచారం. ఆ విషయం అర్థం చేసుకోవటానికి మార్క్సిజం పనికొస్తుంది. బైరాగి వేదన అంతర్లోకానికి సంబంధించింది. ఇది బాహ్యం వల్ల గాయపడిన అంతఃకరణ వేదన. ఇది వ్యక్తికి సంబంధించింది. ఈ ధోరణి కవిత్వాన్ని అవగతం చేసుకోవటానికి అస్తిత్వవాదం ఉపయోగపడుతుంది. ద్వంద్వాల మధ్య ఊగిసలాట, సంశయం, బాధ, భయం, నిరాశ మొదలైన వైయక్తిక మానసికాంశాలను పరిశీలించటానికి సార్త్ర్ సాయపడినంతగా మార్క్స్ సాయపడలేదు.

కవితావస్తువుల్లో రెండు విధానాలుంటాయి. ఒకటి తత్కాలత (the topical). ఒకానొక సాంస్కృతిక సందర్భంలో నిర్దిష్ట స్థలానికి, కాలానికి సంబంధించిన సామాజిక, రాజకీయాంశాలు, సమస్యలు ఇక్కడ చర్చించబడతాయి. రెండవది సర్వకాలత (the eternal). ఇది స్థల కాలాతీతం. భిన్న చారిత్రక, సాంస్కృతిక సందర్భాల్లోనూ దీనికి సంబద్ధత ఉంటుంది. మానవ అస్తిత్వానికి సంబంధించిన మౌలికాంశాలు, ప్రేమ-ద్వేషం, మంచి-చెడు, జీవితం-మృత్యువు, వ్యక్తి-సమాజం మొదలైనవి ఇక్కడ అన్వేషించబడతాయి. సూతాశ్రమం, శ్రీరంగం నారాయణబాబు, హుసేన్ సాగర్, రాజఘాట్, వియత్‌నామ్ లాంటి కవితలు మినహాయిస్తే, బైరాగి కవిత్వం స్థూలంగా ఈ రెండో కోవకి చెందుతుందని వేరే చెప్పనక్కర్లేదు. కనుకనే తరాలు గడిచినా, మనిషి జీవితంలో సంశయం ఉన్నంతవరకు 'నూతిలో గొంతుకలు' తమ సంబద్ధత లేదా ప్రాసంగికతని కోల్పోవు. ఇంటా బయటా చీకటి ఉన్నంతవరకు 'చీకటి నీడల' చిందులాటా తప్పదు.

బైరాగి కవిత్వంలో అడుగడుగునా కనిపించే నిరాశా నిస్పృహలు కొందరన్నట్టు పలాయనవాదమేనా? కాదనిపిస్తుంది. జీవితం పట్ల అపారమైన ప్రేమని వ్యక్తం చేసే కవితలెన్నో కూర్చాడు బైరాగి. మనిషి అంతరిక్షానికి ఎగసినప్పుడు, 'మానవమేధా విజయ పరంపరలకంతం లేదు' అని మెచ్చుకొన్నాడు. 'ఈ వంధ్యాధూళినుంచి, వికృత భస్మపాళి నుంచి/ ఉదయిస్తా డనలసంభవు డాత్మధవుడు, నవమానవుడు' అని 'ఆగమగీతి' ఆలపించాడు. నార్ల అన్నట్టు, 'జీవితరంగం నుండి హుటాహుటిగా' వెళ్లిపోయిన 'బైరాగి చేసింది పలాయనం కాదు, మహాభినిష్క్రమణ.'

'చావునుంచి పారిపోవటమే బ్రతుకు
బ్రతుకునుంచి పారిపోవట మెక్కడికీ?
తలపునుంచి పారిపోవటమే మరుపు
మరుపునుంచి పారిపోవట మెక్కడికీ?'
(పలాయనం)

క్షయరోగంతో మృత్యువు తలుపు తట్టే చప్పుడులో కూడా జంకలేదు బైరాగి. 'భయద మరణ గహ్వర తటాగ్రమున ఊయలలూగే వారెవరూ?/ తెగిన తలను తన చేత బట్టుకొని ముందుకు సాగే వారెవరూ?' అతడు నిశ్చయంగా బైరాగే. 'పువ్వుల్లో పురుగు లాగు మృత్యువుంది.' అయినా 'దూరపు వలపు పిలుపు వంటిది మరణం.' 'విలయ ఝంఝా విక్షుభిత మహాసింధుతీరాన/ ఆడుకొనే పసిపాపల కేరింతలు, చప్పట్లు వినిపించినంత వరకు నాకు చావు లేదు' అన్నాడు. 'గీత యుగళి'లో ఇటు జీవితాన్నీ అటు మృత్యువునీ సమానంగా ప్రేమించిన స్ఫురణ కలుగుతుంది.

'శబ్దాల అసమర్థత ప్రతి కవికీ ఏదో ఒక సందర్భంలో తట్టే ఉంటుంది, కవితాకామిని చేలాంచలాల కొస విసురులు ఎప్పుడూ ఒక బారెడు దూరానే మాయమైనట్లు అగుపిస్తాయి' అన్న బైరాగి వాక్యాలు ఆలోచనాత్మకాలు. 'పరాభూత కవి కరంలో విరిగిన విల్లులాంటి భాష' మాత్రమే ఉంటుంది. అతనికి ఉన్న శబ్దాలే ఎక్కువ. ఎందరో ఎప్పటినుంచో వాడి వాడి అరగదీసిన ముక్కల్నే అపురూపంగా వాడుకొంటాడు. అటువంటి వాళ్ల సరసన చేరటం గిట్టకనే, 'సుషమా విషమ వారిధిలోన దీవి వెదకే నావికుడను/ తెల్లని కాగితాలకు మసి పూసే గారడి ఇక చేయలేను/ నేను మీ కవిని కాను' అన్నాడు.

'మొక్కపోయిన అమ్ముడీ శబ్దాలు,
తిరిగి తిరిగి, విసిగి విరిగి, కరగి చెరగి, మురిగి సురిగి,
గురుతు లేని గులకరాళ్ళై వంకర మేకుల్లా పిన్నుల్లా,
గుర్రపు నాడాల్లా వీధుల్లో, త్రోవలంట ధ్వనుల నీడల్లో నక్కుతూ,

మసూచికపు మొగంలా, చిల్లి పడిన పాత్రలా అర్థం కారిపోతూ,
ఖాళీ డబ్బాల్లో మ్రోగుతూ అసంఖ్యాక స్పర్శలతో జిగటబారే శబ్దాలు'
(కవి సమస్య)

- కవిత్వంలో అరిగిపోయిన పదజాలం గురించి ఇంతకన్న శక్తిమంతంగా చెప్పగలమా? మరి సరికొత్త నుడి ఎలా ఉండాలి?

'కన్నీరై కురిసిన ఆనందంలా, పెటిలిన గంధంలా
కొడిగట్టిన కడ వెన్నెల నవ్వులా
తలగడపై నలిగిన సిగపువ్వులా
చెక్కుల చెంగావి పోయి, చిగురు మోవి కావి పోయి
ఊర్పు వగరు తావి పోయి
ఎందుకు బాసిపోతుందో అందం?'
(ఎందుకు మాసిపోతుందో ప్రేను)

అద్భుతమైన మూర్త, అమూర్త ఉపమానాలతో సాగే ఈ కవిత వచనకవితా సౌందర్యానికి మేలిమి ప్రతీక.

రెండు ప్రత్యేకాంశాలు బైరాగి కవిత్వంలో కానవస్తాయి. ఒకటి, అతని పద-సమాస-వాక్య నిర్మాణ శైలి. రెండు, ఆశ్చర్యకరమైన కల్పనాశక్తి. భాషలోని శబ్దాలు తన వ్యక్తీకరణకి చాలనప్పుడు ప్రతి గొప్ప కవీ తన భాషాసంపద (diction) తాను సృష్టించుకుంటాడు. అందుకు బైరాగి కవితే ఉదాహరణ. విలక్షణమైన పదబంధాలు, అపూర్వ సమాస నిర్మాణం మనల్ని ఆ తావున నిలబెట్టి, తమ అంతరార్థం లోతుగా చూడమంటాయి. 'చితికిన టొమేటో లాంటి సూర్యుడో, ఆరిన అప్పడం లాంటి చంద్రుడో' అదాటుగా కనపడి, అప్పటిదాకా మన కళ్లముందు తేజోరూపాలుగా కదలాడినవి పాలిపోయి జాలి గొలుపుతాయి. ఏమి పోలికలవి! 'పరమశివుని శూలాగ్రాన తలక్రిందులుగా నిలబడటం, కాలునితో కలబడటం' ఊహించగలమా? 'నమ్మకం లోపించిన జీవితాన్ని ఖాళీ సిగిరెట్టు టిన్నుగా, పుల్లలు లేని అగ్గిపెట్టెగా, కాలిన సిగిరెట్టు బూదిగా' రూపించటం అతని ఊహకే సాధ్యమైంది.

కవిత్వంలో 'నిశ్చల నిశ్చితాల'తోపాటు సంధ్యాజీవులూ సందేహభావులైన కవుల కనుచీకటి వెతుకులాటలూ ముఖ్యమే అని నా కవిత్వానుభవం చెపుతుంది. ఎందుకంటే నిశ్చల నిశ్చితాల్లో 'ఇది ఇది' అని కవి చేసే పూర్వ నిర్ధారణలూ నిర్దేశిత లక్ష్యాలూ ఉంటాయి. వడ్డించిన విస్తరిలా అంతా స్పష్టమే. అక్కడ నేనుగా వెతికి, తెలుసుకోవాల్సింది పెద్దగా ఉండదు. మరి ఒక్కోసారి విస్తరిలో జిలేబి కన్న జామచెట్టెక్కి కోసుకున్న దోరగాయ రుచిగా ఉంటుంది. ఇక్కడ నా కదలిక, ప్రయత్నం ఉన్నాయి గనుక. తెరిపిలేని అన్వేషణాయాత్రికుడైన కవి నాకు అట్టి కదలికనిస్తాడు. కలవరం కలిగిస్తాడు. అందుకే ఏకతార మీటుకుంటూ వెళ్లిపోయే బైరాగి అనబడే బైరాగి నాకిష్టం.

పాపినేని శివశంకర్
85008 84400

భాషను బతికించేది సంభాషణం!

మన దేశంలో రకరకాల భాషలు ఆయా ప్రాంతాలలో ప్రధాన భాషలుగా ఉన్నాయి. ఆ ప్రధాన భాషలకు అనుబంధంగా మాండలిక భాషలు మరెన్నో ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో గుర్తించిన 24 భాషలు మాత్రమే కాక, ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలకు, సమాచార చేరవేతకు అనువైన భాషలుగా 542 పైగా ఇతర భాషలు వాడుకలో కొనసాగుతున్నాయి. వీటికి తోడు అంతగా గుర్తింపు లేని భాషలు కూడా మరెన్నో ఉన్నాయి. భారతదేశంలోని భాషా సంప్రదాయాలను, వాటిలోని శాస్త్రీయతను, పదోత్పత్తిని, సామ్యతలను, పోలికలను ఆసరా చేసుకుని భాషా శాస్త్రవేత్తలు భాషలను నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి: 1) ఇండో ఆర్యన్ (ఇండో యూరోపియన్) భాషా కుటుంబం. భారతీయులలో 77శాతం మంది ఈ భాషా కుటుంబంలోని భాషలలోనే మాట్లాడుతున్నారు. 2) ద్రవిడియన్ భాషా కుటుంబం. దక్షిణ భారత దేశానికి చెందిన 20.6శాతంమంది ఈ కుటుంబానికి చెందిన తమిళ, మలయాళ, కన్నడ, తెలుగు భాషలలో మాట్లాడతారు. 3) ఆస్ట్రో - ఆసియాటిక్ భాషా కుటుంబంలో 1.2శాతం మంది, 4) సైనో - టిబెటన్ భాషా కుటుంబంలో 0.8శాతం మంది ప్రజలు మాట్లాడుతారు.

ఇవే కాక భారతదేశంలోని భాషలను లిపి (Script) ఆధారంగా స్థూలంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. 1) లిపిలేని భాషలు, 2) లిపి ఉన్న భాషలు, 3) లిపి లేకున్నా ప్రజా వ్యవహారంలో వాడుకలో ఉండి, ఇతర ప్రధాన భాషల లిపితో రాయబడే భాషలు. ప్రజల నాలుకల మీద నడయాడే ఈ భాషలు, స్థానిక సంప్రదాయాలు, వృత్తుల ఆధారంగా మరిన్ని మాండలిక పదాలతో కలిసి వాడుకలోని భాషలుగా కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయంగా భాషల పైన, భాషలోని వైవిధ్యంపైన పరిశోధన చేసి పరిశీలన చేసి సూచనలు చేసే యునెస్కో లాంటి సంస్థలు భాషల పరిణామక్రమాన్ని, భాషల విస్తృతిని, వాడుకను అనుసరించి భాష ఏదైనా నిత్యగతిశీలతతో, నిరంతరం మార్పు చెందుతూ ఉంటుందని చెబుతాయి. ఎందుకంటే ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా ఖండాలలోని తొలితరం భాషలకు ఇప్పటి భాషలకు మధ్య చాలా తేడాలు క్రమ పరిణామంలో కనిపిస్తున్నాయి. మరొకవైపున ఆ తొలితరం నాటి భాషలు కూడా మధ్యయుగ కాలంలో వివిధ భాషల సంయోగంతో మిళితమై, రూపొంది వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం బహుభాషా విధానాల (multilingual) శైలిలో భాషలు, ఆదాన ప్రదానాలతో కొత్త సొబగులను అల్లుకోవడం జరుగుతోంది.

దీనికి తోడు, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా కొన్ని పదుల భాషలు వాడుక లేని కారణంగా అంతరించిపోతున్నాయని యునెస్కో ఆందోళన వెలిబుచ్చింది. భాషలు కనుమరుగు కావడం అంటే ఆ మేరకు ఆయా మానవుల జాతి చరిత్ర, సంస్కృతి ఈ నేలమీది నుంచి తుడిచిపెట్టుకు పోవడమే అని భావించింది. అందుకే ఈ విషయమై 1992లో కెనడాలో International congress of Linguists (ICL) పేరిట చర్చలు ప్రారంభించి, అదే సంవత్సరం పారిస్‌లో జరిగిన సమావేశంలో నిర్దిష్టమైన ప్రతిపాదన చేసి, ప్రతి ఏటా Red Book of Endangered Languages పేరిట నివేదికను ప్రచురించాలని నిర్ణయించింది. అలా సేకరించిన సమాచారాన్ని అంతా ఒక్కచోట క్రోడీకరించాలనే లక్ష్యంతో 2009లో Atlas of the Endangered Languages అనే పేరుతో నివేదికను ప్రచురించింది. ఇది ప్రపంచ స్థాయిలోని అన్ని భాషల వాడుక, విస్తృతి స్థాయిని 6 రకాలుగా చెప్పింది. అవి: 1) Extinct: మాట్లాడే ప్రజలు ఒక్కరు కూడా లేని భాష. 1950 సంవత్సరం తర్వాత ఏ భాషనైతే మాట్లాడేవారు ఒక్కరు కూడా లేనట్లుగా గుర్తిస్తామో ఆ భాష సంపూర్ణంగా అంతరించిన భాషగా పరిగణించవచ్చు. 2) Critically Endangered: వృద్ధులు, పెద్దవారు మాట్లాడుతూ యువకులు మాత్రం అప్పుడప్పుడూ, మాట్లాడుతూ ఉండే భాష. 3) Severely Endangered: తాతల తరం వాళ్ళు చక్కగా మాట్లాడుతూ, తండ్రుల తరం మాట్లాడకపోయినా ఆ భాషను అర్థం చేసుకోగలిగి ఉండి, యువతరం వారు మాత్రం అసలే మాట్లాడలేని స్థితి కలిగిన భాష ఈ కోవలోనిది. 4) Definitely Endangered: ఇంట్లో మాతృభాషగా కూడా వాడుకలో లేక పిల్లలు నేర్చుకోలేని, మాట్లాడలేని భాష. 5) Vulnerable: పిల్లల తరం వారందరూ చక్కగా మాట్లాడినప్పటికీ, అది కేవలం కొన్ని ప్రాంతాలకు (ఇల్లు) మాత్రమే పరిమితమై కొనసాగే భాషను ఈ స్థితికి చెందినదిగా భావించవచ్చు. 6) Safe/Non-Endangered: అన్ని తరాలవారు మాట్లాడ గలిగి, వారి మధ్య భావవ్యక్తీకరణకు ప్రధాన సాధనంగా ఉండే భాష వాడుక భాషగా, వ్యవహార భాషగా, బోధన భాషగా కొనసాగుతూ జీవద్భాషగా ఉంటుంది.



భాషాభ్యసన సంపూర్ణం అవడానికి నాలుగు ప్రక్రియలలో నైపుణ్యం అవసరం అని చెప్పవచ్చు. 1) శ్రవణం, 2) సంభాషణం, 3) చదవడం, 4) రాయడం. ఈ నాలుగింటిలో శ్రవణం, చదవడం అనేవి passive skills గాను, సంభాషణం, రాయడంను Active Skills గానూ వర్ణించవచ్చు.

> భాషలు తమ ప్రత్యేకతను, ఉనికిని కొనసాగించాలంటే చదవడం, రాయడం అనే 'లిపి'పరమైన నైపుణ్యాల కన్నా వినడం, మాట్లాడటం అనే నైపుణ్యాల ఆవశ్యకత అత్యధికంగా ఉంది. ఏదో ఒక వ్యాపార ప్రకటనలో 'మాట్లాడేవాడే మొనగాడు' అన్నట్లు, ఇప్పుడు భాషను ఎంత విస్తారంగా మాట్లాడితే, ఆ భాష అంతగా కొనసాగుతుందని, పది కాలాల పాటు మనగలుగుతుంది.

అయితే ఈ నాలుగింటికి ప్రస్తుత కాస్మో పాలిటన్, గ్లోబల్ యుగంలో పరిమితులెన్నో ఏర్పడ్డాయనేది వాస్తవం. దీనికి ప్రధాన కారణం ప్రస్తుత సమకాలీన మానవుడు ఒకే సంస్కృతి, భాషా వాతావరణంలో జీవించలేకపోవడమే! అందుకని నిర్దిష్టంగా ఒక భాషా సంస్కృతులను నేర్చుకుని ఉండిపోవటం సాధ్యపడటం లేదు. బహు భాషల, బహు సంస్కృతుల సమ్మేళన రూపంగా అత్యాధునిక జీవన శైలి స్థిరపడ్తున్నది.

ఒక భాష అంతర్ధానం కావడంలో "మాట్లాడటం" (Speaking) ఎంత ముఖ్యమైనదో, ఆ భాషకు లిపి (Script) ఉండటం, ఆ లిపిని రాయగలడం (Writing) కూడా అంతే ప్రముఖమైనదని చెప్పవచ్చు. అయితే 'లిపి' లేకపోయినప్పటికీ చాలా సందర్భాలలో మాట్లాడటం అనే వాడుక వల్ల ప్రజలలో ఆయా భాషలు కొనసాగుతూ ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో భాషలు తమ ప్రత్యేకతను, ఉనికిని కొనసాగించాలంటే చదవడం, రాయడం అనే 'లిపి'పరమైన నైపుణ్యాల కన్నా వినడం, మాట్లాడటం అనే నైపుణ్యాల ఆవశ్యకత అత్యధికంగా ఉంది. ఏదో ఒక వ్యాపార ప్రకటనలో 'మాట్లాడేవాడే మొనగాడు' అన్నట్లు, ఇప్పుడు భాషను ఎంత విస్తారంగా మాట్లాడితే, ఆ భాష అంతగా కొనసాగుతుందని, పది కాలాల పాటు మనగలుగుతుంది అని చెప్పవచ్చు. అందుకే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆయా మాతృభాషల ప్రేమికులు తమ తమ "స్వభాషలలో మాట్లాడే ఉద్యమానికి" (Speaking own Language movement) మద్దతునిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ, మాటల వారసత్వాన్ని భాషా పరిరక్షణకు సాధనంగా వాడుతున్నారు. అలాగే వారసత్వ సంపద అంటే కేవలం నిర్మాణాలు అనే నిర్వచనం నుంచి విస్తరించి భాష కూడా అందులో భాగమే అని గుర్తించి, ఆ దిశగా సమాజంలోని అందరూ నడుంకట్టాల్సిన తరుణం ఇదే!

మామిడి హరికృష్ణ
80080 05231

ప్రేమ ఋణం



కుదురు లేని నిద్ర
లోలోన పిగిలిపోతూ ప్రాణం

నాన్న నొప్పి లేకుండా కన్ను మూశాడు
అమ్మను మరణం నిరాకరిస్తోంది

కొద్దికొద్దిగా చస్తూ
కంటిచెమ్మను పొదుపుగా ఒలికిస్తోంది

వచ్చే దారిలో చూస్తున్నాను
కూలుతోన్న తరువులో అమ్మను

ఎంత నీడనిచ్చింది
ఎన్ని పళ్ళనిచ్చింది
చెప్పలేనంత కలపనిచ్చింది

మోడు చెట్టుపై
పిట్టలు వాలడం లేదు
మాలాగే

ఎంత దృఢత్వం అమ్మది
పుల్లలా మిగిలిన తనను చూస్తోంటే
మా రంగులు వెలిసిన బొమ్మలు
దర్శిస్తున్నాము

కొద్దిసేపు పిల్లలు చుట్టుముట్టినపుడు
వాన పలకరిస్తే
ఎండిన చెరువులో నీటివాసనలా
తన ముఖంలో చిటికెడు శాంతి

అరిగిపోయిన గరిటలా
అన్నం పెట్టిన చేయి బూడిద రంగులో

ఆ గుప్పిటలోనే
నా చిటికెనవ్రేలు
జీవిత స్పర్శను ప్రేమగా చూసింది

ఇప్పుడు 'ప్రేమ'
ఉనికిని ఆర్పేసుకుంటున్న
మునిమాపులా
దీర్ఘ సెలవును కోరుకుంటోంది

మృత్యువు సంతకం చేసేలోపు
మళ్ళీ తన చుట్టూ
బాల్యం బొమ్మలు గీయాలి

అమ్మ చివరి దస్తూరిని
పెరట్లో మొక్కగా దాయాలి

బతికున్నంతవరకు
పిల్లల్లో అమ్మను బతికించుకోవాలి

తెలుగు వెంకటేష్
99853 25362



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఓట్ల లెక్కింపు సమయం రానే వచ్చింది. కొన్ని గంటల్లోనే 21 రోజుల రాజకీయ ఉత్కంఠకు తెర పడనుంది. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ప్రజాతీర్పు మంగళవారం వెలువడనుంది. ఈసారి పోలింగ్ శాతం పెరగడంతో ఫలితాలపైనా ఉత్కంఠ నెలకొంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అధికారులు ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఇక ఫలితాల కోసం ఎదురు చూడటమే తరువాయి.

ఆఖరి ఘట్టం!

21 రోజుల నిరీక్షణకు కొన్ని గంటల్లో తెర

- నోవా కాలేజీలో విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల లెక్కింపు
- నిమ్రా కాలేజీలో విజయవాడ ఈస్ట్, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల లెక్కింపు
- మొత్తం 196 టేబుళ్లపై లెక్కింపు.. పార్లమెంట్ 98, అసెంబ్లీ 98 టేబుళ్లపై...
- గరిష్టంగా ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ద్వారా 22 రౌండ్ల పాటు లెక్కింపు
- పోస్టల్ బ్యాలెట్ రెండు రౌండ్లలోనే 14 టేబుళ్లపై లెక్కింపు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విజయవాడ పార్లమెంట్‌తో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,04,077 మంది ఓటర్లకు గాను 13,52,411 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 22 వేల మంది పోస్టల్ బ్యాలెట్లకుగాను 17,574 మంది ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెరసి అటు ఈవీఎంలు, ఇటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 13,69,985 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఏ నియోజకవర్గం ఏ కేంద్రంలో లెక్కింపు?

- తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి నోవా ఇంజనీరింగ్ కాలేజీ మెయిన్ బ్లాక్ సెకండ్ ఫ్లోర్ హాల్ నెంబర్ 2లో లెక్కింపు ఉంటుంది.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నోవా ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నెంబర్ కే009లో లెక్కింపు నిర్వహిస్తారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి నోవా కాలేజీ గ్రౌండ్ ఫ్లోర్ మెకానికల్ బ్లాక్ రూమ్ నెంబర్ 2, 3లలో లెక్కింపు నిర్వహిస్తారు.
- విజయవాడ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీ ఫస్ట్‌ఫ్లోర్ బీ - 201 నుంచి 204 వరకు లెక్కిస్తారు.
- మైలవరం నియోజకవర్గానికి సంబంధించి నిమ్రా మెడికల్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎగ్జామ్ హాల్‌లో లెక్కింపు నిర్వహిస్తారు.
- నందిగామ నియోజకవర్గానికి సంబంధించి నోవా ఇంజనీరింగ్ కాలేజీ థర్డ్ ఫ్లోర్‌లోని ఆడిటోరియంలో లెక్కింపు నిర్వహిస్తున్నారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నెంబర్ బీ - 103, 104లలో లెక్కింపు నిర్వహిస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ లెక్కింపునకు ఇబ్రహీంపట్నం, జూపూడిలలోని నోవా ఇంజనీరింగ్, నిమ్రా ఇంజనీరింగ్ అండ్ మెడికల్ కాలేజీలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములు కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూముల నుంచి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బాక్సులను తీసుకు వెళ్లడానికి వీలుగా ప్రత్యేకంగా బ్యారికేడింగ్ చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ భద్రత నడుమ వీటని తరలిస్తారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి కూడా అభ్యర్థులు, ఏజంట్లు, మీడియా ప్రతినిధులు వెళ్లడానికి వీలుగా ఒక బ్యారికేడింగ్, అధికారులు, కౌంటింగ్ సిబ్బంది వెళ్లటానికి వీలుగా మరో బ్యారికేడింగ్ క్యూ ఏర్పాటు చేశారు. మూడంచెల పోలీసు భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపును వేటికవే చేపడుతున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కింపును కూడా వేటికవే చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 196 టేబుళ్లపై లెక్కింపు చేపడుతున్నారు. ఇందులో 98 టేబుళ్లపై పార్లమెంట్, 98 టేబుళ్లపై అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం కంట్రోల్ యూనిట్లను లెక్కించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం మరో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. గరిష్టంగా 22 రౌండ్లపాటు ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును నిమ్రా మెడికల్ బ్లాక్‌లోని మొదటి ఫ్లోర్‌లో నిర్వహించనున్నారు. పోస్టల్ బ్యాలెట్లన్నింటినీ కలిపి రెండు రౌండ్లలో లెక్కించనున్నారు. దీంతో ఫలితం మధ్యాహ్నం 3- 4 గంటల కల్లా వెలువడుతుందని, సాయంత్రం నాటికి అభ్యర్థులకు డిక్లరేషన్ ఇస్తారని అంటున్నారు. ఇవన్నీ జరగాలంటే.. ప్రక్రియ వేగంగా జరగాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ సజావుగా సాగితేనే ఇది సాధ్యమౌతుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో వివాదాలు రాకుండా ఉండాలి. రీ పోలింగ్‌కు గొడవలు వచ్చినా.. ఇంకా జాప్యమయ్యే పరిస్థితులు ఉంటాయి.

4 గంటలకే.. ఫలితం

- ఆరు గంటలకే డిక్లరేషన్
- జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

6లో..

గీత దాటొద్దు

- అల్లర్లు సృష్టిస్తే 'షీట్' తెరుస్తాం
- నగర కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ



కృష్ణా యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

- కౌంటింగ్ కేంద్రంలో గందరగళం సృష్టించేవారిని బయటకు పంపాలని పోలీసులకు కలెక్టర్ ఆదేశాలు
- 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్
- విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కృష్ణా యూనివర్సిటీలో కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో అధికారులు దాదాపు ఏర్పాట్లు పూర్తిచేశారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు నియోజకవర్గావారీగా కలెక్టర్ ఆదివారం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు.

● ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు

జిల్లాలో 15,39,460 మంది ఓటర్లు ఉండగా, వారిలో 12,93,935 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటుచేసి ఓట్లను లెక్కించనున్నారు. ఒక్కో టేబుల్‌కు ఏఆర్వో, కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ అబ్జర్వర్ ఒకరు చొప్పున ఉంటారు. కౌంటింగ్ కోసం అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు స్థానం ఓట్ల లెక్కింపు కోసం 980 మందిని నియమించారు. మచిలీపట్నం నియోజకవర్గం 15 రౌండ్‌లు, పెడన నియోజవర్గానికి 16 రౌండ్‌లు, పామర్రు, గుడివాడ అసెంబ్లీ స్థానాలకు 17 రౌండ్‌ల చొప్పున ఓట్లు లెక్కిస్తారు. పెనమలూరు, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు 20 రౌండ్‌లు అవనిగడ్డ నియోజకవర్గం 22 రౌండ్‌లలో ఓట్లు లెక్కిస్తారు.

● తొలుత పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు

జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 21,579 పోస్టల్ బ్యాలెట్‌లు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 21,728 పోస్టల్ బ్యాలెట్లను ఉద్యోగులు ఉపయోగించుకున్నారు. పార్లమెంట్ స్థానం పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పామర్రు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు టేబుళ్లు, పెడన నియోజకవర్గానికి మూడు, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాలకు ఆరు టేబుళ్లు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాలకు 8 టేబుళ్లు చొప్పున ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు.

● కౌంటింగ్ కేంద్రాలివే

కృష్ణా యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడ్మినిస్ట్రేటివ్‌బ్లాక్‌లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంటుస్థానానికి సంబంధించిన కౌంటింగ్ జరుగుతుంది.

గొడవ చేస్తే బయటికే : ఎస్పీ

కౌంటింగ్ కేంద్రం వద్ద, కౌంటింగ్ కేంద్రంలో పోలీస్‌శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి పోలీస్ అధికారులతో కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో పనిగట్టుకుని ఏదైనా పార్టీకి చెందిన ఏజెంట్లు గొడవకు దిగినా, గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేసినా అలాంటి వారిని ఎన్నికలసంఘం నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల గృహాల వద్ద, కీలక కూడళ్లలో విజయోత్సవాలు, ర్యాలీలు చేయకుండా నియంత్రణ చేయాలన్నారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి



చిల్లకలు టోల్ ప్లాజా

ఆర్టీసీ టోల్ తీస్తున్నారు!

టోల్‌చార్జీలతో జగ్గయ్యపేట డిపోకు పెరుగుతున్న నష్టం

టోల్‌దెబ్బకు జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో విలవిలలాడిపోతుంది. ఏటా పెరుగుతున్న టోల్‌చార్జీలతో భారం తడిసి మోపెడవుతోంది. ఏటా ఆదాయంలో రూ.5 కోట్లు టోల్‌చార్జీలు కట్టేందుకు పోవటంతో సంస్థ నష్టాల ఊబిలోకి వెళ్లిపోయింది. ఒక్క టోల్‌దెబ్బకు సంవత్సరానికి కోటి రూపాయల నష్టం వాటిల్లుతోంది. జగ్గయ్యపేట నుంచి 7 కి.మీలలోపు ఉన్న చిల్లకల్లు టోల్‌ప్లాజా.. డిపో మనుగడను సవాల్ చేస్తుంటే.. అదేరూట్‌లో కీసర టోల్‌ప్లాజా టోల్ వాయిస్తోంది.

- 7 కి.మీల దూరంలోనే చిల్లకల్లు టోల్‌ప్లాజా
- లోకల్‌గా గుర్తించని జీఎంఆర్ సంస్థ
- ఏటా రూ.5కోట్లు టోల్‌చార్జీలకే
- ప్రయాణికుల టికెట్ల ద్వారా రీయింబర్స్‌మెంట్ చేసినా నష్టమే
- టోల్‌దెబ్బకు ఏటా రూ.కోటి నష్టం
- తాజా పెంపుతో మరో రూ.50 లక్షలు..

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోకు అత్యంత ఆదాయం, ఆక్యుపెన్సీ రేషియో ఉన్న రూట్ విజయవాడ. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు ప్రతి 5-10 నిమిషాలకు ఒక సర్వీసు నడుపుతుంది. ప్రతిరోజూ జగ్గయ్యపేట-విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, బెంగుళూరు, విజయవాడ-హైదరాబాద్ రూట్లలో తిరిగే సర్వీసులు 353 ట్రిప్పులు వేస్తున్నాయి. ఒక్కొక్క ట్రిప్పుకు చిల్లకల్లు టోల్‌ప్లాజాకు రూ.510, కీసర టోల్‌ప్లాజాకు రూ.480 వెరసి రూ.990 చొప్పున ప్రతిరోజూ రూ.3.49 లక్షలు సుమారుగా చెల్లిస్తుంది. అంటే సాలీనా రూ.5.4 కోట్లు టోల్ రూపంలో డిపో ఆదాయంలో కోత పడుతుంది. ఈ టోల్‌చార్జీలను ప్రయాణికుల నుంచి వసూలు చేసేందుకు ఒక టికెట్‌పై రూ.7-రూ.9 సర్‌చార్జి రూపంలో వసూలు చేస్తుంది. ఆ విధంగా వసూలు చేసిన సర్‌చార్జి ద్వారా రూ.4.03 కోట్లు తిరిగి డిపో పొందగలుగుతుంది. అయినా సరే ఏటా కోటి రూపాయాల నష్టం వాటిల్లుతుంది. చిల్లకల్లు టోల్‌గేట్ ఏర్పాటు చేయక ముందు డిపో నష్టం మొత్తం కోటిలోపు ఉండేది. ఇప్పుడు ఒక్క టోల్‌చార్జీల ద్వారానే కోటి నష్టం రావటంతో రూ.5 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుంది.

కీసర టోల్‌ప్లాజా చార్జీలు రికవరీ

చిల్లకల్లు టోల్‌ప్లాజాకు ముందు నుంచి కీసర టోల్‌ప్లాజా ఉండేది. టోల్‌ప్లాజా పెట్టిన తొలినాళ్లలో జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోను లోకల్‌గా గుర్తించటంతో టోల్ భారం పడలేదు. ఆ తర్వాత వసూళ్లు ప్రారంభించినా ఇప్పటి వరకు టోల్‌చార్జీల కింద చెల్లించే మొత్తానికి, ప్రయాణికుల నుంచి టికెట్‌పై సర్‌చార్జి రూపంలో వేసే మొత్తానికి సరిపోయేది. నందిగామ నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఒక్కో క్రమంలో ఒక్కసారి టోల్ రూపంలో డిపోకు అదనపు ఆదాయమే లభించింది. కేవలం 7 కి.మీల లోపు దూరంలో ఉన్నా చిల్లకల్లు టోల్‌ప్లాజా ఆర్టీసీ డిపోకు ఎలాంటి మినహాయింపు ఇవ్వటం లేదు. ఒక్కొక్క సమయంలో డిపో నుంచి విజయవాడ వెళ్లే సర్వీసులకు కనీసం ప్రయాణికులు లేకపోవటంతో కండక్టర్లు ముందు తమ డబ్బులు టోల్ చార్జీలుగా చెల్లించాల్సి వస్తుంది.

మూడేళ్లలో లక్షల నుంచి కోట్లలోకి నష్టం

జగ్గయ్యపేటకు గడిచిన మూడేళ్లలోను నష్టం అనేక రెట్లు పెరిగిపోయింది. 2020-21 సంవత్సరంలో రూ.8,31,975 నష్టం రాగా, 2021-22లో రూ.57,67,279, 2021-22లో 1,03,52,863 తాజా సంవత్సరంలో రూ.96,98,242 ఇప్పటి వరకు నష్టం వాటిల్లింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్‌ప్లాజాల్లో చార్జీలు పెరుగుతున్నాయి. బస్సులకు ఒక ట్రిప్పుకు రూ.25, 24 గంటల్లోపు తిరిగి వస్తే రూ.35 పెరుగుతున్నాయి. ఈ లెక్కన డిపోకు నెలకు రూ.3.67 లక్షలు అదనపు భారం తప్పేట్టు లేదు. సాలీనా మరో రూ.45 లక్షలు భారం పడుతుంది.

ప్రయాణికుల నుంచి వసూలు చేసినా నష్టమే

టోల్‌గేట్ల వల్ల ఆర్టీసీపై పడుతున్న భారాన్ని తగ్గించుకునేందుకు టికెట్లపై సర్‌చార్జి రూపంలో వసూలు చేస్తున్నా నష్టం తప్పట్లేదని డిపో మేనేజర్ రఘురాం చెప్పారు. జగ్గయ్యపేట-నందిగామ మధ్య ప్రయాణికుల సంఖ్య పెరిగితేనే నష్టం తగ్గుతుందన్నారు. ఈ ఏడాది రూ.98 లక్షలు టోల్ రూపంలో నష్ట పోతున్నామని చెప్పారు.

మటన్‌తో మటాష్

వినియోగదారులకు నిల్వ మాంసం విక్రయాలు



ఎంజీ రోడ్డులోని బృందావనం కాలనీకి చెందిన సతీష్‌కు తలకాయ మాంసం తినాలనిపించింది. స్నేహితుడితో కలిసి నగరంలోని ఓ మటన్ షాపు వద్దకు వెళ్లాడు. రూ.400లతో మేక తలకాయను కొనుగోలు చేశాడు. షాపు నిర్వాహకుడు దాన్ని శుభ్రం చేసి ముక్కలుగా చేసి ఇచ్చాడు. ఇంటికి తీసుకెళ్లి ఆ ముక్కలను శుభ్రం చేస్తుండగా వాటి నుంచి చెడు వాసన రావడాన్ని సతీష్ భార్య గుర్తించింది. ఇది తాజా తలకాయ కాదని నిర్ధారించారు. తెచ్చింది నిల్వ తలకాయ అని, ఈరోజు కోసిన మేకది అయితే ఎర్రగా ఉంటుంది, తెచ్చిన తలకాయ మాంసం తెలుపు రంగులో ఉందని భావించారు. ఈ మాంసాన్ని తీసుకుని కొనుగోలు చేసిన షాపు వద్దకు వెళ్లి అడగ్గా ఇది తాజా మాంసమని బుకాయించాడు. ఆదివారం ఉదయం జరిగిన ఘటన ఇది.

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చనిపోయిన గొర్రెలు, మేకల కొనుగోళ్లు
- తొలగించిన పేగుల స్థానంలో ఐస్
- విజయవాడకు తీసుకొచ్చి షాపులకు సరఫరా
- తక్కువ ధరకు చనిపోయిన మేకల కొనుగోలు
- ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన వీఎంసీ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : మాంసాహార ప్రియుల బలహీనతలను మటన్ వ్యాపారులు సొమ్ములు చేసుకుంటున్నారు. సాధారణంగా ఆదివారం వచ్చినా, పండుగలు, వార్షికోత్సవాల్లో మాంసాహార వంటకాలను తయారు చేసుకోవడం పరిపాటిగా మారింది. వాటిలో ఆదివారం వచ్చిందంటే ఎక్కువ కుటుంబాలు చికెన్, మటన్ కొనుగోలు చేస్తారు. ఈ షాపులన్నీ ఆదివారం రోజున కిటకిటలాడతాయి. విజయవాడలో మటన్ వ్యాపారులు మాత్రం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయించేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసే వీఎంసీ సిబ్బందికి ముడుపులు ముట్టడం, ఏదైనా జరిగితే కాపాడడానికి రాజకీయ నేతలు వెనుక ఉండడంతో మటన్ వ్యాపారులు చేసే మాయలకు అంతులేకుండా పోతోంది. కొంతమంది ఏకంగా చనిపోయిన మేకలు, గొర్రెల మాంసాన్ని వినియోగదారులకు అంటకడుతున్నారు.

రూ.1500లకే గొర్రెల కొనుగోలు

మటన్ వ్యాపారులు శనివారం తెల్లవారుజామున సంతకు వెళ్లి ఆరోగ్యవంతమైన గొర్రెలు, మేకలను ఎంచుకుని కొనుగోలు చేస్తారు. వాటిని ఆదివారం తెల్లవారుజామున కబేళాకు తీసుకెళ్లి వీఎంసీ వెటర్నరీ, శానిటరీ సిబ్బంది సమక్షంలో వేట వేయిస్తారు. ఈ మాంసంపై వీఎంసీ అధికారులు స్టాంపు వేస్తారు. మార్కెట్లో ఆరోగ్యవంతమైన గొర్రె గానీ, మేక గానీ రూ.15-20వేల ఖరీదు ఉంటుంది. కొంతమంది వ్యాపారులు అనారోగ్యంతో ఉన్న మేకలు, గొర్రెలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నల్లపాడులో ప్రతి శనివారం తెల్లవారుజామున ఈ సంత నడుస్తోంది. ఇక్కడకు ఎక్కువగా నల్లగొండ, ప్రకాశం జిల్లాల నుంచి మేకలు, గొర్రెలను తీసుకొచ్చి యజమానులు విక్రయించుకుంటారు. వాటిలో ఎక్కువగా అనారోగ్యం బారిన పడిన జంతువులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అటువంటి వాటిని ఈ మటన్ బ్రదర్స్ రూ.4-5వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇది కాకుండా వినుకొండ సంతలో చనిపోయిన మేకలను రూ.1500 నుంచి రూ.2వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అక్కడే వాటిని శుభ్రం చేయిస్తున్నారు. చర్మం తొలగించి, కడుపులో ఉన్న పేగులను తీయించి ఆ స్థానంలో ఐస్ అమర్చుతున్నారు. అక్కడి నుంచి వాహనాల్లో విజయవాడకు తీసుకొస్తున్నారు. ఈ మాంసాన్ని షాపుల్లో ఉన్న ఫ్రీజర్లలో భద్రపరుస్తున్నారు. కొంతమంది ప్రత్యేకంగా ఇళ్లు అద్దెకు తీసుకుని అక్కడ భద్రపరుస్తున్నారు. వారు విక్రయించేదంతా స్వచ్ఛమైన మాంసం అని ప్రజలు విశ్వసించేలా ఏమాత్రం రాజీపడకుండా కిలో రూ.850లకు అమ్ముతున్నారు.

● స్టోరేజీ పాయింట్లలో నిల్వ

కొంతమంది వ్యాపారులు నిల్వ మాంసాన్ని తాజా మాంసంలో మిశ్రమం చేసి విక్రయిస్తున్నారు. కొంతమంది ఈ నిల్వ మాంసాన్ని స్టోరేజ్ పాయింట్లలో భద్రపరుస్తున్నారు. దీనికి సంబంధించి పాయింట్ల నిర్వాహకులు వ్యాపారుల నుంచి అద్దె వసూలు చేస్తున్నారు. ఈ విధంగానూ కాసులు జేబుల్లో వేసుకుంటున్నారు. సాధారణంగా ఏదైనా ఒక పదార్థాన్ని ఫ్రీజర్లలో భద్రపరిచేటప్పుడు దాని శీతోష్టస్థితి 1-2 డిగ్రీల మధ్య ఉండాలి. ఈ నిబంధనను మటన్ వ్యాపారులు పాటించడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా వీఎంసీలో వెటర్నరీ విభాగం ఉంటుంది. ఈ విభాగ అధికారులు మాంసం అమ్మకాలు ఎక్కువగా జరిగే రోజుల్లో తనిఖీలు నిర్వహించాలి. ముడుపుల రుచుల కారణంగా అధికారులు షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



ఛీ.. ఛీ.. అశుద్ధం!

పీఎన్‌బీఎస్‌లో మ్యాన్‌హోల్ నుంచి ఎగదన్నిన మలం



ఆసియా ఖండంలోనే రెండో పెద్ద బస్టాండ్‌గా పేరుపొందిన పీఎన్‌బీఎస్ ఇది. బస్‌స్టేషన్ అండర్ గ్రౌండ్‌లో సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ లేక మ్యాన్‌హోల్‌పైకి ఎగదన్ని మలం బయటకు ప్రవహించింది. దీంతో సమీపంలో ఉన్న ప్రయాణికులంతా ముక్కున వేలేసి పరుగు లంకించారు. తీవ్ర దుర్గంధంతో పాటుగా శబ్దంతో గ్యాస్ కూడా రావడంతో వాసన భరించలేక బస్‌స్టేషన్‌లోని ప్రయాణికులు విలవిలలాడిపోయారు. బస్‌స్టేషన్‌లో 15, 16, 17, 18, 19, 20 ప్లాట్‌ఫామ్‌ల దగ్గర ఇది ఆదివారం మధ్యాహ్నం జరిగితే అధికారులు సాయంత్రం వరకూ స్పందించలేదు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

గీత దాటొద్దు

'ఆంధ్రజ్యోతి'తో విజయవాడ నగర కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ

"జిల్లాలో మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నాం. లెక్కింపు కేంద్రాల వద్ద, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. జిల్లావ్యాప్తంగా 144, 30 సెక్షన్లు అమలులో ఉన్నాయి. వాటిని ఉల్లంఘించి ఎవరైనా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదు. ఎవరైనా గీత దాటి అల్లర్లు సృష్టించారంటే రౌడీషీట్ తెరుస్తాం" అని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి చేసిన ఏర్పాట్లపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- లెక్కింపునకు పటిష్ఠ బందోబస్తు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- అల్లర్లు సృష్టిస్తే 'షీట్' తెరుస్తాం
- కౌంటింగ్ కేంద్రం వద్ద 150 సీసీ కెమెరాలతో నిఘా
- జిల్లాలో 4500 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలన
- జిల్లా వ్యాప్తంగా 144, 30 సెక్షన్ల అమలు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

? ఎంతమందిని బందోబస్తుకు ఉపయోగిస్తున్నారు..

జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలోని నిమ్రా, నోవా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూాల్లో బ్యాలెట్‌బాక్స్‌లు ఉన్నాయి. నోవా ఇంజనీరింగ్ కళాశాలలో తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, నందిగామ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల లెక్కింపు ఉంటుంది. ఈ లెక్కింపు కేంద్రాల వద్ద మొత్తం 400 మందితో బందోబస్తును ఏర్పాటు చేశాం. ఇందులో సివిల్ పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు. మొత్తం రెండు దశల్లో ఇక్కడ బందోబస్తును ఏర్పాటు చేశాం. ఈ రెండు కేంద్రాల్లోను 100 వరకు ఫేషియల్ రికగ్నైజ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. లెక్కింపు కేంద్రాల్లోకి వచ్చేవారి ముఖాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతాయి. లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశాం. జిల్లా కలెక్టర్ ఇచ్చిన పాసులు ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతిస్తాం. కేంద్రాల్లోకి వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తాం. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5వేలమందితో లెక్కింపునకు బందోబస్తు ఏర్పాటు చేశాం.

? అదనపు బలగాలు వచ్చే అవకాశం ఉందా..

లెక్కింపు సందర్భంగా నిర్వహించే బందోబస్తుకు అదనపు బలగాలను పంపించారు. రాష్ట్రానికి సంబంధించిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ వచ్చింది. ఇవి కాకుండా తొమ్మిది టియర్ గ్యాస్ టీంలు, రెండు టియర్ గ్యాస్ వాహనాలు రంగంలోకి దింపుతున్నాం. కౌంటింగ్ కేంద్రం వద్ద ఒక టియర్ గ్యాస్ ద్వారా గమనిస్తాం. ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూంలకు రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్ అమలు విధించాం. ఈ ప్రాంతంలో డ్రోన్లపై నిషేధం ఉంది.

? వివాదాస్పద ప్రదేశాలకు ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయా..

సాధారణ బందోబస్తుతోపాటు ఎక్కడైనా గొడవలు, వివాదాలు జరిగితే తక్షణమే స్పందించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశాం. మొత్తం 55 స్టాటిస్టికల్ సర్వెలెన్స్ ఫోర్స్‌లను నియమించాం. ఇవి కాకుండా అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా గొడవలు జరిగినట్టు సమాచారం అందిన వెంటనే ఐదు నిమిషాల్లో ఈ బలగాలు అక్కడికి చేరుకుంటాయి. జిల్లా వ్యాప్తంగా 144, 30 సెక్షన్లు అమలులో ఉన్నాయి. ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదు. ర్యాలీలు నిర్వహించినా, ఆందోళనలకు దిగినా చర్యలు కఠినంగా ఉంటాయి. అల్లర్లు సృష్టించినా, అందులో ఉన్నా రౌడీషీట్ తెరుస్తాం. జిల్లాలో లెక్కింపు సందర్భంగా మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని ఆదేశాలిచ్చాం. పెట్రోలు బంకుల్లో విడిగా విక్రయాలు చేయవద్దని నోటీసులు ఇచ్చాం.

? ఎంతమంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో 4400 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఇప్పటి వరకు 95 కేసులు నమోదు చేశాం. వాళ్లందరిని అరెస్టు చేశాం. జిల్లాలో లైసెన్స్ కలిగిన 445 తుపాకులను స్వాధీనం చేసుకున్నాం. లెక్కింపు సందర్భంగా అల్లర్లు చేసే అవకాశం ఉందని భావించిన మరో 100 మందిని తాజాగా బైండోవర్ చేశారు. కొంతమంది రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేశాం.

వాహనం ఉంటుంది. మరో వాహనం ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి వెళ్తుంది. దీనితోపాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఫాల్కన్ వాహనాన్ని లెక్కింపు కేంద్రం వద్ద ఉంచుతున్నాం. ఇందులో ఒక చిన్న సమావేశపు హాలు ఉంటుంది. దీనికి నాలుగు వైపులా సీసీ కెమెరాలు ఉంటాయి. అంతేగాకుండా రొటేటెడ్ సీసీ కెమెరా ఉంటుంది. దీన్ని 360 డిగ్రీల కోణంలో కెమెరాలను తిప్పుతూ ఆయా ప్రాంతాలను పరిశీలించవచ్చు.

? జిల్లాలో ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 180 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఈ ప్రాంతాలతోపాటు జిల్లా మొత్తంపై నిఘా పెట్టడానికి పోలీసు శాఖ తరపున 1500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇవి కాకుండా మరో 3వేల వరకు ప్రైవేటు వ్యక్తుల సీసీ కెమెరాలు ఉన్నాయి. మొత్తం 4500 సీసీ కెమెరాలతో జిల్లా మొత్తం మీద నిఘా పెట్టాం. ఈ కెమెరాలను విజయవాడలోని ఎంజీ రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశాం. ఇవికాకుండా ఇబ్రహీంపట్నంలోని లెక్కింపు కేంద్రాల చుట్టుపక్కల 150 సీసీ కెమెరాలను అమర్చాం. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరి కదలికలను ఈ కెమెరాల

4 గంటలకే.. ఫలితం

ఆరు గంటలకే డిక్లరేషన్

- ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన లెక్కింపు
- సమాంతరంగా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు
- రెండు రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- గరిష్ఠంగా 21 రౌండ్లలో ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు
- సీఆర్‌పీఎఫ్, స్టేట్, లోకల్ పోలీసు బందోబస్తుతో పటిష్ఠ భద్రత
- మీడియా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

లెక్కింపు రోజున సాయంత్రం నాలుగు గంటల కల్లా జిల్లా వ్యాప్తంగా విజయవాడ పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గ పూర్తి ఫలితాలు విడుదలౌతాయని, సాయంత్రం ఆరు గంటల కల్లా గెలుపొందిన అభ్యర్థులకు డిక్లరేషన్ ఇవ్వటం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌంటింగ్ లెక్కింపు చర్యలను దిల్లీరావు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు సమాంతరంగా చేపట్టడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 8 గంటలకు సమాంతర పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు జరుగుతుందని, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమౌతుందని, ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును వేగంగా చేపట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 17,596 పోస్టల్ బ్యాలెట్లు, 153 ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపును అత్యంత పకడ్బందీగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 14 టేబుల్స్, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 14 టేబుల్స్ చొప్పున మొత్తం 28 టేబుల్స్‌పై లెక్కింపు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తంగా 196 టేబుల్స్‌పై లెక్కింపు జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 98, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 98 టేబుల్స్‌పై లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు రెండు రౌండ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్కో రౌండ్ లెక్కింపునకు గరిష్ఠంగా 3గంటల సమయం పడుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. కంట్రోల్ యూనిట్ల లెక్కింపు కంటే ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వర్గంలో అత్యల్పంగా 1800 పోస్టల్ బ్యాలెట్లు, తూర్పు నియోజకవర్గంలో గరిష్ఠంగా 3100 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్లను వేగంగా లెక్కించేందుకు ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల మధ్యన కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్ సమన్వయంతో ర్యాండమైజేషన్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి 21 రౌండ్లలో నిర్వహించటం జరుగుతుందన్నారు. నందిగామ నియోజకవర్గంలో కనిష్ఠంగా 16 రౌండ్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి రౌండును గరిష్ఠంగా 25 నిమిషాలలో లెక్కించటం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కూడా సాయంత్రం 4 గంటల నాటికి లెక్కింపును పూర్తి చేయనున్నట్టు చెప్పారు. ఆ తర్వాత ఐదు వీవీప్యాట్ల మ్యాండేటరీ లెక్కింపు, ఇతర ప్రక్రియలు కూడా చేపట్టి ఫామ్-21సీ డిక్లరేషన్ పూర్తి చేసిన తర్వాత సాయంత్రం 6 గంటల కల్లా గెలుపొందిన అభ్యర్థులకు డిక్లరేషన్ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు.



కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా వలయం

కౌంటింగ్ కేంద్రాలకు 2200 మంది ప్రత్యేక బస్సుల్లో తరలింపు

నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలలో 2200 మంది విధులు నిర్వహిస్తున్నారని, సిబ్బంది ఉదయం ఆరు గంటల కల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ సిబ్బందిని తరలించటం కోసం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం (ఐజీఎంసీ) నుంచి 15 బస్సులు ప్రత్యేకంగా కౌంటింగ్ కేంద్రాలకు నడపనున్నట్టు తెలిపారు. ఈ బస్సులు ఉదయం 5 గంటలకే స్టేడియం నుంచి బయలు దేరతాయన్నారు. అలాగే మైలవరం, తిరువూరుల నుంచి వచ్చే వారి కోసం కొండపల్లిలో 5 బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జగ్గయ్యపేట, నందిగామల నుంచి వచ్చే వారి కోసం కేతనకొండ దగ్గర బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు ఇలా..

కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బంది, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజంట్లు, పోలీసులు, మీడియా ప్రతినిధులు తదితరులకు సంబంధించి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. నోవా, నిమ్రా కళాశాలలతో పాటు జాతీయ రహదారి వెంబడి పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. మీడియా ప్రతినిధుల వాహనాలను నేరుగా కౌంటింగ్ కేంద్రాల సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల వరకు అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు.

కౌంటింగ్ సిబ్బందికి విస్తృత శిక్షణ

కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు తదితరులకు ఇప్పటికే శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. రెండో రౌండ్ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది అనుసంధానానికి ర్యాండమైజేషన్ నిర్వహించటం జరిగిందన్నారు.

పటిష్ఠ భద్రత నడుమ లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి పటిష్ఠ భద్రతను కల్పించినట్టు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల గేటు దగ్గర సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉంటాయన్నారు. కౌంటింగ్ భవనాల ఆవరణలో స్టేట్ పోలీసులు, కేంద్రాల వెలుపల స్థానిక పోలీసులు ఉంటారని తెలిపారు. అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ ఏజంట్లకు సూచనలు

లెక్కింపు కేంద్రాలకు వచ్చే రాజకీయ పార్టీ ఏజంట్లు ఎన్నికల సంఘం ఇచ్చిన ఐడెంటిటీ కార్డులను ధరించి, కేవలం 17సీ పార్ట్ 1, కొన్ని వైట్ పేపర్లు వెంట తెచ్చుకుంటే సరిపోతుందన్నారు. పెన్ను, క్యాలిక్యులేటర్ వంటివి సమకూర్చుతామన్నారు. కౌంటింగ్ ఏజంట్లకు ఎట్టి పరిస్థితులలో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి అల్పాహారం, భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

వీరి ఫోన్లకు మాత్రమే అనుమతి..

కౌంటింగ్ కేంద్రాలలో కేవలం రిటర్నింగ్ అధికారులు, అబ్జర్వర్లకు మాత్రమే ఫోన్లకు అనుమతి ఉందన్నారు. అదే విధంగా ఈటీపీబీఎస్ ఓటీపీ వచ్చే ఫోన్లకు మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతి ఉందన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజంట్లు, మీడియా ప్రతినిధులకు కేవలం మీడియా సెంటర్ వరకు మాత్రమే మొబైల్స్ అనుమతి ఉందన్నారు. మొబైల్ ఫోన్లను భద్రపరిచేందుకు కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రౌండ్ల వారీ ఫలితాల ప్రకటన..

కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న మీడియా కేంద్రాల ద్వారా రౌండ్ల వారీ ఫలితాలను వేగంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రౌండ్ల వారీ ఫలితాలు ముగిసిన వెంటనే మీడియా సెంటర్‌లో ప్రకటించడం జరుగుతుందని చెప్పారు. ట్రెండ్స్ తెలుసుకునేందుకు వీలుగా మీడియా సెంటర్‌లో ఎఈడీ స్క్రీన్ల ద్వారా న్యూస్ ఛానల్స్ వీక్షించే ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.



'అవినీతి చక్రవర్తి నరేంద్రమోదీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, తదితరులు

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్

ధర్నాచౌక్, జూన్ 2 : ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓట్లు దొంగిలించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఓట్ల లెక్కింపులో పౌరసమాజం అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ తెలిపారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'అవినీతి చక్రవర్తి నరేంద్ర మోదీ' పుస్తకాన్ని ప్రభాకర్ ఆవిష్కరించారు. హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్‌తో సంబంధం లేకుండా ఎన్డీఏ ప్రభుత్వం చిత్తుగా ఓడిపోతుందన్నారు. గతంలో పనిచేసిన ఎన్నికల కమిషన్‌లకు ప్రస్తుత ఎన్నికల కమిషన్ పనితీరుకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శించారు. ఒక్కో ఎలక్టోరల్ బాండ్ కొనుగోలులో ఒక్కో కుంభకోణం ఉందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ మరలా నేనే ప్రధానిగా వస్తానని చెప్పడాన్ని తప్పుబట్టారు. ఎలక్టోరల్ బాండ్లలో జరిగిన అవినీతిని శోభనాద్రీశ్వరరావు సమగ్రంగా వివరించారన్నారు. లక్షలాది మంది ఈ పుస్తకాన్ని చదవాల్సిన అవశ్యకత ఉందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక పాలనపై శోభనాద్రీశ్వరరావు సాగిస్తున్న పోరాటం, పుస్తకాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్న విధానాన్ని కొనియాడారు. పుస్తక రచయిత వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, నరేంద్రమోదీ వంటి వ్యక్తి దేశానికి ప్రధాని కావడం దేశ ప్రజల దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిన మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీలు మద్దతు పలకడం సిగ్గు చేటన్నారు. సీనియర్ రైతు నాయకుడు కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విస్సా కిరణ్‌కుమార్, కేవీవీ ప్రసాద్, సింహాద్రి ఝాన్సీ, చుండూరి రంగారావు, డి.హరనాథ్, కొల్లా రాజామోహన్, సి.భాస్కరరావు, బండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నానిపై టీడీపీ నేతల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జూన్ 2 : ఓట్ల లెక్కింపు ముందు ఎమ్మెల్యే మాజీ మంత్రి పేర్ని నాని ప్రజలను రెచ్చకొట్టే విధంగా మాట్లాడారని తుళ్లూరు స్టేషనులో టీడీపీ నేతలు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, టీడీపీ, బీజేపీలకు అనుకూలంగా ఉత్తర్వులు ఇస్తోందని విమర్శించడం సబబు కాదని టీడీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్‌లు ఫిర్యాదు చేశారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం రసాభాస అవుతుందని మీడియా ముందు విద్వేషాలు రెచ్చకొట్టే విధంగా పేర్ని నాని మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యకర్తలను పరోక్షంగా రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. బెదిరింపు ధోరణిలో మాట్లాడి ఉద్యోగులను భయ భ్రాంతులను చేసారని ఆరోపించారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు భయపడి కొందరు రిటర్నింగ్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించలేమంటున్నారన్నారు. పేర్ని నానిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వారు తెలిపారు.



తుళ్లూరు స్టేషన్‌లో పేర్నినానిపై ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా ఆదివారం కలెక్టర్‌లు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ గీతాంజలి శర్మ, ఆర్వోలు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలోని పార్లమెంట్‌స్థానంతో పాటు ఏడు అసెంబ్లీనియోజకవర్గాలలో కౌంటింగ్ నిమిత్తం 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చామన్నారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్‌పై అవగాహన కల్పించామని తెలిపారు. కౌంటింగ్‌కేంద్రం కృష్ణాయూనివర్సిటీ వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ, జేసీ

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో అన్ని ఏర్పాట్లు : దిల్లీరావు

కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా కౌంటింగ్ ఏర్పాట్లపై ఆదివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. శాంతియుత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మార్గనిర్దేశనం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా కేంద్రం, గుర్తింపు కార్డులు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశం, నిష్క్రమణ ప్రణాళిక అమలు, సైన్‌బోర్డులు తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి నోవా, నిమ్రా కళాశాలల్లో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ డిల్లీరావు వివరించారు. మీడియా సెంటర్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, సీసీ టీవీలు, ఐటీ సిస్టమ్స్, భద్రత, ఈటీపీబీఎస్/పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, ఫలితాల వెల్లడికి చర్యలు, సమర్పించాల్సిన నివేదికలు, ఈవీఎంల సీలింగ్ తదితరాల అంశాలను వివరించారు.





అవనిగడ్డలో పర్యటించిన జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

అవనిగడ్డ, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని అద్నాన్ నయీమ్ అస్మి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం అవనిగడ్డలోని రాజీవ్ గాంధీ సెంటర్‌లో ఆయన ప్రజలతో మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశామని, కౌంటింగ్ అనంతరం బాణాసంచా కాల్చటం, ఊరేగింపులపై నిషేధం ఉందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నేర ప్రవృత్తి కలిగిన వారు, రౌడీషీటర్లతో ఎస్పీ మాట్లాడుతూ, కౌంటింగ్ అనంతరం మండలాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు మద్యం అమ్మకాలు నిషేధించామని, ఎవరైనా మద్యం సేవించి ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, సామాజిక మధ్యమాల్లో పోస్టింగులు పెట్టినా సహించబోమని తెలిపారు. అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, సీఐలు త్రినాథ్, నాగప్రసాద్, ఎస్ఐలు రమేష్, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, చిన్నబాబు, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

లెక్కింపు కేంద్రాల్లో అధికారుల పరిశీలన

వన్‌టౌన్, జూన్ 2 : కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు సర్వం సన్నద్ధం చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ దిల్లీరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం. జూపూడిలలోని నోవా, నిమ్రా కాలేజీలలో లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎటువంటి గందరగోళాలకు తావు లేదన్నారు. జేసీ పి.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, సమాచార శాఖ అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ బాపిరాజు రక్తదానం

మచిలీపట్నం టౌన్, జూన్ 2 : రోగికి అవసరమైన రక్తం కావాలని కోరగా వెంటనే మునిసిపల్ కమిషనర్ ఆదివారం రెడ్‌క్రాస్ సంస్థకు వచ్చి రక్తదానం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన బాపిరాజును వివిధ ప్రజాసంఘాల నాయకులు అభినందించారు. కమిషనర్ ఇప్పటికి దాదాపు 50 సార్లు రక్తదానం చేశారు. ఆయనతో పాటు భార్య పద్మావతి కూడా రక్తదానం చేశారు.



కృష్ణాజిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కృష్ణాజిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సన్నిధి నాగ సాయి శ్రీనివాస్

మచిలీపట్నం టౌన్, జూన్ 2 : కృష్ణాజిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సన్నిధి నాగసాయి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మచిలీపట్నంలోని ఒక ఫంక్షన్ హాలులో జరిగిన ఎన్నికలలో జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రవణం రామకృష్ణ, టి.శాంతాదేవి, బి.మల్లికార్జున గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.హరికృష్ణ,కోశాధికారిగా పి సత్యనారాయణ విఠల్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్ యోగానందరావు, వి.కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, ఆర్.కిషోర్‌బాబులు ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసరుగా న్యాయవాది ఆకునూరి నాగేంద్రం వ్యవహరించారు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, తాడేపల్లి మెహర్‌బాబా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జయకేతనం

విజయవాడస్పోర్ట్సు, జూన్ 2 : మూలపాడు స్టేడియం వేదికగా జరుగుతున్న ఏసీఏ పురుషుల సీనియర్ సెంట్రల్ జోన్ వన్డే క్రికెట్ టోర్నీలో పశ్చిమగోదావరి జట్టుపై ప్రకాశం జట్టు 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇరుజట్ల మధ్య ఆదివారం మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశంజిల్లా జట్టు నిర్ణీత 43 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 314 పరుగులను చేసింది. సీహెచ్ క్రాంతికుమార్ 106,(69 బంతుల్లో 17 ఫోర్లు, రెండు సిక్స్), కె.క్రాంతికిరణ్ 102(124 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్) సెంచరీలతో కదంతొక్కగా, ఎం. లేఖజ్ రెడ్డి 64 పరుగులు చేశాడు. అనంతరం 315 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన పశ్చిమ గోదావరి జట్టు 43 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసి పరాజయం పాలైంది.



క్రాంతికుమార్ (106)



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు

పాలిసెట్ కౌన్సెలింగ్ వాయిదా

భారతీనగర్, జూన్ 2 : ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆదివారం స్పోర్ట్స్ కేటగిరిలో 103మంది హాజరైనట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. జనరల్ కేటగిరీలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆంధ్రాలయోలా కళాశాలలో 170మంది, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో 198మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. అదే విధంగా నేడు జరగాల్సిన కౌన్సెలింగ్ గురువారం నిర్వహించబడుతుందన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి గ్రామోత్సవం

భవానీపురం: విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని సువర్చలా సహిత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంతో హనుమంతుడికి ఆదివారం రాత్రి కన్నులపండుగగా గ్రామోత్సవం నిర్వహించారు. హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అర్చకులు ప్రత్యేకంగా శాంతి హోమాలు, పూర్ణాహుతిని నిర్వహించారు. రాత్రి 8గంటలకు విద్యుత్ అలంకరణల నడుమ స్వామికి గ్రామోత్సవం జరిపారు. కమిటీ సభ్యులు డాక్టర్ రమణరాజు, నరసరాజు, నారిండి కిషోర్, కామయ్య శాస్త్రి, అర్చకులు పాల్గొన్నారు.



విద్యాధరపురం గ్రామోత్సవంలో ప్రసన్నాంజనేయస్వామి

డ్రైనేజీ నీళ్లలో మంచినీటి వాల్వ్

● బొండా ఉమా పర్యటనలో వెలుగులోకి వచ్చిన వైనం ● మంచినీటి విభాగం ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పాయకాపురం, జూన్ 2: నగర శివార్లలోని ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో 15 రోజులుగా మంచినీరు కలుషితమవుతోందని ప్రజలు గగ్గోలు పెట్టినా మంచినీటి విభాగం అధికారులు పెడచెవిన పెట్టారు. తాగునీరు కలుషితం కావడంతో డయేరియా లక్షణాలతో అనేక మంది ఆసుపత్రులుపాలైనా సంబంధిత శాఖ నివారణచర్యలు తూతూమంత్రంగానే చేపట్టాయి. 2 వారాల్లో వాంతులు, విరోచనాలు వంటి డయేరియా లక్షణాలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా ఖాతరు చేయలేదు. కేవలం మంచినీటి శాంపిళ్లు తీసి అంతా బాగానే ఉందంటూ చేతులు దులిపేసుకున్నారు. అయితే స్థానికంగా మంచినీరు కలుషితమవుతోందని ఆదివారం టీడీపీ నేత బొండా ఉమా పర్యటనలో తేటతెల్లమైంది. స్థానిక ప్రజాశక్తినగర్ శివాలయం ప్రాంతంలో ఓ మంచినీటి పైపులైన్ వాల్వ్ పూర్తిగా డ్రైనేజీ నీటితో నిండిపోయి నీరు కలుషితం అవ్వడాన్ని స్థానికులు బొండా ఉమా దృష్టికి తీసుకువచ్చారు. వాల్వ్‌ను పరిశీలించిన బొండా ఉమా మంచినీటి విభాగం అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

ఏఈని సస్పెండ్ చేయాలి: బొండా ఉమా

ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో ఆదివారం పర్యటించిన బొండా ఉమా డయేరియా బారినపడి కోలుకుంటున్న పలువురిని పరామర్శించారు. ఈ సందర్భంగా 15, 20 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమగోడు పట్టించుకోలేదని ఉమాకు చెప్పారు. అలాగే స్థానికంగా సరఫరా అవుతున్న మురుగునీటిని బాటిళ్లలో పట్టి చూపించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ మంచినీటి విభాగం, ప్రజారోగ్య శాఖల నిర్లక్ష్యంతో స్థానికంగా అనేకమంది డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ముగ్గురు మృతి చెందారని విమర్శించారు. ప్రజాశక్తినగర్ ప్రాంతంలో మంచినీటి వాల్వ్‌లో పక్కనే ఉన్న మురుగునీరు చేరి అధ్వానంగా ఉందని దీనికి బాధ్యుడైన మంచినీటి విభాగం ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి పరిస్థితిని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు బొండా ఉమా ఫోన్‌లో వివరించారు.





కలుషిత నీటిని బొండా ఉమాకు చూపిస్తున్న స్థానిక మహిళలు, మురుగునీటితో నిండిన మంచినీటి వాల్వ్

సురక్షిత మంచినీరు సరఫరా చేయాలి

మొగల్రాజపురం: స్థానికంగా కార్పొరేషన్ పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని తాగాలంటే జనం భయపడుతున్నారు. వారం రోజులుగా ఈ ప్రాంతంలో వాంతులు విరేచనాలతో బాధపడుతూ ఏడుగురు మరణించిన ఘటన జనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇప్పటికే వీఎంసీ అధికారులు బాలభాస్కరనగర్, పటమట వారి వీధిలో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించడం, బోరు వాటర్‌కు బదులుగా కృష్ణానీటిని సరఫరా చేశామని ప్రచారం చేశారు. అయినా జనంలో భయం పోవడం లేదు. సున్నబట్టీల సెంటర్, దాసరి రమణ నగర్, ఇందిరానగర్, పటమట వారి వీధి, అల్లూరి పరమాత్మ వీధి, బందిల దొడ్డి ప్రాంతాల్లో మంచినీరు తాగాలంటే సంకోచించాల్సిన పరిస్థితి. దీనిపై డీఎంహెచ్‌వో సుహాసిని స్పందిస్తూ ప్రస్తుతానికి పరిస్థితి నిలకడగా ఉందని, ఆదివారం ఇద్దరు నీరసం, కడుపునొప్పితో వచ్చారన్నారు వారితో మాట్లాడితే బయట ఫుడ్ తిన్నామని చెప్పారన్నారు. వారికి చికిత్స చేసి మందులిచ్చామన్నారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు. శిబిరం కొనసాగుతుందన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

● ఏపీ కౌలు రైతుల సంఘం

గవర్నర్‌పేట: వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతోందని, రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడారు. వరి విత్తనాలు ఓపెన్ మార్కెట్‌లో రూ. 1200 ఉంటే, ఆర్‌బీకేల్లో రూ.1100 అమ్ముతున్నారని, ఈ సబ్సిడీ రైతులకు సరిపోదన్నారు. వేరుశనగ లాంటి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 32లక్షల మంది కౌలు రైతులుంటే వ్యవసాయ శాఖ 10 లక్షల మందికే కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం అన్యాయమన్నారు. సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి వంచికర్ల రంగారావు పాల్గొన్నారు.

సీఆర్‌డీపీ మాజీ డైరెక్టర్ రాముడుకు ఘన సత్కారం

చిట్టినగర్, జూన్ 2: ఏపీజే అబుదల్ కలాం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆంజనేయవాగు సెంటర్‌లో విఘ్నేష్ స్టూడియోలో ఏపీ సీఆర్‌డీపీ మాజీ డైరెక్టర్ రాముడు దంపతులను ఘనంగా సత్కరించారు. ఏపీసీఆర్‌డీపీ డైరెక్టర్‌గా రాముడు చేసిన సేవలను సేవాసమితి సభ్యులు కొనియాడారు. ప్రముఖ విద్యావేత్త ఎన్వీరావు, రాజగిరి సోమేశ్వరరావు, నమ్మి అప్పారావు, పేరం కోటిరెడ్డి, కిలారు జగదీష్, దేవర వెంకట్రావ్, పీ.పరమేశ్వరరావు, ఎల్.శ్యాంకుమార్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకుండా చర్యలు

● సౌత్ ఏసీపీ రత్నరాజు

వన్‌టౌన్, జూన్ 2: నగర పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు తరువాత ఎవరూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సౌత్ ఏసీపీ జి.రత్నరాజు గవర్నర్‌పేట పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన ఓల్డ్ కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గవర్నరుపేట సీఐ జీ.వీ రమణ, ఎస్ఐలు కృష్ణబాబు, నారాయణమ్మ, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వివాదాల్లో పాల్గొంటే నగర బహిష్కరణ: సీఐ

వివాదాల్లో పాల్గొంటే నగర బహిష్కరణ తప్పదని కృష్ణలంక సీఐ ఏ.మురళీకృష్ణ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ ప్రాంగణంలో ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా నిత్యం ఉంటుందని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.



పోలీస్ కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న సౌత్ ఏసీపీ రత్నరాజు



పెజ్జోనిపేట, మీసాల రాజారావు వంతెన వద్ద ఏర్పాటు చేసిన పోలీసు పికెటింగ్ శిబిరం

పశ్చిమలో పోలీసు పికెటింగ్ శిబిరాలు

పాతరాజరాజేశ్వరి పేట: ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా డివిజన్లలో పోలీసులు పలుచోట్ల పోలీసు పికెటింగ్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పెజ్జోనిపేట, మీసాల రాజారావు వంతెన సమీపం, కేదారేశ్వరపేట మసీదు సెంటర్‌లో పోలీసు పికెటింగ్ శిబిరాలను ఏర్పాటు చేశారు. గొడవలు జరగొచ్చనే ముందస్తు సమాచారం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కౌంటింగ్ కారణంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో నలుగురు మించి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో నగరంలో ఎన్నికల కౌంటింగ్ వేళ ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గగుడిలో అరుణపారాయణం

వన్‌టౌన్, జూన్ 2: లోకక్షేమం కోరుతూ ఆదివారం దుర్గగుడిలో వేదపండితులు, అర్చకులు అరుణ పారాయణ నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి చిత్రపటానికి ప్రత్యేకంగా అర్చనలు నిర్వహించారు. అరుణ పారాయణ, ఆదిత్య హృదయం పారాయణను చేశారు. సూర్యనారాయణ స్వామికి ప్రత్యేకంగా తర్పణలు నిర్వహించి ఆశీస్సులు కోరారు.

భక్తుల నియంత్రణకు ఈవో చర్యలు

దుర్గగుడిలో భక్తుల రద్దీ దృష్ట్యా ఈవో రామారావు తగిన చర్యలు తీసుకోవడంతో ఒత్తిడి లేకుండా భక్తులు క్రమవిధానంలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తుల కదలికలను పరిశీలిస్తూ సిబ్బందికి, అధికారులకు ఈవో తగు ఆదేశాలిచ్చారు. పొంగళ్ల షెడ్డును సందర్శించిన ఈవో భక్తులను సౌకర్యాలను గురించి ఆరా తీశారు. ఆదివారం ఏకాదశి తిథి రావడంతో భక్తులు ఆలయంలో విశేషంగా వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమానుగతంగా జరుగుతున్న ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, నవావరణార్చన, చండీహోమం, లక్షకుంకుమార్చన, శాంతి కల్యాణంలో భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థించారు.



అరుణపారాయణ చేస్తున్న అర్చకులు



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

దుర్గమ్మ సన్నిధిలో సీఎస్ జవహర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఘనంగా సుజనా జన్మదిన వేడుకలు

విద్యాధరపురం, జూన్ 2: కూటమి బలపరచిన పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి జన్మదిన వేడుకలు ఆదివారం భవానీపురంలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మసాని సుబ్బారావు, పైలా సోమినాయుడు, అమ్మిశెట్టి వాసు, గన్నె వెంకట ప్రసాద్ (అన్న), ఎంఎస్ బేగ్, బాడితశంకర్, కోలపల్లి గణేష్, భోగవల్లి శ్రీధర్, బొద్దు నాగలక్ష్మి, శివకుమార్ పట్నాయక్, పసుపులేటి రఘురామ్‌తో పాటు బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేయిస్తున్న చినసుబ్బయ్య తదితరులు

బుద్దా దివాకర్ కార్యాలయంలో...

భవానీపురం పాత పోలీస్‌స్టేషన్ వద్ద బుద్దా దివాకర్ కార్యాలయంలో సుజనా చౌదరి న్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. అలాగే 40వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి చినసుబ్బయ్య ఆధ్వర్యంలో సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా భారీ కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. గాడు గణేష్, గుడూరు కొండయ్య, రామానాయుడు, సురేష్ పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో..

చిట్టినగర్: 48వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్‌లో సుజనా చౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ, బీజేపీ జనసేన నేతలు కేక్‌కట్ చేసి ప్రజలకు స్వీట్లు, మజ్జిగప్యాకెట్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు మద్దినేని చెంచయ్య, బోయళ్ల కృష్ణ, చొక్కర అప్పారావు, నెర్రీ రామారావు, ఉప్పాడి రాము, పొన్నాడ రాము, ఎస్కే నాగూర్, ఎస్.కె.కాజా, అడ్డూరి శంకర్, తుపాకుల రామకృష్ణ, ఈఇ పార్వతి పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో..

భవానీపురం: స్థానిక టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య ఆధ్వర్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి జన్మదిన వేడుకలను ఊర్మిళానగర్‌లో ఆదివారం డివిజన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ పశ్చిమ అధికార ప్రతినిధి పూజల శ్రీనివాస్ జన్మదినం కూడా ఉండటంతో మరో కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. మల్లెబోయిన కొండ, నమ్మి భాను ప్రకాష్, వెంకటేశ్వర్లు, వెంకట్ యాదవ్, యువరాజు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు. సితార సెంటర్‌లో టీడీపీ సీనియర్ నేత గంగవరపు మురళీ ఆధ్వర్యంలో సుజనా జన్మదిన వేడుకలు నిర్వహించారు. పశ్చిమ సమన్వయ కర్త సారేపల్లి రాధాకృష్ణ, పరిమి మల్లేశ్వరరావు, కిరణ్, సత్యనరాఆయణ, చక్రవర్తి, నాగుల్‌మీరా, గాలీషా, సాయి సుధాకర్, ఆత్మారామ్ పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కార్యాలయంలో...

విద్యాధరపురం: భవానీపురం ఎన్‌డీఏ కార్యాలయంలో సుజనా చౌదరి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్, కార్పొరేటర్లు ఉమ్మడి చంటి, జాస్తి సాంబశివరావు, నేతలు సుఖాసి సరిత, బొర్రా భాను శ్రీరామ్, చరణ్, అఖిల్, సురేష్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వంలో 4వ తరగతి ఉద్యోగుల పాత్ర కీలకం

వన్‌టౌన్, జూన్ 2: ప్రభుత్వ పాలనలో 4వ తరగతి ఉద్యోగులదే కీలకపాత్రని ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్‌జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన 4వ తరగతి ఉద్యోగుల రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రమణారెడ్డి, కోశాధికారి ఎస్.కాశయ్య పదవీవిరమణ చేయగా వీరిస్థానంలో ప్రధాన కార్యదర్శిగా రామానారాయణ, కోశాధికారిగా మాణిక్యాలరావును నియమించారు. కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు కొనసాగనున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి వీఎస్ సాయిరాం, ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలు

గవర్నర్‌పేట, జూన్ 2: ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని సిద్ధార్థ మహిళా కళాశాల అధ్యాపకురాలు సుశీల అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, వన్ ఎర్త్ వన్ లైఫ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంబీవీకే బాధ్యుడు టి.క్రాంతి కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 29 మంది విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఏ శేఖర్, వినయ్, శివ శత్విక్, జూనియర్స్ విభాగంలో కె.సహస్ర, కృష్ణ వర్ధన్, కె. జాహ్నవి, సీనియర్స్ విభాగంలో పి.శ్రీవల్లి, కె.జాహ్నవి, సాహితి ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

వన్‌టౌన్, జూన్ 2: కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతమ్మవారి పాదాల వద్ద కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. లాండ్రీ పనిచేస్తున్న చిటికెల వీరబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి సుమారు 30ఏళ్లున్న పురుషుడి మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. అలాగే భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పిండాలఘాట్ మెట్ల పక్కన కృష్ణానదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్టు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లేనందున ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి సుమారు 50ఏళ్లలోపు వయసు ఉంటుందని, ఒంటిపై ఎరుపు, పసుపు రంగులతో కూడిన జాకెట్టు, లేత ఆకుపచ్చ రంగు చీర ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా చిన్నారి మృతి

తల్లితో పాటు ఉంటున్న చిన్నారి అనుమానస్పదంగా మృతి చెందినట్టు ఆదివారం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన యల్లాప్రగడ సురేష్ ఐదేళ్ల క్రితం సీతారామపురంలోని నాగశ్రీలతతో వివాహమైంది. రెండేళ్ల కుమార్తె శ్రీసిరి ఝాన్సీ ఉంది. భార్యభర్తల మనస్పర్థలతో నాగశ్రీలత కుమార్తె సహా తల్లితండ్రులతో ఉంటోంది. శనివారం సాయంత్రం నాగశ్రీలత సోదరుడి భార్య పావని సురేష్‌కు ఫోన్ చేసి ఝాన్సీ చనిపోయినట్టు చెప్పింది. దీంతో సురేష్ హైదరాబాద్ నుంచి వచ్చి తన పాప మరణానికి కారణం భార్య నాగశ్రీలత, ఆమె కుటుంబసభ్యులపై అనుమానం ఉందని ఫిర్యాదులో చేశాడు.



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

● తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూన్ 2: ఎన్నికల ప్రక్రియ చివరి అంకంలోకి వచ్చామని, ఈ అంకంలో కౌంటింగ్ ఏజెంట్లు ఎంతో కీలకం కానున్నారని వారంతా కౌంటింగ్ కేంద్రంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం గురునానక్ రోడ్డులోని హోటల్ ఫ్రైడ్‌మాధవలో నియోజకవర్గ టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, సబ్బినేని కృష్ణారావు, సిద్దెం నాగేంద్రరెడ్డి పాల్గొని ఏజెంట్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని సర్వేలన్నీ ఘంటాపథంగా చెబుతున్నాయని, బీజేపీ మద్దతుతో, పవన్ సహకారంతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో లాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. ఏజెంట్లంతా ఈవీఎం సీళ్ల నుంచి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు నమోదు కాబడ్డాయో క్షుణ్ణంగా పరిశీలించుకుని నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టినా ఆవేశానికి లోనుకావొద్దన్నారు. కౌంటింగ్ పూర్తయి ఫలితం తేలేవరకు ఎవరూ బయటకు రాకూడదన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ ఏజెంట్లు ఆఖరి అంకంలో ప్రధాన భూమిక పోషించనున్నారన్నారు. ఐదేళ్ల కష్టానికి రెండ్రోజుల్లో ఫలితం రాబోతుందన్నారు.

కామేశ్వరరావుకు ఫార్మశీలో డాక్టరేట్

విజయవాడ: నగర శివారులోని నున్న గ్రామానికి చెందిన శంఖుల కామేశ్వరరావు ఫార్మశీలో డాక్టరేట్ అందుకున్నారు. హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మశీ ప్రొఫెసర్ డాక్టర్ ఏ సీతాదేవి పర్యవేక్షణలో ఆయన పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈయన పరిశోధనలకు గాను నాగార్జున యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆయన మంగళగిరిలోని నిర్మల ఫార్మశీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



దిక్సూచి DIKSUCHI

బిమ్స్‌టెక్



దేశాలు పరస్పరం సహకరించుకుంటూ, ఉమ్మడిగా అభివృద్ధి చెందే లక్ష్యంతో కూటమిగా జతకడుతుంటాయి. అదే అవి ఒక ప్రాంతానికి చెందిన దేశాలైతే భౌగోళిక, సాంస్కృతిక, సముద్రతీర అనుకూలతల వల్ల మరింత పటిష్టంగా ఆ కూటమి వర్ధిల్లే అవకాశం ఉంటుంది. ఇటువంటి అనుకూలతలు గల ఒకానొక కూటమే బిమ్స్‌టెక్.

బలహీనపడిన సార్క్‌కు ప్రత్యామ్నాయంగా బిమ్స్‌టెక్‌ను ముందుకు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాల దృష్ట్యా ఈ కూటమి ఇటీవలికాలంలో మరింత ప్రాధాన్యం పొందుతోంది. అంతేకాక ఇటీవల(2024 మే 20) బిమ్స్‌టెక్ తొలి చార్టర్ అమలులోకి రావడంతో ఈ కూటమికి లీగల్ పర్సనాలిటీ సౌలభ్యమూ దక్కింది. దీనితో ఇకపై కొత్త దేశాలను కూటమిలోకి సులువుగా చేర్చుకోవడానికి, ఇతర కూటముల్లో, దేశాలతో ఈ కూటమి దౌత్యపరమైన చర్చలు జరపడానికి, కూటమి నిర్ణయాలు-తీర్మానాల పాటింపు ఇకపై చట్టబద్ధమై ఉండటానికి మార్గం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వార్తల్లో ఉన్న బిమ్స్‌టెక్ పూర్వపరాలు, ఆవశ్యకత, ఎదుర్కొంటున్న సవాళ్లు, పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల కోణంలో పరిశీలించడం ముదావహం.

చారిత్రక నేపథ్యం

1997లో బ్యాంకాక్ డిక్లరేషన్ ద్వారా బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, థాయ్‌లాండ్ సభ్యులుగా 'బీఐఎస్‌టీ-ఈసీ' ఏర్పడింది. బీఐఎస్‌టీ-ఈసీ అంటే 'బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, థాయ్‌లాండ్ ఎకనమిక్ కోఆపరేషన్' అని అర్థం. అయితే ఇదే సంవత్సరం ఈ కూటమిలో మయన్మార్ కూడా చేరడంతో 'బీఐఎంఎస్‌టీ-ఈసీ' పేరు మారింది. అదేవిధంగా 2004లో నేపాల్, భూటాన్ కూడా ఈ కూటమిలో సభ్యులవడంతో దీని పేరును 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్, టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్(బీఐఎంఎస్‌టీఈసీ)'గా మార్చారు. ఈ కూటమి ప్రధాన కార్యాలయం బంగ్లాదేశ్‌లోని 'ఢాకా'లో ఉంది.

ప్రధాన ఉద్దేశం

బంగాళాఖాతం తీరం వెంబడి, సమీపంలో ఉన్న దక్షిణాసియా, ఆగ్నేయాసియాకు చెందిన కొన్ని దేశాలు తమ భౌగోళిక సామీప్యతను, స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా ప్రపంచీకరణ దుష్ప్రభావాలను ఉమ్మడిగా జయించే ప్రధానోద్దేశంతో బిమ్స్‌టెక్ కూటమిని ఏర్పాటుచేశాయి.

ప్రాథమిక సూత్రాలు

1. దేశాల సార్వభౌమత్వాన్ని ధృవీకరించడం.
2. ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడం.
3. దేశాల రాజకీయపరమైన స్వాతంత్ర్యాన్ని గౌరవించడం.
4. దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం లేకుండా ఉండటం. 5. శాంతియుత పరస్పర సహజీవనం
6. ఉమ్మడి లబ్ధికి పాటుపడటం.
7. సభ్యదేశాల మధ్య ద్వైపాక్షిక, ప్రాంతీయ, బహుపాక్షిక సంబంధాలను, సహకారాన్ని పరిరక్షించడం, పెంపొందించడం.

ప్రధాన సహకార అంశాలు

బిమ్స్‌టెక్‌లో ప్రధాన 14 అంశాలపరంగా పరస్పరం సహకరించుకోవడం జరుగుతుంది. అవి-

1. వాణిజ్యం, పెట్టుబడులు 2. వాణిజ్యం, సమాచార ప్రసారం 3. శక్తిరంగం 4. పర్యాటకరంగం 5. సాంకేతికరంగం 6. మత్స్యరంగం 7. వ్యవసాయరంగం 8. ప్రజారోగ్యం 9. పేదరిక నిర్మూలన 10. ఉగ్రవాద నిరోధం, అంతర్జాతీయ నేరాలు 11. పర్యావరణం, విపత్తు నిర్వహణ 12. సభ్యదేశాలకు చెందిన ప్రజల మధ్య పరస్పర అవగాహన 13. సాంస్కృతిక సహకారం 14. వాతావరణ మార్పులు

ఈ 14 పరస్పర సహకార అంశాలకు సంబంధించి ప్రతి దేశం కనీసం ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ రంగాలకు మార్గదర్శక దేశంగా బాధ్యతలు తీసుకుంటుంది. భారతదేశం రవాణా, టూరిజం, పర్యావరణ, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్లు, అంతర్జాతీయ నేరాలు, ఉగ్రవాద నిరోధం అంశాలకు సంబంధించి బాధ్యతలు వహిస్తోంది.

బిమ్స్‌టెక్ వ్యవస్థాగత నిర్మాణం

- **చైర్మన్‌షిప్:** ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో సభ్యదేశాలకు దక్కుతుంది.
- **సమ్మిట్(సమావేశం):** సభ్యదేశాధినేతలు హాజరయ్యే ఈ సమావేశాల్లో విధానపర నిర్ణయాలు తీసుకుంటారు. అందుకే ఇది అత్యున్నత అంగముగా గుర్తింపు పొందింది.

ఎదురవుతున్న సవాళ్లు

- ఈ కూటమి ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ప్రజారోగ్యం, అనుసంధానం వంటివి చాలా విస్తారమైన అంశాలు. పైగా 14 ప్రాధాన్యతా రంగాలు ఉండటం వల్ల కూటమి లక్ష్యాలు విస్తారమై ఏ అంశం పరంగానూ ప్రత్యేక దృష్టి సారించలేకపోవడం.
- కూటమి ఆర్థికంగా పురోగమించాలంటే ఏర్పడాల్సిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇంకా పట్టాలెక్కకపోవడం ఈ కూటమి లక్ష్యాలకు ప్రధాన ఆటంకంగా ఉంది.
- సభ్యదేశాల మధ్య అంతర్గతంగా ఉన్న సమస్యలు, సరిహద్దు వివాదాలు వంటివి (ఉదాహరణకు ఇండియా-నేపాల్ సరిహద్దు సమస్య, ఇండియా-బంగ్లాదేశ్ అక్రమ వలసల సమస్య, ఇండియా-శ్రీలంక కచ్చదీవు వివాదం మొదలైనవి) కూటమి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.
- థాయ్‌లాండ్, మయన్మార్ వంటి దేశాలు బిమ్స్‌టెక్ కంటే ఏసియన్ కూటమి వైపు ఎక్కువ మొగ్గు చూపుతూ బిమ్స్‌టెక్‌పై తక్కువ ఆసక్తిని ప్రదర్శిస్తుండటం, అదేవిధంగా ఇతర సభ్యదేశాలు కూడా ఇతరత్రా ప్రాంతీయ కూటముల వైపు మొగ్గు కలిగి ఉండటం.
- ఇంతవరకూ బిమ్స్‌టెక్ బ్యాంక్ ఏర్పడకపోవడం, నిధుల వితరణ, సమకూర్పు వంటి ఒక కూటమి మనుగడకు కావల్సిన ఆర్థిక యాజమాన్యం బలహీనంగా ఉండటం.
- ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాల్సిన బిమ్స్‌టెక్ సమ్మిట్ నిర్వహణలో నిర్లక్ష్యం. ఇప్పటివరకూ కేవలం అయిదు సమ్మిట్‌లే జరగడం. తద్వారా ఆర్థిక, సాంస్కృతిక, మౌలికరంగపరమైన సంస్థల మధ్య సరైన అనుసంధానత అంటూ ఇంకా ఏర్పడకపోవడం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

- **మంత్రిత్వ స్థాయి సమావేశం:** ఇది విధాన నిర్ణయపరంగా రెండో అత్యున్నతస్థాయి అంగము. సభ్యదేశాల విదేశీ వ్యవహారాలశాఖ మంత్రులు హాజరవుతారు.
- **సీనియర్ అధికారుల సమావేశం:** దీనికి సభ్యదేశాల విదేశీ వ్యవహారాలశాఖకు చెందిన అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు హాజరై చర్చిస్తారు.
- **వర్కింగ్ గ్రూప్ మీటింగ్:** బిమ్స్‌టెక్ సభ్యదేశాలకు చెందిన బంగ్లాదేశ్‌లోని రాయబారులు/ దౌత్యవేత్తలు ఢాకాలోని బిమ్స్‌టెక్ సెక్రటేరియట్‌లో ప్రతి నెలా సమావేశమవుతారు.
- **బిజినెస్ ఫోరం, ఎకనామిక్ ఫోరం:** బిమ్స్‌టెక్ ప్రాధాన్యతా రంగాల్లో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే నిమిత్తం ఈ రెండు ఫోరమ్‌లు కీలకంగా వ్యవహరిస్తాయి.

ప్రాముఖ్యం

- బిమ్స్‌టెక్ రీజన్‌లో దాదాపు 1.5 బిలియన్ జనాభా అనగా ప్రపంచ జనాభాలో 22% ఉండటం వల్ల సభ్యదేశాలకు అతిపెద్ద మార్కెట్ అవకాశాలను అందిస్తోంది.
- బిమ్స్‌టెక్ దేశాల ఉమ్మడి జీడీపీ 3.6 ట్రిలియన్ డాలర్లు. ఇటీవలి కాలంలో 6.5% వరకూ సగటు వృద్ధిరేటు అంచనాలను ఇవి కలిగి ఉంటున్నాయి. ఇది ఈ ఆర్థికవ్యవస్థల పటిష్ట వృద్ధికి అనుకూల సంకేతాలనిస్తోంది.
- అదేవిధంగా ఈ కూటమి భౌగోళికత అయిన బంగాళాఖాత ప్రాంతంలో 15,792 చదరపు కిలోమీటర్ల మడ అడవులు, 8,471 చదరపు కిలోమీటర్లు పగడపు దీవులు, ఈస్టరీలు, సముద్రపు తాబేళ్ల పునరుత్పత్తి స్థావరాలు, సముద్ర కలుపు మొక్కలు వంటి విస్తార సముద్ర ఉత్పత్తులకు నిలయంగా ఉన్న పర్యావరణ సునిశిత ప్రాంతాలు ఉన్నాయి.
- బంగాళాఖాత సముద్ర మార్గం ద్వారా ఏటా ప్రపంచ వాణిజ్యంలో 25% జరుగుతుంది. అంతేకాక బంగాళాఖాత పరిసరాల్లో గల అపార ఖనిజ, సహజవాయు నిక్షేపాలు, మత్స్యసంపద వంటివి ఈ కూటమి దేశాలకు బ్లూ ఎకానమీ పరమైన అవకాశాలను అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రపంచంలోని చేపలవేటలో 7% అంటే ఆరు మిలియన్ టన్నులు(నాలుగు వందల కోట్ల డాలర్ల) చేపలవేట సాలీనా జరుగుతుంది.
- భూ పరివేష్టిత దేశాలైన నేపాల్, భూటాన్‌లకు సముద్ర అందుబాటు సౌలభ్యం కలుగుతుంది.
- పాకిస్థాన్ నిరంతరం భారత్ చర్యలకు అడ్డుపడుతూ సార్క్ కూటమిని బలహీనపరుస్తున్న కారణంగా, మరో ప్రత్యామ్నాయ కూటమి అవసరం ఈ భౌగోళిక ప్రాంతంలో ఏర్పడిన దృష్ట్యా, పాకిస్థాన్ రహితంగా ఉన్న బిమ్స్‌టెక్ ఆ స్థానాన్ని భర్తీ చేయగలదన్న ఆశాభావం సభ్యదేశాల్లో ఉంది.
- బిమ్స్‌టెక్ భౌగోళిక ప్రాంతంలో అనేక ప్రాంతీయ అభివృద్ధి ప్రాజెక్టులు ఉండటం వల్ల ఈ కూటమి అవసరాన్ని మరింత పెంచుతోంది. ఆ ప్రాజెక్టుల్లో భారత్-మయన్మార్‌లకు చెందిన కళాదన్ ప్రాజెక్టు, భారత్ - మయన్మార్ - థాయ్‌లాండ్‌లను అనుసంధానించే ఏషియన్ ట్రై లేటరల్ హైవే ప్రాజెక్టు, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ మోటార్ వెహికల్ అగ్రిమెంట్ వంటివి ఉన్నాయి.

భారత్‌కు బిమ్స్‌టెక్ అవసరం

- సార్క్ క్రియాహీనమవుతోన్న నేపథ్యంలో భారతదేశం తన విదేశీ దౌత్య వ్యూహాలైన యాక్ట్ ఈస్ట్ పాలసీ, నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీల అమలుకు తోడ్పడుతుంది.
- బంగాళాఖాత ప్రాంతంలో, హిందూ మహాసముద్ర ప్రాంతంలో పట్టుసాధించడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలను భారత్ ఈ కూటమి ద్వారా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. చైనా స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ద్వారా భారత్ చుట్టూ వల వేయడానికి వినియోగించుకుంటున్న నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, భూటాన్ వంటి దేశాలను బిమ్స్‌టెక్ కూటమి ద్వారా భారత్ చేరువ చేసుకోగలదు. అదేవిధంగా భారతదేశ 'సాగరమాల' పథకానికి కూడా ఈ కూటమి ఉపయుక్తం.
- ఈశాన్య రాష్ట్రాలకు సరిహద్దున గల మయన్మార్, బంగ్లాదేశ్‌లతో వాణిజ్యం, రాకపోకల పరమైన అనుకూలతలు సాధించడం ద్వారా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.
- ఈ కూటమి ఆగ్నేయాసియా, దక్షిణాసియా ప్రాంత దేశాలనే కాక హిమాలయ దేశాలు, బంగాళాఖాత తీర దేశాలను అందుబాటులోకి తెచ్చి సభ్య దేశాలతోపాటు భారత్‌కు కూడా బహుముఖ ఆర్థికలబ్ధిని చేకూర్చడంతోపాటు ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలను దేశంలోకి చొరబడకుండా అడ్డుకోవడానికి సహకరిస్తుంది.
- ఈశాన్య భారత్‌కు అక్రమ వలసదారులను అడ్డుకోవడంలో బిమ్స్‌టెక్ కూటమి సభ్యత్వం తోడ్పడగలదు.

1. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పట్టాలెక్కించడం.
2. క్రమం తప్పకుండా ద్వైవార్షికంగా బిమ్స్‌టెక్ సమ్మిట్‌ను జరిపి కార్యాచరణ ప్రణాళికలు అమలుచేయడం.
3. 14 ప్రాధాన్యత రంగంలో అతి ప్రాధాన్యతా రంగాలను గుర్తించి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం.
4. బిమ్స్‌టెక్ బ్యాంకు ఏర్పాటును వేగిరం చేయడం.
5. ఇండియా పెద్దన్నపాత్ర వహిస్తూ, బిమ్స్‌టెక్‌లో ఆధిపత్యం చెలాయిస్తోందన్న అపవాదును తొలగించుకునేందుకు 'గుజ్రాల్ డాక్ట్రిన్' వంటి చొరవలను భారత్ ఆరంభించడం.
6. బ్లూ ఎకానమీ దిశగా సభ్యదేశాలను ఉత్సాహపరిచేందుకు భారత్ నేపాల్, భూటాన్ వంటి దేశాలకు తన తీరప్రాంతంలో కార్యకలాపాలకు అవకాశం కల్పించడం, బంగ్లాదేశ్, మయన్మార్‌లకు సాంకేతిక సహకార బదిలీ ద్వారా వాటిని ఆకట్టుకోవడం వంటి చర్యలపరంగా కూటమిని బలపరిచేందుకు కూటమిలో పెద్ద దేశమైన భారత్ చొరవ తీసుకోవాల్సి ఉంది.

పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు

7. డిజిటల్ ఎకానమీ, స్పేస్ టెక్నాలజీ వంటి అంశాలను కూడా ప్రాధాన్యతాంశాల్లో చేర్చి ఇతర బిమ్స్‌టెక్ దేశాలకు భారత్ సహకరించడం ద్వారా ఈ కూటమిని పటిష్టం చేసే అవకాశం ఉంది.

భౌగోళికంగా బంగాళాఖాత తీర దేశాలే కూటమి అని వ్యవహరిస్తున్నా, అంతకుమించి ఇతర ప్రాంతాలనూ ఇప్పటికే కలుపుకొని ఇకపై ఇతర దేశాలకూ ఆహ్వానం పలకడానికి సిద్ధంగా ఉన్న బిమ్స్‌టెక్ వ్యూహాత్మకంగా, భౌగోళికంగా అనుకూలతలపరంగా ఎన్నో కలిసివచ్చే అంశాల సమాహారంగా ఉంది. అంతేకాక ఇటీవల సాధించిన 'లీగల్ పర్సనాలిటీ' ధృవీకరణ వల్ల తన చర్యలు అధీకృతమయ్యే సౌలభ్యం దృష్ట్యా కూడా ఈ కూటమి ప్రభావవంతంగా వ్యవహరించగలిగే లక్షణాన్ని సొంతం చేసుకుంది. ఇక కావల్సింది సభ్యదేశాల్లో కూటమి సాఫల్యం దిశ'గా అంకితభావం మాత్రమే. కూటమిలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ, అత్యంత ప్రయోజనం పొందగల దేశమైన భారత్‌పై ఈ కూటమి పరిరక్షణ బాధ్యతలు ఒకింత ఎక్కువగానే ఉన్నాయని చెప్పవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దొంగచాటుగా అమెరికాకు హరీశ్‌రావు

- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును కలిశారు
- ఇప్పట్లో తెలంగాణకు రావద్దని చెప్పి వచ్చారు
- ట్యాపింగ్ కేసులో కేసీఆర్ జైలుకెళ్లడం ఖాయం
- మీడియాతో టీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు గత నెల 27న ఎమిరేట్స్ విమానంలో దొంగచాటుగా అమెరికా వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు.. అక్కడే ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును కలిశారని ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పట్లో తెలంగాణకు రావద్దని ఆయనకు చెప్పి వచ్చారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు అప్రూవర్‌గా మారితే తాను, తన కొడుకు కేటీఆర్ జైలుకు వెళ్లాల్సి వస్తుందన్న భయంతో కేసీఆరే హరీశ్‌రావును అమెరికా పంపారని తెలిపారు. 27వ తేదీ తెల్లవారు జామున 4.30గంటలకు ఎమిరేట్స్ విమానం(ఈకే 525)లో కుటుంబ సమేతంగా అమెరికా వెళ్లిన హరీశ్‌రావు.. శనివారం ఉదయం తిరిగి వచ్చారని పేర్కొన్నారు. ఒక ప్రజాప్రతినిధి విదేశాలకు వెళ్లే ముందు మీడియాకు వెల్లడించడం ఆనవాయితీ అని, కానీ.. హరీశ్ అమెరికా వెళ్లి వచ్చిన సంగతి ఎవరికైనా తెలుసా? అని ప్రశ్నించారు. ప్రభాకర్‌రావును హరీశ్ కలిసినపుడు అక్కడ బయట ఉన్న వాళ్లే తనకు ఈ విషయం చెప్పారన్నారు. హరీశ్‌కు దమ్ముంటే అమెరికా వెళ్లి ప్రభాకర్‌రావును కలవలేదంటూ ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికారులతో ఫోన్ ట్యాపింగ్‌లు చేయించి.. తెలంగాణను కేసీఆర్ నవ్వుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు, మీడియా యాజమాన్యాలు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి, రూ.వేల కోట్లు వసూళ్లు చేశారని ఆరోపించారు. ప్రభాకర్‌రావును పట్టుకునేందుకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని నెల క్రితం కేంద్రానికి లేఖ రాసినా, స్పందన రాలేదని వెల్లడించారు. బీజేపీ, బీఆర్ఎస్ విలాఖత్ అయినందునే స్పందించడం లేదని ఆరోపించారు. ఇవాళ కాకుంటే రేపైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తెచ్చుకుని రెడ్ కార్నర్ నోటీసు జారీ చేస్తామని, ప్రభాకర్‌రావును రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పారు. ఆ తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కేసీఆర్, హరీశ్‌రావులు ఎక్కడ ఉంటారో తనకు తెలియదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ దొంగచాటు వ్యవహారం పక్కన పెట్టి.. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేసీఆర్‌కు సూచించారు.

4వ తేదీ తర్వాత బీఆర్ఎస్ క్లోజ్

ఈ నెల 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ దుకాణం మూతపడబోతుందని, 16 స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. లోపాయికారి ఒప్పందంలో భాగంగా ఒకటి, రెండు తప్ప అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలు.. బీజేపీకి ఓట్లు వేయించారని ఆరోపించారు. అందుకే తెలంగాణలో 9 నుంచి 11 సీట్లు వస్తాయంటూ బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారన్నారు. కానీ, అదంతా జరిగే పని కాదని, కాంగ్రెస్‌కు కనీసం 12 సీట్లు వస్తాయని చెప్పారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల బలం ఉండడం వల్లే బీఆర్ఎస్ గెలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్‌లాగా ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొనే చిల్లర పార్టీ కాంగ్రెస్ కాదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల దగ్గర దోచుకున్న డబ్బులు ఉన్నందునే... క్యాంపులు పెట్టి గెలిచారన్నారు.

వేధించి.. విముక్తి

తప్పు చేయకున్నా పీఆర్ ఇంజనీర్లు విలవిల

- టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు వైసీపీ సర్కారు ఐదేళ్లుగా కక్షసాధింపు
- తనిఖీలు, కేసులతో ఇంజనీర్లు హడల్
- దాదాపు 800 మందిపై కేసుల బనాయింపు
- ఐదేళ్లూ వేధించి ఇప్పుడు ఉపశమనం
- వాళ్లకేదో మేలు చేసినట్లు సర్కారు బిల్డప్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో సిమెంటు రోడ్లు వేసిన టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు వైసీపీ సర్కారు పంచాయతీరాజ్ ఇంజనీర్లను బలిపశువుల్ని చేసింది. ఈ శాఖలో 2 వేలమందికి పైగా ఇంజనీర్లు ఉండగా, దాదాపు 800 మందిపై కేసులు పెట్టించింది. ఐదేళ్లూ రకరకాల తనిఖీలు, కేసులతో వేధించి చివరకు ఎన్నికల సమయంలో విముక్తి లభించింది. ఒక మనిషిని కొట్టి గాయం చేసి, ఆ దెబ్బకు మందు వేసి ఉపశమనం కలిగించినట్టుగా పంచాయతీరాజ్ ఇంజనీర్ల పరిస్థితి తయారైంది. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో 10 వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు వేసి చరిత్ర సృష్టించారు. వైసీపీ సర్కారు రాగానే.. అభివృద్ధి చేయడమే తప్పన్నట్టుగా పంచాయతీరాజ్ ఇంజనీర్లకు చుక్కలు చూపించింది. ఈ ప్రభుత్వంలోని బాధితుల్లో మొదటి స్థానం వారిదే. ఇంజనీర్లపై విజిలెన్స్ కేసులు పెట్టారు. కొంత మందిపై ఏసీబీ కేసులు కూడా నమోదు చేశారు. దీంతో పలువురు ఇంజనీర్లు తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు. కొందరు రోగాల బారినపడ్డారు. మరికొందరు మానసిక క్షోభతో మరణించారు. ఇంజనీర్ల నిరవధిక పోరాటంతో ఎట్టకేలకు ప్రభుత్వం తలొగ్గి విజిలెన్స్ కేసులను వెనక్కి తీసుకుంది. విముక్తి పొందిన వారిలో రెండు, మూడేళ్లలో రిటైర్ కాబోతున్న ఇంజనీర్లు కూడా ఉన్నారు. పనుల్లో అవకతవకలు జరగకపోయినా టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఎగ్గొట్టేందుకు తమను వేధించారని ఇంజనీర్లు వాపోతున్నారు. మిగిలిన జిల్లాలకు చెందిన ఇంజనీర్లపై కేసులు అలాగే ఉన్నాయి.

జవహర్ హయాంలోనే...

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డి గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఆ సమయంలోనే సిమెంటు రోడ్లు వేశారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో పనులు చేపట్టేందుకు తగినంతమంది సిబ్బంది లేరు. ఇంత భారీ స్థాయిలో పనులు చేపట్టలేమని అప్పట్లో ఇంజనీర్లు నిస్సహాయత వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే ఉపాధి నిధులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముందని, ఇందుకు సహకరించాలని అప్పట్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇంజనీర్లను ఒప్పించారు. ఇంజనీర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని జవహర్‌రెడ్డి కూడా వారికి భరోసా ఇచ్చి ఒప్పించారు.

చంద్రబాబు ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారు. ఈ పనులు చేపట్టిన అప్పటి సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించే లోపే ప్రభుత్వం మారింది. వైసీపీ సర్కారు వచ్చాక కక్షపూరిత వైఖరితో సర్పంచ్‌లకు బిల్లులు ఎగ్గొట్టేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి నిధులు ఇచ్చినా.. పంచాయతీలకు బిల్లులు ఇవ్వకుండా ఇతర అవసరాలకు వాడుకుంది. దీంతో పదవీకాలం ముగిసిన

బిల్లులు ఎగ్గొట్టేందుకు...

సర్పంచ్‌లు కోర్టును ఆశ్రయించారు. ఆ పనుల్లో అవకతవకలు జరిగాయని కోర్టును మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ఇంజనీర్లను పావుల్ని చేసింది. ఇంజనీర్లను టార్గెట్ చేసేలా విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించింది. అంతటితో ఆగకుండా కొన్నిచోట్ల ఏసీబీ తనిఖీలకు కూడా పురమాయించింది. గతంలో చేపట్టిన పనులపై విచారణ చేపడుతున్నామని, నివేదిక వచ్చిన తర్వాత బిల్లులు చెల్లిస్తామని ఏడాది పాటు హైకోర్టును ప్రభుత్వం మభ్యపెట్టింది. ఈ పనుల్లో ఉపాధి నిధులు మిళితమైనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మూడు రకాల తనిఖీలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసి నాణ్యతను పరిశీలించారు. ఎక్కడైనా లోపాలుంటే జరిమానాలు విధించారు. వారితో పాటు సోషల్ ఆడిట్ సిబ్బంది కూడా ఈ పనులను పరిశీలించారు. అంతేగాక ఇతర శాఖల ఇంజనీర్లను నియమించి తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్లు పంపిన వివరాల్లో పనులకు సంబంధించి అసంపూర్ణ సమాచారముందని ప్రణాళిక శాఖ అధికారులు భావించారు. సుమారు 5,679 పనులకు అగ్రిమెంట్ నంబర్ వేయలేదని, 263 పనులకు ఎంబుక్స్ నంబర్లు లేవని, 698 పనులకు రికార్డింగ్ తేదీలు వేయలేదని, 712 పనుల్లో చెక్ మెజర్‌మెంట్ తేదీలు సూచించలేదని, 1124 పనులకు సంబంధించి అగ్రిమెంట్ చేసిన పని కంటే ఎక్కువ చేశారని కలెక్టర్లు ఇచ్చిన నివేదిక ద్వారా గుర్తించినట్లు చెప్పారు. ఈ పనులన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టి నాణ్యతను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రణాళిక శాఖ కార్యదర్శి అప్పట్లో ఓ లేఖ ద్వారా విజిలెన్స్‌ను కోరారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించరాదన్న మొండి పట్టుదలతో ఉన్న ప్రభుత్వం విజిలెన్స్, ఏసీబీ విచారణకు ఆదేశించడంతో ఇంజనీర్లకు కంటి మీద కునుకు కరువైంది. చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయడానికి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచాలని ఏసీబీ అధికారులు పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ఇంజనీర్లు బెంబేలు

వైసీపీ ప్రభుత్వంలో వరుస తనిఖీలతో పంచాయతీరాజ్ ఇంజనీర్లు బెంబేలెత్తిపోయారు. టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు విచారణ పేరిట ఇంజనీర్లను వేధించారు. తప్పులు జరగకపోయినా విచారణ చేపట్టడమేంటని గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డికి ఇంజనీర్లు మొరపెట్టుకున్నారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముత్యాలనాయుడిని పలుమార్లు బతిమాలాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓ వైపు తనిఖీలతో హడలిపోగా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుడితి రాజశేఖర్ ఈ కేసును బూతద్దంలో చూడటంతో ఇంజనీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చివరకు పెద్దిరెడ్డి, ముత్యాలనాయుడు జోక్యం చేసుకోవడంతో ఇంజనీర్లపై కేసులు ఎత్తేస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. టీడీపీ నేతలకు బిల్లులు నిలిపేసేందుకు ఇంజనీర్లను వేధించిన వైసీపీ సర్కారు చివరకు వారిపై విజిలెన్స్ కేసులు ఎత్తేసి మేలు చేశామంటూ ఇదేదో ఘన కార్యంగా చెబుతోంది. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులకు మంత్రి పెద్దిరెడ్డి ఫోన్ చేసి ఇంజనీర్లకు హామీ ఇచ్చామని, వారిపై ఎలాంటి విజిలెన్స్ కేసులు లేకుండా చేయాలని సూచించారు. దీంతో మంత్రి తమకు సాయం చేశారంటూ ఇంజనీర్ల సంఘాలు కృతజ్ఞతలు చెప్పాయి. క్షేత్రస్థాయి ఇంజనీర్లు మాత్రం తమను అకారణంగా విజిలెన్స్ కేసుల్లో ఇరికించి, ఇప్పుడు మేలు చేసినట్టు వైసీపీ సర్కారు బిల్డప్ ఇస్తోందని విమర్శిస్తున్నారు.

గ్రామదేవత జాతరలో విషాదం

- ట్రాక్టర్‌కు తగిలిన విద్యుత్ తీగలు.. ఇద్దరు మృతి



పల్లకీకి తగిలిన విద్యుత్ తీగలు

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత జాతరలో పల్లకీ ఉత్సవంలో విషాదం నెలకొంది. పల్లకీని తీసుకువస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇద్దరు భక్తులు మృతి చెందారు. బెంగళూరు శివారులోని ఎలక్ట్రానిక్ సిటీకి అనుబంధమైన గొల్లహళ్లిలో శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో వీరసంద్ర నివాసి రంగనాథ్ (33), యరండహళ్లి నివాసి హరిబాబు (25) ప్రాణాలు కోల్పోయారు. గొల్లహళ్లిలో గ్రామ దేవత జాతరలో భాగంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం ముగిసి తిరిగి వస్తుండగా పల్లకీకి విద్యుత్ తీగలు తగిలాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. అతన్ని రక్షించేందుకు వెళ్లిన మరో వ్యక్తికీ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు.

టెరిటోరియల్ ఆర్మీలో చేరిన భవ్య

- కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా గుర్తింపు



బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్ర అధికార ప్రతినిధి, సోషల్ మీడియా విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న భవ్య నరసింహమూర్తి టెరిటోరియల్ ఆర్మీలో చేరారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాత్రమే పరిచయం ఉన్న భవ్య ప్రస్తుతం ఆర్మీలో లెఫ్టినెంట్ హోదా పొందారు. టెరిటోరియల్ ఆర్మీలో చేరినట్టు సోషల్ మీడియాలో ఆమె ఆదివారం వెల్లడించారు. దక్షిణాది నుంచి ఎంపికైన తొలి మహిళ, ప్రాంతీయ సైన్యాధికారిగా, లెఫ్టినెంట్‌గానూ భవ్య నరసింహమూర్తి నిలిచారు. 2022లో డైరెక్టరేట్ జనరల్ టెరిటోరియల్ ఆర్మీ నిర్వహించిన పరీక్షల్లో ఏకైక మహిళా ప్రాంతీయ సైనిక అధికారి అనే గౌరవానికి ఎంపికయ్యారు. ప్రాంతీయ సైన్యం అంటే రెగ్యులర్ ఆర్మీ కాదు. దేశపౌరులు తమ వృత్తితో పాటు సైన్యంలో భాగమై దేశసేవ చేసే అవకాశాన్ని కల్పిస్తారు. టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని, పారాచూట్ రెజిమెంట్ ప్రాంతీయ సైనిక అధికారిగా వ్యవహరించారు. రాజస్థాన్‌కు చెందిన సచిన్ పైలెట్, బీజేపీకి చెందిన అనురాగ్ ఠాకూర్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో చేరి గుర్తింపు పొందారు. ఏడాదికి రెండు నెలలపాటు టెరిటోరియల్ ఆర్మీలో విధులు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రజలు ఆశీస్సులు అందించాలని ఆమె సోషల్ మీడియా ద్వారా ఆకాంక్షించారు. భవిష్యత్తులో రాజకీయాల్లో దేశసేవ చేయదలిచానని, అంతకంటే ముందు దేశ సరిహద్దులో సేవ చేసే భాగ్యం లభించిందని పేర్కొన్నారు. 2024 మే నెలలో ఇండో-పాక్ ఎల్ఓసీ (నియంత్రణ రేఖ) వద్ద ఉండే శిబిరంలో శిక్షణ పొందానని భవ్య వెల్లడించారు.

నేడు రౌస్ అవెన్యూ కోర్టుకు కవిత

- కస్టడీ పొడిగించాలని కోరనున్న దర్యాప్తు సంస్థలు!

న్యూఢిల్లీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. జ్యుడీషియల్ కస్టడీ ముగియనుండడంతో ఆమెను కోర్టు ఎదుట హాజరు పరచనున్నారు. కవితతోపాటు చరణ్‌ప్రీత్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌లను నిందితులుగా పేర్కొంటూ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ వేసిన అనుబంధ చార్జిషీట్‌ను గత నెల 29న న్యాయమూర్తి అంగీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కవిత, చరణ్‌ప్రీత్‌లు ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉండడంతో వారికి న్యాయస్థానం ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసింది.

ఐపీఎల్ 'కావ్య'ం

ఈ ఐపీఎల్ సీజన్‌లో.. కోల్‌కతా రైడర్స్ యజమాని షారుక్ ఖాన్ కంటే సోషల్ మీడియాలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమాని కావ్య మారన్ పాపులరైంది. ఐపీఎల్ ఆద్యంతం.. క్రికెట్ గ్రౌండ్‌లోని కెమెరాల లెన్సులన్నీ ఆమె హావభావాలను ఒడిసిపట్టాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆమె కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యం క్రికెట్ ప్రేమికుల్ని కదిలించింది. ఈ ఏడాది 'నేషనల్ క్రష్' అయిన కావ్య మారన్ కథేంటీ?

ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో.. కెమెరా కంట ముఖం పడకుండా వెనక్కి తిరిగి మరీ కన్నీళ్లు పెట్టుకున్న ప్రెట్టీ యంగ్ లేడీని చూసి నిజంగా ఫీలయ్యానంటూ... బిగ్ బి అమితాబ్ బచ్చన్ 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. దాదాపు అందరి అభిప్రాయమూ ఇదే. కావ్య మారన్ నవ్వితే.. నవ్వారు. ఆమె హావభావాలు చూడటం కోసం ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఫైనల్ మ్యాచ్‌లో భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయిందీ అధినేత. తన జట్టు ఓడినా.. ప్రేక్షకుల మనసు మాత్రం గెల్చుకుంది.

ఎవరీ కావ్య మారన్?

సన్‌గ్రూప్ అధినేత కళానిధి మారన్ ఒకే ఒక్క గారాల పట్టి కావ్య మారన్. 19వేల కోట్ల సామ్రాజ్యానికి ఆమె ఒకే ఒక్క రాకుమారి. క్రికెట్ అంటే అమితమైన ప్రేమ ఉండే కావ్య..



ఫ్రాంచైజీ యజమానిగా వ్యవహరిస్తోంది. 409 కోట్ల నికర సంపద ఆమె సొంతం. ఒకే ఒక్క కూతురు.. వేల కోట్ల సామ్రాజ్యం. సన్‌మ్యూజిక్ సంస్థతో పాటు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీకి సీఈవోగా బాధ్యతలు వ్యవహరిస్తోంది. 2018లో ఐపీఎల్ బాటలోకి వచ్చిన పేరున్న క్రికెటర్లతో జట్టును కూర్చింది. కోట్ల రూపాయలు వెచ్చించి వేలంలో చేజిక్కించుకుంది. గత సీజన్స్‌లో ఎస్ఆర్‌హెచ్ వెనక్కి పడిపోవటంతో విమర్శలూ మూటగట్టుకుంది. అయినా పట్టువదలకుండా ఈసారైనా తన జట్టును గెలిపించుకోవాలని వ్యూహరచన చేసింది. అయితే ఈ ఏడాది ప్రకృతి కావ్య రచన మరోలా ఉంది. జట్టు విజయాపజయాలు అనేది సాధారణ విషయమైనా.. ఆమె కన్నీళ్లు మాత్రం నిజాయితీతో కూడుకున్నవి కాబట్టే ప్రేక్షకులతో పాటు విజేతల జట్టు కూడా ఎమోషనైంది.

అందుకే ఆమె క్రేజ్..

చెన్నైలోని 'స్టెల్లా మారిస్ కాలేజీ'లో డిగ్రీ చదివింది. యూకేలోని 'వార్విక్ బిజినెస్ స్కూల్‌'లో ఎంబీఏ చదివింది. దీంతో ఆమె తన తండ్రి స్థాపించిన సన్‌గ్రూప్‌ను మరింతగా అర్థం చేసుకుంది. దీంతో కళానిధి మారన్ తన బిడ్డను మరింతగా ప్రోత్సహించారు. ఎంతైనా.. తన వ్యాపార సామ్రాజ్యానికి వారసురాలు ఆమే కదా! కావ్య మారన్‌కు తోబుట్టువులు లేరు. దీంతో ఆమెను పాపం.. సింగిల్! అంటూ కొందరు మాట్లాడారు. ఆమె ఒంటరితనంతో ఉండకూడదని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ లాంటి పనులను అప్పచెప్పారు ఆమె పేరెంట్స్. కావ్య మారన్ వయసు ముప్ఫయ్ ఒకటి. అమధ్య మ్యూజిక్ దర్శకుడు అనిరుధ్ బాయ్ ఫ్రెండ్ అని గాసిప్స్ వచ్చాయి. ఓ క్రికెటర్ ప్రేమలో పడిందని కోడైకూసారు. అవేమీ నిజం కాదని తేలింది. పైగా ఆమె సింగిల్ కావట... కథానాయికలా ఆమె చూపులు.. నవ్వు.. ఉల్లాసంగా గెంతులేయటం, బంతి బంతికీ ఉత్కంఠ, ప్రతి సిక్స్‌కూ కేరింత చేయటంతో మీడియా ఆమె గురించి కథనాలు ప్రసారం చేసింది. సోషల్ మీడియా నెత్తికెత్తుకుంది. దీంతో 'నేషనల్ క్రష్' అయింది కావ్య.

ఆశావహదృక్పథానికి నెటిజన్ల ఫిదా!

ఫైనల్‌లో ఓడిపోయాక తన జట్టు సభ్యులతో కావ్య మాట్లాడిన వీడియోను సన్‌రైజర్స్ సంస్థ విడుదల చేసింది. 'అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతి ఒక్కరూ బాగా ఆడారు. మన గురించి అందరూ మాట్లాడుకుంటారు' అంటూ కావ్య మారన్ తన జట్టులో ధైర్యాన్ని నింపింది. ఓడిపోయామన్న బాధను దిగమింగుకుని.. జట్టు సభ్యులను నవ్వించింది. దీంతో నెటిజన్లు ఆమె మాటలకు ఫిదా అయ్యారు. ఆమె తీరును మెచ్చారు. నిజమైన లీడర్ అంటే 'కావ్య మారన్' అంటూ కొనియాడుతున్నారు. దటీజ్.. కావ్య మారన్!



అత్తమ్మ... ఆవకాయ

'అత్తమ్మ'గా తెలుగువారందరినీ 'ఫిదా' చేశారు.
యాభై ఎనిమిదేళ్ల వయసులో నటి అయ్యారు.
హుందాగల పాత్రల్లో నటిస్తూ... అతితక్కువ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.
దర్శకుడు తరుణ్ భాస్కర్ తల్లిగానే కాకుండా... కళాకారిణిగా... ఉపాధ్యాయురాలిగా... రచయితగా... బహుముఖ ప్రజ్ఞతో అందరికీ దగ్గరయ్యారు... దాస్యం గీతాభాస్కర్.
అంతేకాదు... నలుగురినీ పిలిచి... ఆవకాయ పెట్టి... 'పచ్చడి పార్టీ' ఇచ్చి... మన సంస్కృతిని భావితరాలకు అందిస్తున్న ఆమెతో 'నవ్య' ముచ్చట్లు.

"చిన్నప్పటి నుంచి నాకు ఆర్ట్ అంటే చాలా ఇష్టం. అందుకే అప్లైడ్ ఆర్ట్ నేర్చుకున్నా. ఆ దారిలోనే నా కెరీర్‌ను కూడా నిర్మించుకోవాలని కలలు కన్నా. కానీ పెళ్లి తరువాత నా ప్రణాళికలన్నీ తలకిందులయ్యాయి. మావారు దాస్యం ఉదయ్‌భాస్కర్‌ది రాజకీయ నేపథ్యం గల పెద్ద కుటుంబం. ఆయన స్వస్థలం వరంగల్. విద్యార్థి నాయకుడిగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మాజీ సీఎం జలగం వెంగళరావు, మాజీ మంత్రి కడియం శ్రీహరి తదితరులు బాగా పరిచయం. మావారు వాటర్‌వర్క్స్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేసేవారు. వాళ్లు ఎనిమిది మంది సంతానం. ఆ ఇంటికి నేనే పెద్ద కోడల్ని. మా నాన్నావాళ్లది తిరుపతి సమీపంలోని వడమలపేట. అమ్మావాళ్లది ఊటీ. నేను పుట్టి పెరిగింది చెన్నైలో. 1987లో మా పెళ్లయ్యాక నా నివాసం హైదరాబాద్‌కు మారింది. మావారి కోసం నగరానికి ఎవరు వచ్చినా మా ఇంటికి వచ్చేవారు. బాధ్యతలు పెరగడంతో అనుకున్న కెరీర్ వైపు వెళ్లలేకపోయాను.

అయితే కొన్ని కారణాలవల్ల మావారు ఉద్యోగం వదిలేసి, కాంట్రాక్టులు మొదలుపెట్టారు. దాంతో కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎవరినో సాయం అడిగే కంటే నేనే ఏదైనా ఉద్యోగం చేయడం ఉత్తమం అనుకున్నా. మా నాన్న కూడా అదే చెప్పారు. తరుణ్ స్కూల్‌కు వెళ్లడం మొదలయ్యాక ఖర్చులు కూడా పెరిగాయి. వాడిని తీసుకొని బడికి వెళుతున్నప్పుడు... ఎవరైనా టీచర్ రాకపోతే నన్ను పాఠాలు చెప్పమనేవారు. తరువాత ఆర్ట్ టీచర్‌గా కొత్త అధ్యాయం ఆరంభమైంది.

ఎంతో నేర్పించవచ్చు...

పిల్లలు... వారి కల్మషం లేని మనసులు... అదొక అద్భుత ప్రపంచం. టీచర్‌గా అవన్నీ పొందగలిగాను. అప్పుడే అనిపించింది... ఆర్ట్ ద్వారా పిల్లలకు ఎంతో నేర్పవచ్చని. ఆర్టిస్ట్‌గా నాలో సృజనాత్మక శక్తి ఉంది. దానికి విజ్ఞానాన్ని, విలువలను జోడించి పిల్లలకు పాఠాలు చెబితే... సులువుగా అర్థమవుతుంది. వారి ఉన్నతమైన భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుంది. ఆర్ట్ అంటే ఏదో బొమ్మలు గీసి గోడ మీద తగిలించేది కాదు. దాని ద్వారా ఎన్నో విషయాలు నేర్పించవచ్చనేది నా బలమైన నమ్మకం. బొమ్మలతో చెబితే పిల్లలకు మెదడులో నాటుకుపోతుంది. దీనికి పాఠ్య పుస్తకం ఏమీ ఉండదు కనుక పిల్లలతో ఏ విషయం గురించి అయినా మాట్లాడగలుగుతాం. నా తరగతిలో బొమ్మలు వేయడమే కాదు... దానికి క్యాప్షన్లు కూడా ఆలోచించమంటాను. దీనికి సంబంధించి సొంతంగా ఆరు నెలల విజువల్ ఆర్ట్ కోర్సు ఒకటి తయారు చేశాను.

> **అవకాశం అప్పుడే వచ్చింది...**
>
> **చెన్నైలో అడ్వర్‌టైజ్‌మెంట్స్ డిజైనింగ్‌లో పని చేశా. యానిమేషన్ నేర్చుకున్నా. కొన్ని చిత్రాలకు టైటిల్ యానిమేషన్ చేశాను. ఆ సమయంలోనే నాకు సినిమాలో నటించే అవకాశం వస్తే... మా అమ్మ వద్దని ఆపేసింది. భానుమతి గారు మా అమ్మావాళ్ల ఇంటికి వచ్చేవారట. శివాజీ గణేశన్ అదే వీధిలో ఉండేవారు. ఇలా సినీ పరిచయాలు ఉన్నా ఎందుకో మా అమ్మ అసలు ఆ వైపుకే వెళ్లద్దంది.**

అక్కతో పోల్చడంతో...

మా ఇంట్లో నన్ను మా అక్కతో పోల్చేవారు. తను సన్నగా ఉండేది. అలాగే ఇంగ్లీష్ బాగా మాట్లాడుతుంది. అలా పోల్చడంవల్ల నాకు పట్టుదల వచ్చింది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపనతో క్రాస్‌వర్డ్, జంబ్లింగ్ వర్డ్ పజిల్స్ పూరించేదాన్ని. పేపర్లో కనిపిస్తే ఇప్పటికీ చేస్తా. ఆంగ్లంలో కవితలు రాసేదాన్ని. నాతో పాటు మా అబ్బాయి తరుణ్ కూడా పజిల్స్ చేస్తాడు. అలా నా అంతట నేను ఇంగ్లీష్‌లో చాలావరకు మెరుగయ్యాను. చెన్నైలో పెరగడంవల్ల నాకు మొదట్లో తెలుగు కూడా వచ్చేది కాదు. ఇక్కడకు వచ్చాక నేర్చుకున్నా.

ఉద్యోగం వదిలేసి...

సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ కూడా తీసుకున్నా. దానికి చిత్రకళ జోడించి వర్క్‌షాప్స్ నిర్వహించాను. హెచ్‌పీఎస్‌లో పని చేసినప్పుడు... ఆర్ట్‌ను ఎప్పటిలా కాకుండా కాస్త మార్చాలని చెబితే, ఆ స్వేచ్ఛ నాకు ఇచ్చారు. 2007లో అక్కడ మానేశాను. ఎందుకంటే మా అబ్బాయి అప్పుడు సినిమాల్లో ప్రయత్నిస్తున్నాడు. ఇంటి పట్టున ఉండి వాడికి కావల్సినవి చూసుకోమని మావారు చెప్పడంతో ఉద్యోగం వదిలేశాను. ఇంగ్లీష్‌లో మరింత పట్టు సాధించడానికి ఈ



సమయాన్ని ఉపయోగిద్దామని అనుకున్నా. దాంతో నిజాం కాలేజీలో ట్రైనర్‌గా చేరాను. డాక్టర్ సురేష్ గారి ప్రోత్సాహంతో తరగుతులు తీసుకున్నాను. పార్ట్‌టైమ్ లాగా. టైమ్స్ ఆఫ్ ఇండియాలో కొన్ని రోజులు ఆర్ట్, ఇలస్ట్రేషన్, స్టోరీ రైటింగ్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. దానికి ముందు వేరేచోట పని చేశాను. అయినా ఎందుకో చిత్రకళతో కొత్తగా ఏదైనా చేయాలని అనుకున్నాను.

అలా ఉపయోగపడింది...

అనుకోకుండా 58 సంవత్సరాల వయసులో నాకు నటించే అవకాశం లభించింది. స్క్రీన్ ప్రెజెన్స్‌తో మొదటి చిత్రం 'ఫిదా'తోనే మంచి గుర్తింపు దక్కింది. దర్శకుడు తరుణ్ భాస్కర్ వాళ్ల అమ్మ కావడం అదనపు అర్హత అయింది. ఈ గుర్తింపు నేను రూపొందించిన విజువల్ ఆర్ట్ కోర్సు గురించి వివరించడానికి స్కూల్స్‌కు వెళ్లినప్పుడు ఉపయోగపడింది. కనీసం నేను ఏం చెప్పదలుచుకున్నానో చెప్పడానికి నాకు ఒక అవకాశం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కోర్సుకు ప్రభుత్వం సర్టిఫికేషన్ ఇస్తానంది. ప్రస్తుతం ఇరవై కార్పొరేట్ స్కూల్స్‌లో ఈ విజువల్ ఆర్ట్ కోర్సు చెబుతున్నాం. పిల్లల్లో సృజనకు పదును పెట్టి, వారిలో ఆలోచనాశక్తి పెంపొందించడం, డ్రాయింగ్ ద్వారా సామాజిక, సాంస్కృతిక అంశాలు, విలువలు బోధించేలా పీపీ-1 నుంచి ఏడో తరగతి వరకు దీన్ని డిజైన్ చేశాను. పిల్లలు నిజాయతీగా, బాధ్యతగా పెరగడానికి ఇది దోహదపడుతుంది. ఈ క్రమంలో చిన్నారుల నుంచి నేను కూడా ఎన్నో నేర్చుకున్నాను.

సినిమాల్లో అలా మొదలైంది...

తరుణ్‌కు మొదటి నుంచీ కళాత్మక దృష్టి ఉండేది. ఎవర్ని చూసినా పోర్ట్రైట్ వేసేస్తాడు. అలాగని చిత్రలేఖనం నేర్చుకోలేదు. అంత ప్రతిభ నాకు కూడా లేదు. తరువాత సంగీతం కూడా అంతే. తబలా, మౌతార్గన్, గిటార్... ఏ వాయిద్యం ఇచ్చినా వాయిస్తాడు. వాడిలో ఆ సంగీత జ్ఞానం ఉంది. కోచింగ్ కూడా లేకుండా ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు తెచ్చుకున్నాడు. ఇంజనీరింగ్ తరువాత ఎటు వెళ్లాలనేది వాడికే వదిలేశారు మావారు కూడా. అయితే వాడు కాలేజీలో చదువుతున్నప్పుడు షార్ట్ ఫిలిమ్ కాంపిటీషన్ జరిగింది. అందులో తల్లి పాత్రకు నన్ను తీసుకున్నాడు. 'నువ్వు ఇంట్లో ఎలా ఉంటావో అలానే కనిపించాలని అన్నాడు. అది చూసి శేఖర్ కమ్ముల గారు 'ఫిదా'లో అవకాశం ఇచ్చారు. మావారు చనిపోవడం, తరుణ్ 'పెళ్లి చూపులు' చిత్రం హిట్ అవ్వడం... భిన్నమైన భావోద్వేగ పరిస్థితుల్లో ఉన్నాను. షూటింగ్‌లో ఏడ్చినా, నవ్వినా ఎవరూ అడిగేవారు ఉండరని ఒప్పుకున్నా.

భగవంతుడు చూపిన మార్గం...

చూస్తుండగానే పన్నెండు చిత్రాల్లో నటించేశాను. ఇవికాకుండా యాడ్స్, వెబ్‌సిరీస్‌ల్లో నటించాను. శర్వానంద్ చిత్రంలో కూడా చిన్న పాత్ర చేశా. ఒక వెబ్ సిరీస్ పూర్తయింది. అయితే నటనను ఫుల్‌టైమ్‌గా తీసుకోదలుచుకోలేదు. తరుణ్ కూడా వద్దన్నాడు. అందుకే రెండు మూడు రోజులు షూటింగ్ ఉన్నవే ఒప్పుకొంటున్నా. డబ్బింగ్ కూడా నేనే చెబుతున్నా. అదికూడా సాయిపల్లవి వల్లే. 'ఫిదా'లో నా పాత్రకు వేరేవాళ్లతో చెప్పిస్తే తను ఒప్పుకోలేదట. కళ పట్ల ప్రేమ ఉండటంవల్ల బహుశా భగవంతుడు నాకు ఈ మార్గం చూపించాడేమో అనిపిస్తుంది. పరిశ్రమలో ఎంతో మంది సీనియర్ నటులతో పాటు నన్ను కూడా గుర్తుపడుతున్నారు. నిజంగా ఇది మధురానుభూతి.

కాలం మారుతుంది...

మా ఆర్థిక పరిస్థితి దిగజారిన తరువాత నాకు ధైర్యం ఇచ్చినవారు లేరు. 'ఈ కాలం మారుతుంది' అని ఎప్పటికప్పుడు నాకు నేనే చెప్పుకొనేదాన్ని. తరుణ్‌ను తీసుకొని స్కూటీ మీద స్కూల్‌కు వెళుతున్నప్పుడు ఎందుకు అనుకున్నానో తెలియదు, కానీ గట్టిగా అనుకున్నా... 'లైఫ్ విల్ నాట్ బి ద సేమ్' (జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు) అని. పొద్దున్నే లేవడం... ఇంటి పనులు చేసుకోవడం... ఇదే నా బలం. దానివల్ల ఫీల్ గుడ్ హార్మోన్ అంటారు కదా... అలా అనిపిస్తుంది. మన ఇంటి పనులు మనం చేసుకొంటే ఎంత ఆరోగ్యంగా ఉంటాం! అలాగే మధ్యలో వదిలేసిన పెయింటింగ్స్ మళ్లీ మొదలుపెట్టాలి. ఇంకో పుస్తకం రాయాలి. ఇంతకు మించి నాకు వేరే కోరికలేమీ లేవు.

పచ్చడి పార్టీ...

మావారికి పచ్చళ్లంటే చాలా ఇష్టం. వాళ్ల వైపు వంటలు కాస్త ప్రత్యేకంగా ఉంటాయి. వాటికి భిన్నంగా వండితే నచ్చదు. అలానే ఆవకాయ పచ్చడి కూడా... అల్లం, వెల్లుల్లితో చేసేదే కావాలనేవారు. అదికూడా వంద కాయలతో పెట్టాలి. అందరికీ పంచాలి. ఆవకాయ పెట్టి, జాడీల్లోకి సర్దాక పచ్చడి కలిపిన గిన్నెలో అన్నం కలిపి అందరికీ పెట్టేదాన్ని. తరుణ్ అయితే వాళ్ల స్నేహితులందరినీ పిలిచి 'పచ్చడి పార్టీ' అని మొదలుపెట్టాడు. 'ఆవకాయ అంటే పెద్ద ప్రక్రియ. పచ్చళ్లు పెట్టడం మన సంస్కృతిలో భాగం. సీజన్‌లో అమావాస్య తరువాత పంచమి రావాలి. ఒక వర్షం అయిపోయాక, కొన్ని రోజులు ఆగాలి. మేలి రకం మామిడి కాయలు తెప్పించాలి. ఇలా ఎన్నో విషయాలు చూసుకోవాల'ని ఆ మధ్య ఓ కార్యక్రమంలో చెప్పాను. దాంతో వాళ్లు మా ఇంటికి వచ్చి పచ్చడి మీద డాక్యుమెంటరీ తీశారు. అలాగే మా ఆర్ట్ స్కూల్ వార్షికోత్సవంలో కూడా 'పచ్చడి పార్టీ' పెట్టా. నలుగురినీ పిలిచి పచ్చడి పెట్టడమంటే అందులో మన సంస్కృతి ప్రతిబింబిస్తుంది."

● హనుమా

> **సాయిపల్లవితో స్నేహం...**
>
> **'ఫిదా' తరువాత హీరోయిన్ సాయి పల్లవితో మంచి స్నేహం ఏర్పడింది. మొన్న కూడా తన పుట్టిన రోజుకు శుభాకాంక్షలు చెబితే... 'అత్తమ్మా...' అంటూ పలుకరించింది. ఇప్పటికీ తను నన్ను 'అత్తమ్మ' అనే పిలుస్తుంది. నేను తనను 'భాను' అనే అంటాను. 'ఫిదా'లో మా ఇద్దరి పాత్రలు కదా అవి. అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుంటా. మెసేజీలు పెడుతుంటా. తన ప్రాజెక్ట్ ఏదైనా ఉంటే అభినందలు పంపుతుంటా. ఆమె చాలా ఫ్లెక్సిబుల్. ఎనర్జటిక్. 'ఫిదా' షూటింగ్‌లో పెళ్లి సన్నివేశం ఉంటుంది. తను తరువాతి షాట్‌కు రెడీ కావాలి. అప్పుడు ప్రొడక్షన్‌వాళ్లు ఆలస్యం చేస్తుంటే... తనే చీపురు తీసుకొని ఊడ్చేసింది. పాటలో మెహిందీ సన్నివేశం కోసం... తను కూడా కోన్ పట్టుకొని మెహిందీ పెట్టేసింది. అసమాన ప్రతిభగల నటి సాయిపల్లవి.**



> **నా ఆరోగ్య రహస్యం...**
>
> మా వారి ప్రోత్సాహంతో గతంలో నేను ఒక పుస్తకం రాశాను. ఆయన ఎప్పుడూ చెప్పేవారు... పిల్లల పెంపకం మీద పుస్తకం రాయమని. అందుకే రాశాను. మా అబ్బాయి తరుణ్ భాస్కర్ నా కడుపులో ఉన్నప్పటి నుంచి వాడి విషయంలో ఆయన చాలా శ్రద్ధ తీసుకున్నారు. అప్పుడు వాంతులతో నేను బాగా ఇబ్బంది పడ్డాను. కానీ నా కంటే పుట్టబోయే బిడ్డ గురించే ఆయన ఎక్కువ పట్టించుకున్నారు. 'నాకు కొడుకే పుడతాడు' అని ఆయనకు నమ్మకం. అలానే ముగ్గులు వేసే అమ్మాయే తనకు భార్యగా వస్తుందని అందరూ మావారిని ఆట పట్టించేవారట. ఎందుకంటే ఈ కాలంలో ముగ్గులు వేసే అమ్మాయిలు ఎక్కడో కానీ లేరనేది వారి అభిప్రాయమట. నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు మా వాకిట్లో ముగ్గు చూసి మావారికి నా మీద ఒక సదభిప్రాయం వచ్చేసిందట. నేను ఇప్పటికీ రోజూ ఇంటి ముందు ముగ్గులు వేస్తాను. పొద్దున్నే 3.50కి నిద్ర లేచి, ఇంటి పనులన్నీ చేసుకోవడం చిన్నప్పటి నుంచి అలవాటు. స్నానం అయ్యాక ఇల్లు ఊడ్చి, తుడుస్తా. అంటే భూమాతకు పూజ చేసినట్టు. చిన్నప్పుడు నేను బాగా లావుగా ఉండేదాన్ని. 'ఇంటి పని చేస్తే కొవ్వు కరుగుతుంది. నడుము బలంగా మారుతుంది' అని మా తాత చెప్పేవారు. దాన్ని ఈ రోజుకూ పాటిస్తున్నా. అదే నా ఆరోగ్య రహస్యం కూడా.

నవ్య | చిత్రజ్యోతి

అప్పుడే సీక్వెల్ చేద్దామన్నా



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. శంకర్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. జూలై 12న ఈ సినిమా విడుదలవుతోంది. చెన్నైలో ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ "1996లో 'భారతీయుడు' వచ్చిన టైమ్‌లోనే ఈ సినిమా సీక్వెల్ గురించి డైరెక్టర్ శంకర్‌తో మాట్లాడాను. కానీ శంకర్ మాత్రం కథ రెడీగా లేదని అన్నారు. 28 ఏళ్ల తర్వాత అయినా ఈ సినిమాకు సెకండ్ పార్ట్ వస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "మొదటి పార్ట్‌కు మించి సీక్వెల్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని శంకర్ అన్నారు. గొప్ప సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సుభాస్కరన్ చెప్పారు.

కొత్త శర్వాని చూస్తారు



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన చిత్రం 'మనమే'. టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మీడియాతో ముచ్చటించారు. "అందమైన అనుభూతులను పంచే కథ ఇది. పేరెంటింగ్ ఎమోషన్‌కు హాస్య కోణాన్ని జత చేసి ఈ సినిమాను తెరకెక్కించా. ఇందులో శర్వానంద్‌ది చాలా కూల్ మనస్తత్వం. ఇప్పటివరకూ చూడని శర్వాని ఇందులో చూస్తారు. కృతిశెట్టి ఈ సినిమాలో నేను ఊహించిన దానికన్నా బాగా నటించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమాలో ఉన్న 16 పాటలు సందర్భానుసారం ఉంటాయి" అని చెప్పారు.

అటు పాట... ఇటు వేట




ధనుష్ టైటిల్ రోల్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు 'ఇళయరాజా' బయోపిక్ తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నేడు ఇళయరాజా పుట్టిన రోజు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ధనుష్ ఈ చిత్రం నుంచి పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. స్టేజిపైన హార్మోనియం పెట్టితో జనాలను చూస్తూ నిల్చొని ఉన్న ధనుష్ లుక్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. అలాగే ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న కుబేర చిత్రం మెయిన్ యాక్షన్ షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా లొకేషన్‌లో యూనిట్‌కు సూచనలు ఇస్తున్న శేఖర్ కమ్ముల స్టిల్‌ను చిత్రబృందం పంచుకొంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక.

అందరికీ నచ్చుతుంది



యానియా, అంకిత, అజయ్, కబీర్ సింగ్ ప్రధాన పాత్రలలో తెరకెక్కిన చిత్రం 'ఇంద్రాణి'. ఈ సూపర్ ఉమెన్ సినిమాను స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. స్టీఫెన్ పల్లం మాట్లాడుతూ "ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. టాప్ క్లాస్ వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రేక్షకులని అలరిస్తుంది. వందేళ్ల తర్వాత ప్రపంచంలో ఎలాంటి టెక్నాలజీ అందుబాటులో ఉంటుందో చూపించాం. అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. కబీర్ సింగ్ మాట్లాడుతూ "సినిమాని విజువల్ వండర్‌లా డైరెక్టర్ తీర్చిదిద్దారు. ఇందులో సూపర్ విలన్‌గా నటించాను" అని చెప్పారు.

శ్రీవిష్ణు, రీతూవర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మీరాజాస్మిన్ రాణి ఉత్పలాదేవిగా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఆదివారం లుక్‌ను విడుదల చేశారు.



వినోదం సందేశం కలబోతగా



హరీష్ బొంపెల్లి, మాన్య సలాడీ హీరో హీరోయిన్లుగా విష్ణు బొంపెల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓసీ'. బీవీఎస్ నిర్మాత. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మురళీ మోహన్ ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడింది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది అని దర్శకుడు చెప్పారు. సరికొత్త కథాంశంతో దర్శకుడు తెరకెక్కించారు, వినోదంతో పాటు మంచి సందేశం ఉంది అని నిర్మాత చెప్పారు. అవకాశాల కోసం వెళ్లి అవమానాల పాలైన దశ నుంచి ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉందని హరీష్ బొంపెల్లి తెలిపారు.

ప్రేమా? ఆకర్షణా?



సుదీష్ వెంకట్, అంకిత సాహ, శ్రేయాసి షా హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'పేషన్'. అరవింద్ జోషువా దర్శకత్వంలో డాక్టర్ అరుణ్‌కుమార్ ఎం, నరసింహ, ఉమేష్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ "ఫ్యాషన్ ప్రపంచానికి సంబంధించి, ఒక సమగ్రమైన సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కుతున్న తొలి భారతీయ సినిమా 'పేషన్'" అన్నారు. ప్రేమ, ఆకర్షణకు సంబంధించి యువతలో ఉన్న అనేకమైన ప్రశ్నలకు ఈ సినిమాలో జవాబు దొరుకుతుందని నిర్మాతలు పేర్కొన్నారు.

పోరాట ఘట్టాలు అలరించేలా



దర్శక నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్ కుమార్, అలేఖ్యరెడ్డి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయిన సందర్భంగా రామకృష్ణ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 'భారీ యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ. కిరణ్ చేసిన స్టంట్స్ హైలైట్ అవుతాయి' అన్నారు. దీక్షతో కృషి చేస్తే ఏదైనా సాధించగలం అనే అంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని కిరణ్ కుమార్ అన్నారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాతలు పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి చెప్పారు.

వారెవ్వా..అమెరికా

టీ20 ప్రపంచకప్‌లో రికార్డు బోణీ
ఆరోన్ జోన్స్ మెరుపు ఇన్నింగ్స్
కెనడాపై ఘన విజయం



ఆరోన్ జోన్స్ (40 బంతుల్లో 94 నాటౌట్)

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్ అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆతిథ్య అమెరికా జట్టు దుమ్మురేపింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం కెనడాతో జరిగిన తొలి మ్యాచ్‌లో రికార్డులను బద్దలు కొడుతూ యూఎస్ఏ 7 వికెట్లతో ఘనవిజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ఆరోన్ జోన్స్ (40 బంతుల్లో 4 ఫోర్లు, 10 సిక్సర్లతో 94 నాటౌట్) అసాధారణ ఇన్నింగ్స్‌కు ఆండ్రీస్ గౌస్ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 65) కీలక సహకారం అందించాడు. ముందుగా కెనడా 20 ఓవర్లలో 5 వికెట్లకు 194 పరుగులు చేసింది. నవ్‌నీత్ ధలివాల్ (61), నికోలస్ కిర్టన్ (51) అర్ధసెంచరీలు సాధించారు. ఛేదనలో యూఎస్ఏ 17.4 ఓవర్లలోనే 3 వికెట్లకు 197 పరుగులు చేసి గెలిచింది. అయితే భారీ ఛేదనలో ఈ జట్టు తొలి ఓవర్‌లోనే వికెట్ కోల్పోగా, ఏడు ఓవర్లలో స్కోరు 45/2 మాత్రమే. ఈ దశలో జోన్స్, గౌస్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. 13వ ఓవర్‌లో గౌస్ 3 సిక్సర్లతో 20 పరుగులు రాబట్టగా, 14వ ఓవర్‌లో జోన్స్ 6,4,6 బాదడంతో పాటు పేసర్ గార్డన్ 3 వైడ్లు, 2 నోబ్స్ వేయడంతో ఏకంగా 33 రన్స్ వచ్చాయి. మూడో వికెట్‌కు జోన్స్, గౌస్ 58 బంతుల్లోనే 131 పరుగులు జత చేయడం విశేషం. ఏ వికెట్కైనా ఈ జట్టుకిదే అత్యధిక భాగస్వామ్యం. ఇక 18వ ఓవర్‌లో తొలి మూడు బంతులను జోన్స్ 4,6,6గా మలిచి మ్యాచ్‌ను ముగించాడు.

సంక్షిప్త స్కోర్లు

కెనడా: 20 ఓవర్లలో 194/5 (నవ్‌నీత్ 61, నికోలస్ 51; హర్మీత్ 1/27).
యూఎస్ఏ: 17.4 ఓవర్లలో 197/3 (జోన్స్ 94 నాటౌట్, గౌస్ 65; డిల్లాన్ 1/19).

1. టీ20ల్లో యూఎస్ఏకిదే అత్యధిక ఛేదన (195). ఇక, ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ (230), సౌతాఫ్రికా (206) తర్వాత మూడో అత్యధిక ఛేదన.

టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో క్రిస్ గేల్ (11) తర్వాత ఎక్కువ సిక్సర్లు (10) బాదిన రెండో బ్యాటర్‌గా జోన్స్.

2. టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో ఎక్కువ పరుగులిచ్చుకున్న (33) రెండో బౌలర్‌గా జెరెమీ గార్డన్.

10 సిక్సులు.. 235 స్ట్రయిక్ రేట్

టీ20 వరల్డ్‌కప్‌లో తన ఆగమనాన్ని అమెరికా ఘనంగా చాటడంలో ఆరోన్ జోన్స్‌ది కీలకపాత్ర. కెనడా నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యాన్ని జట్టు 14 బంతులు మిగిలుండగానే ఛేదించిందంటే అందుకు ప్రధాన కారణం జోన్స్. చివరిదాకా క్రీజులో నిలిచినా, ఆరు పరుగుల దూరంలో సెంచరీని మిస్సయ్యాడు. మ్యాచ్‌లో 4 ఫోర్లు, 10 సిక్సులు బాదిన జోన్స్. 235 స్ట్రయిక్ రేట్‌తో కెనడా బౌలర్లను ఊచకోత కోశాడు. ఈ క్రమంలో 2016 టోర్నీలో ఇంగ్లండ్‌పై గేల్ 11 సిక్సుల ఆల్‌టైమ్ రికార్డును దాదాపుగా బద్దలు కొట్టినంత పని చేశాడు. టోర్నీ ఆరంభానికి ముందే ఫియర్‌లెస్ క్రికెట్ ఆడతానని చెప్పిన జోన్స్. చెప్పినట్టుగానే తన తొలి మ్యాచ్‌లోనే ప్రతాపం చూపాడు. 29 ఏళ్ల జోన్స్ వెస్టిండీస్‌కు చెందిన ఆటగాడు. బార్బడోస్ జట్టు తరఫున ఆడాడు. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌కు చిన్ననాటి స్నేహితుడు. కరీబియన్ దేశవాళీ క్రికెట్ ఆడిన జోన్స్. ఆ తర్వాత అమెరికా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. జట్టులో కీలక ఆటగానిగా ఎదిగిన జోన్స్.. ఇప్పుడు ప్రపంచకప్‌లోనూ తనదైన ముద్ర వేస్తున్నాడు.

అమిత్, జాస్మిన్‌లకు ఒలింపిక్ బెర్త్‌లు



బ్యాంకాక్: వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అమిత్ పంగల్, జాతీయ చాంపియన్ జాస్మిన్ లంబోరియా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వరల్డ్ క్వాలిఫికేషన్ టోర్నీలో సెమీస్ చేరడం ద్వారా వీరిద్దరూ విశ్వక్రీడల బెర్త్‌ను పట్టేశారు. ఆదివారం జరిగిన పురుషుల 51 కిలోల క్వార్టర్స్ బౌట్‌లో అమిత్ 5-0తో చువాన్ లు (చైనా)పై నెగ్గాడు. కాగా, మహిళల 57 కిలోల క్వార్టర్స్‌లో మారిన్ కమారా (మాలి)ను లంబోరియా చిత్తుచేసింది. 57 కిలోల్లో పర్వీన్ హుడాను నాడా సస్పెండ్ చేయడంతో ఆ కోటాను కూడా భారత్ వదులుకోవాల్సింది వచ్చింది. ఈ నేపథ్యంలో 60 కిలోల్లో తలపడతున్న జాస్మిన్‌ను తక్కువ వెయిట్ కేటగిరీలో బరిలోకి దించి కోల్పోయిన బెర్త్‌ను మళ్లీ సొంతం చేసుకొంది. బాక్సర్లు నిషాంత్ (71 కి), నిఖత్ జరీన్ (50 కి), ప్రీతి (54 కి), లవ్లీనా (75 కి) ఇప్పటికే పారిస్ బెర్త్ దక్కించుకున్న సంగతి తెలిసిందే.

అర్జున్ @ 4



వరల్డ్ చెస్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ స్థానం కైవసం

టాప్-10లో ప్రజ్ఞానంద

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రపంచ చెస్ సమాఖ్య తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఓపెన్ విభాగంలో అర్జున్ తొలిసారిగా 4వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. గతంలో అత్యుత్తమంగా ఐదో స్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌లో నాలుగో రౌండ్‌లో స్పెయిన్ జీఎం అల్వార్ అలోన్సోపై అర్జున్ గెలిచాడు. దీంతో నాలుగు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఇక, నార్వే చెస్ చాంపియన్‌షిప్ ఐదో రౌండ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ కరువానా (అమెరికా)కు షాకిచ్చిన ప్రజ్ఞానంద.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంతో టాప్-10లోకి ప్రవేశించాడు. కార్ల్‌సన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక, జాతీయ మహిళల చెస్ ర్యాంకింగ్స్‌లో హంపి, హారిక తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా.. వైజాగ్‌కు చెందిన సాహితి వర్షిణి ఐదో స్థానంతో టాప్-5లో చోటు దక్కించుకుంది.

నేటి మ్యాచ్‌లు

నమీబియా X ఒమన్	వేదిక: బ్రిడ్జ్‌టౌన్	ఉ. 6 నుంచి
శ్రీలంక X దక్షిణాఫ్రికా	వేదిక: న్యూయార్క్	రా. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్‌లో..

విండీస్ కష్టంగా..



గెలిపించిన రోస్టన్ చేజ్
ఆకట్టుకున్న పపువా న్యూగినీ

గయానా: మాజీ చాంపియన్ వెస్టిండీస్ టీ20 వరల్డ్‌కప్‌లో బోణీ చేసింది. అయితే పసికూన పపువా న్యూగినీ (పీఎన్‌జీ) అంత తేలిగ్గా లొంగలేదు. తమ స్వల్ప స్కోరును కాపాడుకునేం దుకు ఆ జట్టు బౌలర్ల పోరాటం చూస్తే.. టోర్నీ తొలిరోజే అతిపెద్ద సంచలనం నమోదవుతుందేమో అనిపించింది. కానీ డెత్ ఓవర్లలో పుంజుకున్న ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రోస్టన్ చేజ్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 42 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడి విండీస్‌ను గట్టెక్కించాడు. తద్వారా మరో ఓవర్ ఉండగానే 5 వికెట్లతో విండీస్ నెగ్గింది. ఆదివారం గ్రూప్ 'సి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా పపువా జట్టు 20 ఓవర్లలో 136/8 స్కోరు చేసింది. సెసె బౌ (50) మాత్రమే ఆకట్టుకున్నాడు. 50/4తో ఇబ్బందుల్లో పడిన వేళ ఐదో వికెట్‌కు అతను అమిని (12)తో కలిసి 44 రన్స్ జోడించాడు. 17వ ఓవర్‌లో అతడిని జోసెఫ్ బౌల్డ్ చేయడంతో పీఎన్‌జీ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. డోరిగ (27 నాటౌట్) కాస్త బ్యాట్ ఝుళిపించడంతో ఆఖరి 3 ఓవర్లలో 37 రన్స్ వచ్చాయి. రస్సెల్, జోసెఫ్ రెండేసి వికెట్లు తీశారు. ఛేదనలో విండీస్ 19 ఓవర్లలో 137/5 స్కోరు చేసి నెగ్గింది. బ్రాండన్ కింగ్ (34), పూరన్ (27) రాణించారు. పిచ్ బౌలర్లకు సహకరించడంతో విండీస్ ఆశించిన మేర బ్యాటింగ్ చేయలేకపోయింది. పూరన్ ఉన్నంతసేపు ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆరో ఓవర్‌లో 6,4,6తో 18 రన్స్ రాబట్టాడు. అయితే స్వల్ప వ్యవధిలో అతడితో పాటు కింగ్ అవుటవడంతో స్కోరు నెమ్మదించింది. మధ్య ఓవర్లలో పీఎన్‌జీ స్పిన్నర్లు విండీస్‌ను కట్టడి చేశారు. ఓ దశలో చేయాల్సిన రన్‌రేట్ 10కి చేరింది. అయితే చివరి 3 ఓవర్లలో 31 రన్స్ చేయాల్సిన వేళ ఛేజ్ బ్యాట్ ఝుళిపించాడు. దీంతో మరో ఓవర్ ఉండగానే విండీస్ మ్యాచ్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు

పీఎన్‌జీ: 20 ఓవర్లలో 136/8 (సెసె బౌ 50, డోరిగ 27 నాటౌట్; రస్సెల్ 2/19, జోసెఫ్ 2/34).
వెస్టిండీస్: 19 ఓవర్లలో 137/5 (ఛేజ్ 42 నాటౌట్, కింగ్ 34; అస్సాద్ 2/28).

ఫైనల్లో ఇషాసింగ్

మ్యూనిచ్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో హైదరాబాద్ షూటర్ ఇషాసింగ్ ఫైనల్లో ప్రవేశించింది. ఆదివారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగం ప్రాథమిక రౌండ్లలో ఇషా 293 పాయింట్లతో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల కేటగిరీలో భారత షూటర్ రమిత జిందాల్ 633 పాయింట్లు స్కోరు చేసి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. మిగతా భారత స్టార్లు తిలోత్తమ సేన్, ఎలవెనిల్ క్వాలిఫయింగ్‌లో పేలవ ప్రదర్శనతో పోటీ నుంచి నిష్క్రమించారు.

నేను రెడీ!

టీమిండియా కోచ్ పదవిపై గంభీర్

దుబాయ్: టీమిండియా కోచ్ రేస్‌లో తన పేరు బలంగా వినిపిస్తున్నా.. గౌతమ్ గంభీర్ మాత్రం ఇప్పటి వరకూ ఆ విషయమై పెదవి విప్పలేదు. మరోవైపు కోచ్ పదవికి దరఖాస్తుల గడువు గతనెల 27నే ముగిసినా..ఎవరెవరు అప్లై చేశారన్న సమాచారం కూడా బయటకు రాకపోవడంతో కోచ్ అంశంలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గంభీర్ మాట్లాడుతూ.. భారత జట్టుకు కోచింగ్ ఇవ్వడం తనకు ఇష్టమేనని చెప్పేశాడు. 'కోచింగ్ ఇచ్చేందుకు నేను సిద్ధం. జాతీయ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించడంకన్నా గొప్ప గౌరవం ఏముంటుంది? అది గొప్ప పదవి' అని 42 ఏళ్ల గంభీర్ వ్యాఖ్యానించాడు.

క్వార్టర్స్‌కు స్వియటెక్, అల్కారజ్

మూడోరౌండ్ గట్టెక్కిన జొకోవిచ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో స్టార్ల జోరు కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్లో డిఫెండింగ్ చాంప్ స్వియటెక్ 6-0, 6-0తో పొటపోవాను, 3వ సీడ్ కొకొ గాఫ్ 6-1, 6-2తో కొకియరెట్టోని, 5వ సీడ్ వొంద్రుసోవా 6-4, 6-2తో డనొలోవిక్‌ని, 8వ సీడ్ జెబ్యూర్ 6-4, 6-4తో క్లారాని చిత్తుచేసి క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల్లో 3వ సీడ్ అల్కారజ్ 6-3, 6-3, 61తో ఆగర్‌పై, 9వ సీడ్ సిట్సిపాస్ 3-6, 7-6 (4), 6-2, 6-2తో ఆర్నాల్డీపై నెగ్గి క్వార్టర్స్ చేరారు. ఇక టాప్‌సీడ్ జొకోవిచ్ నాలుగో రౌండ్ చేరేందుకు ఐదుసెట్ల పాటు శ్రమించాడు. మూడో రౌండ్లో జొకో 7-5, 6-7(6-8), 2-6, 6-3, 6-0తో 30వ సీడ్ లోరెంజోపై, 7వ సీడ్ రూడ్ 6-4, 1-6, 6-2, 6-2తో థామస్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

బోపన్న బోణీ..: భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న ఫ్రెంచ్ ఓపెన్‌లో బోణీ కొట్టాడు. పురుషుల డబుల్స్ తొలిరౌండ్‌లో బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7-5, 4-6, 6-4తో బ్రెజిల్ జంట ఒరినాడో లుజ్/మార్సిలోను ఓడించింది.



టీమిండియా ఆటగాడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ స్టార్ వెంకటేశ్ అయ్యర్ ఓ ఇంటి వాడయ్యాడు. బెంగళూరుకు చెందిన శ్రుతి రఘునాథన్‌ను ఆదివారం పెళ్లి చేసుకున్నాడు.



వరల్డ్ పారా వాలీబాల్‌లో భారత్‌కు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం చైనాలో జరిగిన ఫైనల్లో భారత్ 15-21, 7-21తో పోలెండ్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. కాగా, రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో తెలుగు ఆటగాళ్లు నరేష్ యాదవ్, నాగరాజు, గణేష్, వెంకటరమణ ఉండడం విశేషం.

బిజినెస్

టాటా స్టీల్ యూకే యూనిట్‌లో
2,500 మంది ఔట్!

న్యూఢిల్లీ: టాటా స్టీల్ యూకే యూనిట్‌లో కొలువుల కోత తప్పదని కంపెనీ సీఈఓ టీవీ నరేంద్రన్ స్పష్టం చేశారు. దాదాపు 2,500 మంది ఉద్యోగులను తీసివేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సౌత్ వేల్స్‌లోని పోర్టు టాల్‌బాట్‌లో టాటా స్టీల్ ఏటా 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్ ఫ్యాక్టరీని నడుపుతోంది. బ్రిటన్‌లో ఇదే అతి పెద్ద స్టీల్ ఫ్యాక్టరీ. ఈ ఫ్యాక్టరీలో దాదాపు 8,000 మంది పని చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా టాటా స్టీల్ ఈ ఫ్యాక్టరీలో సాధారణ బ్లాస్ట్ ఫర్నేస్‌లు తొలగించి ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్‌లు ఏర్పాటు చేస్తోంది. ఈ కారణంగా 2,500 మంది ఉద్యోగులను తీసివేయాల్సి వస్తోంది. అయితే కార్మిక సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

రియల్టర్ల జోరు

న్యూఢిల్లీ: దేశంలో రియల్ ఎస్టేట్ రంగంలోని 18 లిస్టెడ్ కంపెనీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.17 లక్షల కోట్ల ప్రాపర్టీలను విక్రయించాయి. ముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.88,000 కోట్ల అమ్మకాలతో పోల్చితే ఇది 33 శాతం అధికం. రూ.22,527 కోట్ల అమ్మకాలతో గోద్రెజ్ ప్రాపర్టీస్ అగ్రగామిగా ఉంది. కొన్ని కంపెనీలు మినహాయిస్తే రియల్టీ రంగంలోని ప్రధాన డెవలపర్లందరూ అమ్మకాల్లో అద్భుతమైన వృద్ధిని నమోదు చేశారు. ప్రధాన నగరాలన్నింటిలోనూ రెసిడెన్షియల్ ప్రాపర్టీలకు ప్రత్యేకించి లగ్జరీ ఇళ్లకు డిమాండు బలంగా ఉన్నట్టు డెవలపర్లు చెబుతున్నారు.

కలిసొచ్చిన స్టాక్ మార్కెట్ ర్యాలీ..

ఆసియా సంపన్న కిరీటం అదానీకే

మరోసారి అంబానీని దాటి పైకి.. నికర ఆస్తుల విలువ రూ.9.24 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ర్యాలీ సంపన్నులను మరింత సంపన్నులను చేస్తోంది. ప్రస్తుత మార్కెట్ ర్యాలీతో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ నికర ఆస్తుల విలువ 11,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9.24 లక్షల కోట్లు) చేరింది. దీంతో గౌతమ్ అదానీ మరోసారి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని (10,900 కోట్ల డాలర్లు) అధిగమించి ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా నిలిచారు. అంతర్జాతీయంగా చూస్తే ప్రస్తుతం ప్రపంచ కుబేరుల్లో గౌతమ్ అదానీ 11వ స్థానంలో, ముకేశ్ అంబానీ 12వ స్థానంలో ఉన్నారు. ఆదివారం వెలువడిన బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ఈ విషయం తెలిపింది.

రూ.17.51 లక్షల మార్కెట్ క్యాప్: స్టాక్ మార్కెట్ ర్యాలీతో గత వారం అదానీ గ్రూప్‌లోని పది లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ రూ.17.51 లక్షల కోట్లకు చేరింది. శుక్రవారం ఒక్కరోజే అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ధర 14 శాతం వరకు పెరిగి రూ.84,064 కోట్ల మార్కెట్ క్యాప్ జోడయింది. ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజి సంస్థ 'జెఫరీస్' బుల్లిష్ వైఖరి ప్రకటించడం, వచ్చే పదేళ్లలో ప్రస్తుత వ్యాపారాలు, కొత్త వ్యాపారాలపై 9,000 కోట్ల పెట్టుబడులు ప్రకటించడదం ఈ ర్యాలీకి బాగా కలిసొచ్చింది. 2022లోనూ అదానీ ఆసియాలో అత్యంత సంపన్నుడిగా రికార్డు సృష్టించారు.

హిండెన్‌బర్గ్ దెబ్బ నుంచి రికవరీ : అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పెరుగుదల పెద్ద మాయ అని 2023 జనవరిలో అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ ప్రకటించింది. దాంతో అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాప్ 15,000 కోట్ల డాలర్లు తుడిచి పెట్టుకుపోయింది. ఆ దెబ్బతో గౌతమ్ అదానీ ప్రపంచంలోని టాప్-20 సంపన్నుల్లో కూడా స్థానం కోల్పోయారు. మళ్లీ ఏడాది తిరగకుండానే అదానీ గ్రూప్ షేర్లు ఆ సంక్షోభం నుంచి కోలుకుని ర్యాలీబాట పట్టాయి. దీంతో గౌతమ్ అదానీ మళ్లీ ఆసియాలో అత్యంత సంపన్నుడిగా స్థానం సంపాదించారు.

రూ.82,917 కోట్ల స్థూల లాభం : గత ఆర్థిక సంవత్సరం (2023-24) అదానీ గ్రూప్ కంపెనీలు రూ.82,917 కోట్ల స్థూల లాభం ఆర్జించాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. అప్పుల భారం తగ్గించుకోవడం, తనఖాలో ఉన్న ప్రమోటర్ల షేర్లను విడిపించుకోవడం, కీలక రంగాల్లో వ్యాపారాన్ని మరింత స్థిరీకరించుకోవడం ద్వారా 2023-24లో స్థూల లాభం గణనీయంగా పెంచుకున్నట్టు అదానీ గ్రూప్ తెలిపింది. గత ఐదేళ్లుగా గ్రూప్ కంపెనీల స్థూల లాభం ఏటా 54 శాతం చొప్పున పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఆర్జించిన స్థూల లాభంలో 84 శాతం కీలక మౌలిక రంగాల కంపెనీల నుంచే వచ్చిందని తెలిపింది. ఫండ్స్ ఫ్లో ఆపరేషన్స్ కూడా 51 శాతం పెరిగి రూ.56,828 కోట్లకు చేరింది.

ఏసీ అమ్మకాలు రెండింతలు



న్యూఢిల్లీ: మే నెలలో ఏసీ అమ్మకాల్లో రెండింతలు వృద్ధి నమోదయింది. ఇంధనాన్ని ఆదా చేసే మోడళ్లకు డిమాండు విశేషంగా పెరిగింది. కనివిని ఎరుగని రీతిలో నమోదవుతున్న వేసవి ఉష్ణోగ్రతలకు తాళలేక ప్రజలు ఏసీల కొనుగోళ్లకు పరుగులు తీయడంతో మే నెల అమ్మకాల్లో కొత్త రికార్డు నమోదయింది. ఫలితంగా ఏసీల ఇన్‌స్టలేషన్‌లో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. దేశ రాజధాని సహా అన్ని ప్రాంతాల్లోనూ మే నెల అంతా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైనే ఉన్నాయి. అమ్మకాల విషయానికి వస్తే ప్రధాన బ్రాండ్లయిన వోల్టాస్, ఎల్‌జీ, డైకిన్, పానాసోనిక్, బ్లూస్టార్ అమ్మకాలు గత ఏడాది మే నెలతో పోల్చితే 30 నుంచి 35 శాతం మేరకు పెరిగినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మిగిలిన రోజుల్లో కూడా అమ్మకాల్లో ఇదే జోరు కొనసాగవచ్చునని కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో 20 లక్షల ఏసీల అమ్మకం మైలురాయిని తాము సాధించగలమన్న విశ్వాసం వోల్టాస్ ఎండీ, సీఈఓ ప్రదీప్ బక్షి ప్రకటించారు. తాము గత ఐదు సంవత్సరాల రికార్డులను బద్దలుకొట్టినట్టు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చిత్కర తెలిపారు. మే నెలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమ్మకాల్లో ఆటుపోట్లుంటాయని భావించామని, కాని అందుకు భిన్నంగా డిమాండు గణనీయంగా పెరిగిందని బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ తెలిపారు. పరిశ్రమ ఉమ్మడి అమ్మకాల్లో 70 శాతం వృద్ధిని సాధించిందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జూన్ 2వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	490
వరంగల్	507	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	145	విజయవాడ	149
వరంగల్	145	గుంటూరు	149
కరీంనగర్	145	ఒంగోలు	149
మహబూబ్‌నగర్	147	చిత్తూరు	149
కర్నూలు	147	నెల్లూరు	149
విశాఖపట్నం	135	అనంతపురం	149
గోదావరి	149		

22925 పైన బుల్లిష్

(జూన్ 3-7 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రేడ్ గైడ్

గత వారం నిఫ్టీ : 22531 (-426)

నిఫ్టీ గత వారం 23110-22417 పాయింట్ల మధ్యన కదలాడి 426 పాయింట్ల నష్టంతో 22531 వద్ద ముగిసింది. ఈ వారంతంలో 22925 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22587, 22798, 22615, 22496 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22925 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 22125
నిరోధ స్థాయిలు: 22725, 22825, 22925 (22625 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22325, 22225, 22125 (22400 దిగువన బేరిష్)

అన్నీ మంచి శకునములే

మార్కెట్ వరుస నష్టాలకు గత శుక్రవారం ఫుల్‌స్టాప్ పడింది. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందనే నమ్మకం, అంచనాలను మించిన జీడీపీ వృద్ధి, ఆర్‌బీఐ 100 టన్నుల బంగారాన్ని వెనక్కి తీసుకురావడం వంటివి మదుపరుల్లో సానుకూల సెంటిమెంట్‌ను పెంచాయి. దీంతో సూచీలు మరోసారి గరిష్ఠ స్థాయిలకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వారం నిఫ్టీకి 22,600 వద్ద మద్దతు ఉండగా 22,800 వద్ద రెసిస్టెన్స్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్, రియల్టీ కన్‌స్ట్రక్షన్ రంగాల షేర్లు రాణించవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

ఎన్‌హెచ్‌పీసీ: తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరిగింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం ఊహించని రీతిలో ఈ కౌంటర్‌లో డెలివరీ, ట్రేడ్ వాల్యూమ్స్ పెరిగాయి. దీంతో షేరు ధర 6.14 శాతం పెరిగి రూ.107 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్లో రూ.118/125 టార్గెట్‌తో రూ.105/107 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.102ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ : ఈ కంపెనీ షేరు ధర గత వారం ఆల్‌టైమ్ హైని క్రాస్ చేసింది. అప్పర్ బొయింజర్ బ్యాండ్‌నీ బ్రేక్ చేసింది. డెలివరీ వాల్యూమ్స్ భారీగా పెరిగాయి. గత శుక్రవారం 12.13 శాతం లాభంతో రూ.793 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్లో రూ.835/880 టార్గెట్‌తో రూ.775/785 మధ్య పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.755ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ పోర్ట్స్ : సుదీర్ఘకాలం చక్కని బేస్ ఏర్పడిన తర్వాత ఈ కౌంటర్లో అప్‌ట్రెండ్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ కంపెనీ షేరు ధర జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. నిఫ్టీతో పోల్చినా బలం ఎక్కువగా ఉంది. శుక్రవారం 3.9 శాతం లాభంతో రూ.1437 వద్ద ముగిసింది. మదుపరులు రూ.1550/1620 టార్గెట్‌తో రూ.1420/1440 స్థాయిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1400ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జీపీఐఎల్: మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ లిమిటెడ్ (జీపీఐఎల్) షేర్లపై ఒక్కసారిగా మదుపరుల దృష్టి పడింది. చాలా కాలంగా అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో చక్కటి అక్యుములేషన్ జరిగింది. గత శుక్రవారం 6.3 శాతం లాభంతో ఈ కంపెనీ షేర్లు రూ.967 వద్ద ముగిసి ఆల్ టైమ్ హైని బ్రేక్ చేశాయి. మదుపరులు రూ.1055/1129 టార్గెట్‌తో రూ.950/960 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.925ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ టోటల్ గ్యాస్ : ఈ కౌంటర్లో రౌండ్ బాటమ్ ఏర్పడుతోంది. ఈ కంపెనీ షేరు ధర గత వారం గరిష్ఠాన్ని బ్రేక్ చేయడమే గాక ట్రేడింగ్ వాల్యూమ్స్ కూడా గణనీయంగా పెరిగి షేరు ధర 8.8 శాతం లాభంతో రూ.1039 వద్ద ముగిసింది. నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగైన పనితీరు కనబరుస్తోంది. రూ.1140/1240 టార్గెట్‌తో రూ.1030/1040 స్థాయిలో మదుపరులు ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.990ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక స్థాయి 23100

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 23000 వద్ద రియాక్షన్‌లో పడి వారం అంతా అదే ధోరణిలో నడిచింది. కాని శుక్రవారం 22500 వద్ద రికవరీ సాధించి అదే స్థాయిలో నిలకడగా ముగిసింది. అయినా వారం మొత్తం మీద 430 పాయింట్లు నష్టపోయింది. టెక్నికల్‌గా గతంలో సాధించిన ర్యాలీ అనంతరం ఏర్పడిన సాధారణ కరెక్షన్ ఇది. అలాగే ముందు వారం ఎన్నో ప్రయత్నాల అనంతరం 23000 వద్ద సాధించిన బ్రేకౌట్‌కు పుల్‌బ్యాక్ రియాక్షన్‌గా కూడా దీన్ని భావించవచ్చు. అయినా స్వల్పకాలిక మద్దతు స్థాయి 22500 కన్నా పైనే ఉండడం పాజిటివ్ ట్రెండ్ సంకేతం. గత వారంలో మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 720 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 190 పాయింట్ల నష్టంతో ముగిశాయి. శుక్రవారం వెల్లడైన జీడీపీ గణాంకాలు, శనివారం వెల్లడైన ఎగ్జిట్ పోల్ ఫలితాలు, అమెరికన్ స్టాక్ మార్కెట్ ధోరణులను బట్టి ఈ వారంలో పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. మరోసారి 23000 వద్ద పరీక్షకు గురయ్యే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: ఈ వారంలో గ్యాప్ అప్ ఉంటుందని భావిస్తున్న రీత్యా ఎక్కడ, ఎలా ప్రారంభమయ్యేది మార్కెట్ వేళలు మొదలైన తర్వాతే తెలుస్తుంది. ఆటుపోట్లను తగ్గించుకుని నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. పాజిటివ్ ధోరణిలో ప్రారంభమైతే పైన నిరోధ స్థాయిలు 22900, 23100. ఆ పైన మాత్రమే కొత్త శిఖరాల దిశగా పురోగమిస్తుంది.

బేరిష్ స్థాయిలు: 22900 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22500. సాధారణ పరిస్థితిలో ఈ స్థాయి వరకు దిగజారకపోవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం పాజిటివ్ ట్రెండ్‌లోనే మొదలైనా 49600 వద్ద రియాక్షన్‌లో పడి చివరికి 49000 సమీపంలో ఫ్లాట్‌గా ముగిసింది. రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 50000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మైనర్ నిరోధం 49500 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్ : గత వారం మార్కెట్ 25, 50 డీఎంఏల వద్ద మైనర్ రికవరీ సాధించింది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని కూడా సద్దుబాటు చేసుకుంది. మరింత అప్‌ట్రెండ్ కోసం 23100 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉంది.

సోమ వారం స్థాయిలు	
నిరోధం :	22900, 23040
మద్దతు :	22800, 22730

www.sundartrends.in